thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 273 | కరీంనగర్ బుధవారం, 10 డిసెంబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## ఉబర్ ఓలాకు పోటీగా భారత్ ట్యాక్సీ

న్యూఢిల్లీ : క్యాబ్ సర్వీసులు అందించే ఓలా, ఉబర్‌లకు పోటీగా 'భారత్ ట్యాక్సీ' వస్తోంది. క్యాబ్ నిర్వాహకుల నుంచి ఎలాంటి కమీషన్లు వసూలు చేయకుండా, సహకార పద్ధతిలో నిర్వహించే ఈ సర్వీసుతో.. అటు క్యాబ్ నిర్వాహకులకు, ఇటు ప్రయాణికులకు ప్రయోజనం కలగనుంది. ఓలా, ఉబర్ సంస్థలు క్యాబ్ నిర్వాహకులు, డ్రైవర్ల నుంచి అడ్డగోలుగా 25 వరకు కమీషన్లు వసూలు చేస్తున్నాయని.. ప్రయాణాల రద్దు, రద్దీ సమయాల పేరిట ప్రయాణికుల నుంచి అడ్డగోలు చార్జీలు వసూలు చేస్తున్నాయనే ఆరోపణలున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే ప్రైవేటు క్యాబ్ సర్వీసులకు ప్రత్యామ్నాయాన్ని అందుబాటులోకి తేవడం.. క్యాబ్ నిర్వాహకులు, డ్రైవర్లకు ప్రయాణ చార్జీలు పూర్తిగా అందేలా చేయడం లక్ష్యంగా.. కేంద్ర సహకారశాఖ, జాతీయ ఈ-గవర్నెన్స్ విభాగం (ఎన్ఈజీడీ) 'భారత్ ట్యాక్సీ'ని రూపొందించింది. రూ.300 కోట్ల మూలధనంతో 'సహకార్ ట్యాక్సీ కో-ఆపరేటివ్ లిమిటెడ్' సంస్థను ఏర్పాటు చేసింది.




## తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్..

# సూపర్ సక్సెస్!

## రూ.5.75 లక్షల కోట్ల పెట్టుబడులు

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన రైజింగ్ గ్లోబల్ సమిట్ సూపర్ సక్సెస్ అయ్యింది. రికార్డు స్థాయిలో ఒప్పందాలు కుదిరాయి. రెండురోజుల్లో కలిపి వివిధ కంపెనీలు, పరిశ్రమలు రూ.5.75 లక్షల కోట్ల మేర పెట్టుబడులకు ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

**ఒప్పందాల్లో కొన్ని..** రాష్ట్రంలో రూ.70వేల కోట్ల పెట్టుబడులకు ప్రభుత్వంతో ఇన్‌ఫ్రాకీ పార్క్ ఒప్పందం కుదుర్చుకుంది. 150 ఎకరాల్లో 1 గిగావాట్ సామర్థ్యం గల డేటా పార్క్ ఏర్పాటు చేయనుంది. రూ.9వేల కోట్ల పెట్టుబడులకు జెసీకే ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ఒప్పందం. పర్యాటక రంగంలో రూ.7,045 కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు. ఏజీపీ గ్రూప్ మొత్తం రూ.6,750 కోట్ల పెట్టుబడులకు ఒప్పందం. 1 గిగావాట్ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయనున్న ఏజీపీ గ్రూప్. రూ.3,500 కోట్ల పెట్టుబడులకు బయోలాజికల్-ఈ సంస్థ ఒప్పందం. పరిశోధన, అభివృద్ధి, తయారీల పెట్టుబడులు పెట్టనున్న బయోలాజికల్- ఈ సంస్థ. రూ.2 వేల కోట్ల పెట్టుబడులకు ఫెర్టిస్ ఇండియా సంస్థ ఒప్పందం. ఫుడ్, అగ్రికల్చర్ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటుకు ఫెర్టిస్ ఇండియా ఒప్పందం. రూ.3వేల కోట్ల పెట్టుబడులకు ముందుకొచ్చిన ఫుడ్ లింక్ ఎఫ్ అండ్‌బీ హోల్డింగ్స్. డ్రీమ్‌వాలీ గోల్ఫ్ అండ్ రిసార్ట్స్‌ను రూ. వెయ్యికోట్లతో నిర్మించనున్న ఫుడ్ లింక్. రూ.1100 కోట్లతో ప్రపంచంలోనే తొలి ప్లగ్-ఇన్ హైబ్రిడ్ మోటార్‌బైక్ కేంద్రం ఏర్పాటు. 500 మందికి ఉద్యోగాలు.

**పేదరికం ఏంటో నాకు తెలుసు.. అందుకే ఈ తపన: సీఎం రేవంత్...**

సమాజంలో ఉన్న వివక్షత నిర్మూలన తమ ప్రభుత్వ లక్ష్యం అని.. విద్య మీద ఖర్చు చేసేది వ్యయంగా కాకుండా పెట్టుబడిగా చూస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఫ్యూచర్ సిటీ మీర్‌ఖాన్ పేటలో మంగళవారం జరిగిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025 ముగింపు కార్యక్రమంలో పాల్గొని ఆయన ప్రసంగించారు. తెలంగాణ మట్టికి గొప్ప చైతన్యం ఉంది. జల్, జంగిల్, జమీన్ అని కొమురం భీమ్ పోరాడిన గడ్డ ఇది. భూమి కోసం భుక్తి కోసం విముక్తి కోసం సాయుధ రైతాంగ పోరాటంలో ఎంతో మంది నేలకొరిగిన చరిత్ర ఈ ప్రాంతానిది. స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాల కోసం తెలంగాణ ఎదురుచూస్తోంది. తెలంగాణ ప్రజలు కోరుకున్న స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు అందించేందుకు తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్‌ను తీసుకొచ్చాం 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యంగా విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించాం. ఇది నాలుగు గోడల మధ్య కూర్చుని తయారు చేసింది కాదు.. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల అభిప్రాయాలు తీసుకుని తయారు చేసింది. ఆనాడు ఎడ్యుకేషన్, ఇరిగేషన్ కు జవహర్ లాల్ నెహ్రూ ప్రాధాన్యత ఇచ్చారు.. ఇప్పుడు మేం ఎడ్యుకేషన్, ఇరిగేషన్, కమ్యూనికేషన్ నినాదంతో ముందుకు వెళ్తున్నాం. ఎడ్యుకేషన్, ఇరిగేషన్ కు ప్రాధాన్యత. పేదలలో నిరుపేదలకు సహాయం చేయడం మా ప్రాధాన్యత. సమాజంలో ఉన్న వివక్షత నిర్మూలన మా లక్ష్యం. ఎడ్యుకేషన్ కోసం ఖర్చు చేసేది వ్యయం కాదు పెట్టుబడి. ఇప్పుడున్న ఎడ్యుకేషన్‌లో క్వాలిటీ, స్కిల్ లేదు. దాన్ని మేం నెలకొల్పుతాం. 140 కోట్ల జనాభాలో ఎంతమంది మెడల్స్ వస్తున్నాయి?. యంగ్ ఇండియా స్పోర్ట్స్ స్కూల్ నుండి గోల్డ్ మెడల్స్ తెచ్చేలా కృషి చేస్తాం పేదరిక నిర్మూలన, నాణ్యమైన విద్య, యువతకు ఉపాధి అందించాలనే సంకల్పంతో ముందుకు వెళ్తున్నాం. పేదలకు సంక్షేమ ఫలాలు అందించాలన్నదే మా ఆకాంక్ష. కొందరికి పేదరికం ఎక్స్కర్షన్ లాంటిది.. కానీ నాకు పేదరికం ఏంటో తెలుసు. నేను గ్రామీణ ప్రాంతం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లోచదువుకుని వచ్చా. నాకు పేదలు, దళితులు, ఆదివాసీలతో మంచి అనుబంధం ఉంది. పేదల కష్టాలు తెలిసినవాడిగా ప్రతీ పేదవాడికి సంక్షేమం అందించాలన్నదే నా తపన.. .. విద్యార్థి దశలోనే కులవివక్షను నిర్మూలించేందుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనార్టీ లకు ఒకే చోట విద్యను అందించేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తున్నాం.

ఇది మేం ఖర్చుగా భావించడంలేదు. ఇది తెలంగాణ భవిష్యత్‌కు పెట్టుబడిగా భావిస్తున్నాం. నాణ్యమైన విద్య, స్కిల్స్ లేకపోవడంతో నిరుద్యోగం పెరుగుతోంది అందుకే యువతలో నైపుణ్యం పెంపొందించేందుకు స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేసుకున్నాం. ఒలంపిక్స్ లక్ష్యంగా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేసుకుంటున్నాం. అట్టడుగు వర్గాల, పేదల అభివృద్ధి కోసమే ఈ తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్" అని రేవంత్ ప్రసంగించారు.




హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025 ముగింపు వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన భారీ డ్రోన్ షో అందరినీ ఆకట్టుకుంది. తెలంగాణ రైజింగ్ 2047 డాక్యుమెంట్ లక్ష్యాలను వివరించే థీమ్‌లతో డ్రోన్ షో ఏర్పాటు చేశారు. గిన్నిస్ బుక్ రికార్డు సాధించేలా 3 వేల డ్రోన్‌లతో ప్రత్యేక ప్రదర్శన నిర్వహించారు. గతంలో అబుదాబిలో డ్రోన్ల ప్రదర్శనను మించి దీనిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన గిన్నిస్ వరల్డ్ రికార్డు సభ్యులు ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి ధృవపత్రాన్ని అందజేశారు. ఈ సమ్మిట్-2025 ముగింపు వేడుకల్లో భారీగా బాణసంచా కాల్చారు. ఈ వెలుగుల్లో గ్లోబల్ సమ్మిట్ ప్రాంగణం ప్రత్యేక శోభను సంతరించుకుంది.

## విజన్ డాక్యుమెంట్-2047 ఓ దిక్సూచి: డిప్యూటీ సీఎం మల్లు

హైదరాబాద్, డిసెంబర్ 09: తెలంగాణ రాష్ట్రాభివృద్ధికి విజన్ డాక్యుమెంట్-2047 ఓ దిక్సూచి అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అభివర్ణించారు. విస్తృత సంప్రదింపులు, నిపుణుల అభిప్రాయ సేకరణ తర్వాతే..ఈ తెలంగాణ విజన్ డాక్యుమెంట్-2047ను రూపొందించామని తెలిపారు. మంగళవారం తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ - 2025లో సెషన్లు ముగిశాయి. అనంతరం తెలంగాణ విజన్-2047 డాక్యుమెంట్‌ను విడుదల చేశారు.

ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఈ విజన్ డాక్యుమెంట్ మనందరిది అని స్పష్టం చేశారు. సమ్మిళిత వృద్ధి తెలంగాణ లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. మంగళవారం ముగియనున్న ఈ సమ్మిట్‌కు దేశ విదేశాల నుంచి వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు హాజరయ్యారు.

**ప్రపంచానికి హైదరాబాద్ ఒక ఐకానిక్ సిటీ: ఆర్బీఐ మాజీ గవర్నర్...** తెలంగాణ గణనీయమైన వృద్ధి సాధిస్తోందని ఆర్బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు వెల్లడించారు. ప్రపంచానికి హైదరాబాద్ ఒక ఐకానిక్ సిటీ అని అభివర్ణించారు. దేశంలోనే హైదరాబాద్ అదుతే ప్రగతి సాధిస్తోందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ విజన్ డాక్యుమెంట్‌లో భాగస్వామ్యం కావడం తనకు సంతోషకరంగా ఉందన్నారు. చైనా వాంగ్‌డాంగ్‌ను మించి తెలంగాణ అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. దీర్ఘకాలిక లక్ష్యాలకు అనుగుణంగా విద్య, వైద్యంపై దృష్టి పెట్టాలని ప్రభుత్వానికి ఆర్బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు సూచించారు.

**అభివృద్ధిలో ప్రత్యేక మార్గం ఎంచుకుంటున్న తెలంగాణ: ఆనంద్ మహీంద్రా...** తెలంగాణ విజన్ చాలా మార్గదర్శకంగా ఉందని మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా తెలిపారు. అభివృద్ధిలో తెలంగాణ ప్రత్యేక మార్గం ఎంచుకుంటోందని ఆయన పేర్కొన్నారు. యంగ్ ఇండియా స్కిల్ వర్సిటీ చైర్మన్‌గా ఉండటం తన అదృష్టమని ఆయన చెప్పారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఈ దేశ భవిష్యత్ అని ఆనంద్ మహీంద్రా అభివరి?ంచారు.

**సమ్మిట్‌లో రూ. లక్షల కోట్ల పెట్టుబడులు..** తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో రూ. 5, 39, 495 కోట్లు ఎంఓయూలు ద్వారా పెట్టుబడులుగా వచ్చాయి. తొలి రోజు రూ. 2,00,043 కోట్లు.. రెండో రోజు ఇప్పటి వరకు రూ. 2,96,495 కోట్లు పెట్టుబడులుగా వచ్చాయి. పరిశ్రమలు, ఐటీ, పవర్, స్పోర్ట్స్, టూరిజం, ఫారెస్ట్ తదితర రంగాల్లో పెట్టుబడులు వెల్లువెత్తాయి. ఇక విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో రికార్డు స్థాయిలో పెట్టుబడుల్లో ఒప్పందాలు కుదిరాయి. గ్లోబల్ సమ్మిట్‌లో రూ. 3, 24, 698 కోట్ల పెట్టుబడి ఒప్పందాలు కుదిరాయి. ఈ రెండు రోజుల్లో 1,40,500 మంది తెలంగాణ యువతకు ఉపాధి కల్పించనున్నారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో భారీ ఒప్పందాలు కుదిరాయి.




పెట్టుబడులకు స్వర్గధామం తెలంగాణ అని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. గ్లోబల్ సమ్మిట్ కోసం విద్యుత్ శాఖ పకడ్బందీ ప్రణాళిక అమలు చేసిందని చెప్పారు. ఈ పెట్టుబడులు ఆకర్షించేందుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పలుమార్లు ఉన్నతాధికారులతో వరుస సమీక్షలు నిర్వహించారు. అలాగే ఒప్పందాల పురోగతిని ఆయన స్వయంగా పర్యవేక్షించారు.




# పీక్స్‌కి చేరిన పంచాయతీ పోరు

## మొదటి విడతకు ముగిసిన ప్రచారం

## సోషల్ మీడియాలో దుమారం రేపుతున్న అభ్యర్థులు

హైదరాబాద్ : పంచాయతీ పోరు పీక్స్ చేరుకుంది. అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారం చేస్తూ గ్రామపోరును రసవత్తరంగా మారుస్తున్నారు. గతానికి భిన్నంగా పంచాయతీ ఎన్నికల్లో విస్తృతంగా సోషల్ మీడియాలో ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. మొదటి విడత ప్రచారం ముగిసింది. ఇక సోషల్ మీడియాపై దృష్టి సారించారు. కేటాయించిన గుర్తులు, ఫొటోలతో పాటు... గెలిపిస్తే చేయబోయే అంశాలు వివరిస్తూ ఓటర్లను ఆకర్షించేందుకు నూతన ఒరవడులు తొక్కుతున్నారట అభ్యర్థులు.

**ప్రచారం పై పార్టీ నేతలు ఫోకస్...** తెలంగాణలో పంచాయతీ ఎన్నికలతో గ్రామాల్లో రాజకీయం హీటెక్కింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరుగుతున్న గ్రామ పంచాయతీల్లో సత్తా చాటేందుకు ప్రధాన పార్టీల నేతలు వ్యూహరచన చేస్తున్నారు. ఇప్పటికే నామినేషన్ల దాఖలు ప్రక్రియ ముగియడంతో ప్రచారంపై ఫోకస్ చేశారు అభ్యర్థులు. పోటీ చేస్తున్న అభ్యర్థులు గతానికి భిన్నంగా సోషల్ మీడియాను వినియోగించుకుంటున్నారట. ప్రతి గ్రామంలో వార్డు మెంబర్ గా పోటీ చేస్తున్న వారు.. సర్పంచ్ గా బరిలో నిలిచినవారు సోషల్ మీడియా వేదికగాను ప్రచారం చేస్తున్నారు. గ్రామానికి చెందిన వారు ఇతర ప్రాంతాల్లో ఉంటే వారికి సమాచారం చేరవేసే విధంగా చర్యలు తీసుకుంటున్నారట. గెలిపిస్తే ఏం చేస్తాం.. అభివృద్ధి పనులు ఇతరాత్రాలను సైతం పోస్టులు పెడుతున్నారు. ఏ వార్డుకు పోటీ చేస్తున్నామనే విషయాన్ని సైతం స్పష్టంగా చెబుతున్నారు. అంతేకాదు ఏ గుర్తు కేటాయించిందనే అంశాలను సైతం ఫేస్ బుక్, వాట్సాప్, ఇన్ స్టాగ్రాం.. టెలిగ్రాం ఇలా అన్నింటిలోనూ ప్రచారం చేస్తూ ఓట్లను అభ్యర్థిస్తున్నారు.

**కాంగ్రెస్ వర్సస్ బీఆర్ఎస్...** రాష్ట్రంలో తొలి విడత, రెండో విడత బరిలో ఉండే అభ్యర్థుల ప్రకటన జరిగింది. వారికి అధికారులు గుర్తులు సైతం కేటాయించారు. ఈ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు పార్టీ గుర్తులతో జరుగకపోయినప్పటికీ ఆయా పార్టీల మద్దతుతోనే అభ్యర్థులు బరిలో నిలిచారు. అయితే గ్రామాల్లో ఎక్కువగా అధికార కాంగ్రెస్ పార్టీ, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ మధ్యే పోటీ తీవ్రంగా నెలకొంది. కొన్ని గ్రామాల్లో కొందరు పార్టీల మద్దతు ఇవ్వకపోవడంతో స్వతంత్రంగా బరిలో నిలిచారు. వారికి సైతం గుర్తులు వచ్చాయి. తొలివిడత ఈ నెల 11న, రెండో విడుత 14న ఎన్నికలు జరుగనుండటంతో విస్తృత ప్రచారంను అభ్యర్థులు చేస్తున్నారు. అయితే వార్డుల వారీగా ఓటర్ల లిస్టు ప్రకారం వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి గెలిపిస్తే చేయబోయే అంశాలను అందులో పోస్టు చేస్తున్నారు. తనకు ఫలానా గుర్తు కేటాయించారని.. ఆ గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. దీనికి తోడు సోషల్ మీడియాలో ఫొటోలు, కేటాయించిన గుర్తులను పోస్టు చేసి విస్తృత ప్రచారం చేస్తున్నారు. దీంతో సోషల్ మీడియాలోనూ ప్రచారం ఊపందుకుంది.

**ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం...** పోటీ చేసే అభ్యర్థులు ఇంటింటికెళ్లి గెలిపిస్తే ఏం చేస్తామనే విజన్‌ను వివరిస్తున్నారు. గ్రామాభివృద్ధి కోసం ఐదేళ్లలో చేయబోయే కార్యక్రమాల ప్రణాళికలు రెడీ చేశామని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. గెలిపిస్తే డ్రైనేజీ సమస్య పరిష్కరిస్తా.. కోతులు గ్రామానికి రాకుండా చేస్తా.. ఊరిలో సీసీ కెమెరాలు పెట్టిస్తా.. గ్రంథాలయం ఏర్పాటు చేస్తా.. మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయిస్తా.. ఒకడుగు ముందుకేసి నిరుద్యోగుల కోసం ఉద్యోగ మేళా, హెల్త్ క్యాంపులు పెట్టిస్తామని.. సీసీరోడ్లు, క్రీడా పరికరాలు.. ఇలా హామీలిస్తూ ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం మొదలు పెట్టారట. చీరలు, కుంకుమ భరిణెలు, నగదు ఇతర కానుకలు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయట.

**మద్దతుదారులను గెలిపించుకునేందుకు స్పెషల్ ఫోకస్...** సర్పంచ్ ఎన్నికల ప్రచారానికి సమయం దగ్గరపడుతుండటంతో ప్రధాన పార్టీల నేతలు గ్రామాలకు చేరుతున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ తమ మద్దతుదారులను గెలిపించుకునేందుకు స్పెషల్ ఫోకస్ పెట్టారట. పార్టీలకు సంబంధం లేకుండా జరిగే ఎన్నికలే అయినా.. తమ వాళ్లే గెలవాలనే పట్టుదలతో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు నియోజకవర్గ ఇన్-చార్జిలు, తదితర నాయకులు గ్రామాల బాటపట్టారట. సొంత గ్రామాలపై మరింత ఫోకస్ పెట్టారు నేతలు. పంచాయతీల్లో పట్టు సాధించి, రానున్న ఎన్నికలకు గట్టి పునాది వేసేలా ముందుకెళ్తున్నారు. తమ సత్తా చాటేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. తమ మద్దతు దారులు గెలిచేందుకు వ్యూహాలు రచిస్తున్నారు. ఎదుటి వ్యక్తిలోని లోపాలను తెలుసుకొని ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నారు. ఇది ఇలా ఉంటే గ్రామాల్లో మాత్రం సోషల్ మీడియాలో మాత్రం పంచాయతీ ఎన్నికల ప్రచారానికి అభ్యర్థులు వేదికగా చేసుకుంటున్నారు. విస్తృత ప్రచారం చేసుకుంటున్నారు. ఓటర్లను ఆకర్షించేందుకు వీడియోలు సైతం పోస్టు చేస్తున్నారట.

**పట్నం పై పల్లె ఫోకస్...** పట్నంపై పల్లె ఫోకస్ పెట్టింది. పంచాయతీ ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థులు ఎవరెవరు పట్నాలలో ఉన్నారు.. ఎంత మంది ఉన్నారనేది ఆరా తీయడంతో పాటు వారికి ఎన్ని ఓట్లు ఉన్నాయి.. ఎలా రప్పించాలనే ప్రయత్నాలు ముమ్మరం చేశారట అభ్యర్థులు. ఫోన్ చేస్తూ పోలింగ్ రోజూ విధిగా గ్రామాలకు తీసుకొచ్చే ప్లాన్ చేస్తున్నారట. అంతేకాదు వరుసలు సైతం కలిపి తనను గెలిపించాలని.. గెలిపిస్తే ఏం పని కావాలన్నా చేసి పెడతానంటూ హామీలు ఇస్తున్నారట. ఓటర్లను ఇతర ప్రాంతాల నుంచి రప్పించేందుకు కొంతమంది నేతలకు పార్టీలు సైతం బాధ్యతలు అప్పగిస్తున్నాయి. వారిని పోలింగ్ బూత్ వరకు తీసుకొచ్చే వరకు వారిదే బాధ్యత అని చెబుతున్నట్లు సమాచారం.

**ప్రతీ ఒక్క ఓటు కీలకం...** సర్పంచ్ ఎన్నికల్లో ప్రతీ ఒక్క ఓటు కీలకం. గతంలో ఒక్క ఓటుతో ఓడిపోయిన సర్పంచ్ స్థానాలు చాలా ఉండటం తో సర్పంచ్ గా, వార్డు సభ్యులుగా పోటీ చేస్తున్న అభ్యర్థులు ఇతర ప్రాంతాల్లో ఉన్న ఓటర్లపై ప్రత్యేక ఫోకస్ పెట్టారు. అంటే పోటీచేసే వారు ఎన్నికలకు ఎంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నారనేది స్పష్టమవు తోంది. ఇది ఇలా ఉంటే మనకులానికి ఈసారి పోటీచేసే అవకాశం వచ్చింది. ఖచ్చితంగా గెలిపించుకుందాం.. లేకుంటే ఎప్పుడు గెలువలేమని.. అందరూ కలిసి రావాలని ఫోన్ చేసి విజ్ఞప్తులు చేస్తున్నారట. ఓవరాల్ గా పోలింగ్ గడువు సమీపిస్తున్న కొద్ది గ్రామాల్లో ప్రచారం ఊపందుకుంది.

చురకలు






హైదరాబాద్: ఆరు దశాబ్దాల తెలంగాణ ప్రజల ఆకాంక్షను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కలెక్టరేట్లలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాలను ఫ్యూచర్ సిటీలోని గ్లోబల్ సమిట్ ప్రాంగణం నుంచి సీఎం రేవంత్‌రెడ్డి వర్చువల్‌గా ప్రారంభించారు. రాష్ట్రంలోని 33 కలెక్టరేట్లలో రూ.5.8 కోట్లతో తెలంగాణ తల్లి విగ్రహాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మొత్తం 18 అడుగుల ఎత్తుతో విగ్రహాల నిర్మాణం జరిగింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ..."తెలంగాణ తల్లి విగ్రహాల ఆవిష్కరణ జరగడం ఆనందంగా ఉంది. 2009లో ఇదే రోజు (డిసెంబర్ 9) తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైంది. 6 దశాబ్దాల ప్రజల ఆకాంక్షలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చింది. ఏటా డిసెంబరు 9న తెలంగాణ తల్లి ఆవిష్కరణ ఉత్సవాలు నిర్వహిస్తున్నాం.

తెలంగాణ తల్లిని తలుచుకుని పనులు మొదలు పెట్టేందుకే విగ్రహాలు ఆవిష్కరించాం. స్వరాష్ట్ర కల నిజమై.. సంక్షేమం, అభివృద్ధిలో రాష్ట్రం నంబర్ వన్‌గా రూపొందుతోంది. సోనియా గాంధీ ఎన్నో అడ్డంకులు అధిగమించి మరీ ప్రత్యేక రాష్ట్రం ఇచ్చారు. ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన గొప్ప నాయకురాలు సోనియాగాంధీ జన్మదినం డిసెంబరు 9న కావడం మా అందరికీ సంతోషాన్ని కలిగించే పర్వదినం. ఏటా తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవాలతో పాటు, సోనియా గాంధీ జన్మదిన ఉత్సవాలను తెలంగాణ ప్రజలు నిర్వహించుకుంటారు. మా పథకాలు, కార్యక్రమాల్లో సోనియా, మన్మోహన్ స్ఫూర్తి కొనసాగుతోంది" అని రేవంత్‌రెడ్డి అన్నారు.




హైదరాబాద్: ఇండిగో విమాన సర్వీసుల సంక్షోభం కొనసాగుతోంది. మంగళవారం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు రావాల్సిన 14, ఇక్కడి నుంచి వెళ్లాల్సిన 44 విమానాలు రద్దయ్యాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. విశాఖ నుంచి బెంగళూరు, హైదరాబాద్‌కు వెళ్లే 6 ఇండిగో సర్వీసులను రద్దు చేశారు. ఇండిగో సంక్షోభం దృష్ట్యా ప్రయాణికులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. స్పైస్‌జెట్ విమానయాన సంస్థ దేశవ్యాప్తంగా వంద అదనపు విమానాలను అందుబాటులోకి తెచ్చింది. ప్రయాణికుల సౌకర్యార్థం రైల్వే, తెలంగాణ ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడుపుతోంది. ముంబయి, దిల్లీ, పుణె, హౌవ్‌డా నుంచి హైదరాబాద్‌కు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నారు. చెన్నై, బెంగళూరు, విజయవాడ, రాజమహేంద్రవరం, కాకినాడ, విశాఖతో పాటు ఇతర ప్రాంతాలకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు.




హైదరాబాద్, డిసెంబర్ 9: ఫ్యూచర్ సిటీలో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ రెండో రోజు కొనసాగుతోంది. తెలంగాణలో పెట్టుబడులకు దేశ, విదేశాలకు చెందిన వివిధ కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయి. గ్లోబల్ సమ్మిట్‌లో వివిధ కంపెనీల ప్రతినిధులతో వరుస సమావేశాలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బిజీబిజీగా ఉన్నారు. ముఖ్యమంత్రి సమక్షంలో తెలంగాణలో పెట్టుబడులకు పలు కంపెనీలు ఎంవోయూలు కుదుర్చుకుంటున్నాయి. సుమధుర గ్రూప్, టీసీసీఐ తైవాన్ గ్రూప్.. ప్రభుత్వంతో ఎంవోయూలు కుదుర్చుకున్నాయి.

తాజ్ జీవీకే మేనేజింగ్ డైరెక్టర్ శాలిని భూపాల్, సుమధుర గ్రూప్ ప్రతినిధులు.. ముఖ్యమంత్రి రేవంత్‌ను కలిసి ప్రభుత్వంతో ఎంవోయూ కుదుర్చుకున్నారు. అలాగే సీఎం రేవంత్‌ను ప్రెస్టీజ్ గ్రూప్ సీఈఓ స్వరూప్ అనివేశ్, అనలాగ్ ఏ ఐ ఓటూడ్లోజ్ ప్రతినిధులు, డ్రీమ్ వాలీ గోల్ఫ్ అండ్ రిసార్ట్స్ ప్రతినిధులు, సెంబ్ కార్ప్ (సింగపూర్) ప్రతినిధులు, తల్వాన్ గ్రూప్ ప్రతినిధులు కలిశారు. కాగా.. రెండో రోజు గ్లోబల్ సమ్మిట్ ఉదయం 10 గంటలకు మొదలైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉదయమే గ్లోబల్ సమ్మిట్ ప్రాంగణానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో తెలంగాణ తల్లి విగ్రహాలను వర్చువల్‌గా ఆవిష్కరించారు. ఆరు జిల్లాలు మినహా రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో దాదాపు రూ.6 కోట్లతో తెలంగాణ తల్లి విగ్రహాలను ఏర్పాటు చేశారు. గత ఏడాది మొదటి సంవత్సరం పూర్తి అయిన సందర్భంగా రాష్ట్ర సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని సీఎం రేవంత్ ఆవిష్కరించిన విషయం తెలిసిందే. అవే విగ్రహాలను అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో ఏర్పాటు చేయాలని గతంలోనే ప్రభుత్వం జీవో తీసుకొచ్చింది. ఇందులో భాగంగా ఈరోజు అధికారికంగా అన్ని జిల్లా కేంద్రాల్లో తెలంగాణ తల్లి విగ్రహాలను సీఎం రేవంత్ వర్చువల్‌గా ఆవిష్కరించారు.



## 3 ట్రిలియన్ ఎకానమీలో టూరిజం పాత్ర కీలకం: మంత్రి జూపల్లి

హైదరాబాద్: దేశంలోనే తెలంగాణకు మంచి చారిత్రక వారసత్వ సంపద ఉందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్‌లో నిర్వహించిన తెలంగాణ హెరిటేజ్, కల్చర్, ఫ్యూచర్ రెడీ టూరిజం సెషన్‌లో మంత్రి కొండా సురేఖతో కలిసి పాల్గొన్నారు. తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్ ఎకానమీగా ఎదగాలంటే టూరిజం పాత్ర కీలకమన్న మంత్రి.. అందుకు ఇటీవల తీసుకువచ్చిన టూరిజం పాలసీ 2025-30 ఉపయుక్తంగా ఉంటుందన్నారు. మన చారిత్రక వారసత్వం గురించి తెలంగాణ పౌరులంతా తెలుసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎకో టూరిజం నూతనాధ్యాయంగా నిలుస్తుందని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. రాష్ట్ర విస్తీర్ణంలో 19 శాతం అడవులు ఉండడం, స్వతఃసిద్ధంగా తెలంగాణ ప్రకృతిరమణీయంగా ఉండటం మంచి వరమని అభివర్ణించారు. ఇలాంటి నేలపై ఉన్న దేవాలయాలు కూడా మరింత అభివృద్ధికి నోచుకోవాలని తెలిపారు. అందుకోసం టూరిజం డిపార్ట్‌మెంట్‌తో కలిసి పనిచేస్తున్నట్లు వెల్లడించారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో పులుల సంఖ్య 36కు పెరగడం హర్షించదగ్గ విషయమన్నారు. దేవాలయాలను పునరుద్ధరిస్తామన్న మంత్రి... వాటి పరిరక్షణ కేవలం పరిపాలన అంశం మాత్రమే కాదని, జీవ వైవిధ్య, ప్రజల సంస్కృతిని పరిరక్షించడమని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామోజీ ఫిల్మ్‌సిటీ వైస్ ప్రెసిడెంట్ ఏవీ రావు పాల్గొని మాట్లాడారు. ఆర్ఎఫ్‌సీ కోర్ సినిమా అని తెలిపారు. పర్యాటక ప్రాంతాల్లో సమగ్రాభివృద్ధి.. టూరిజాన్ని మరింత పెంచుతుందన్నారు. 'తెలంగాణ జరూర్ ఆనా' మంచి క్యాచీ నినాదంగా మారిందన్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీలో వాటర్ పార్క్ లాంటివి త్వరలో తీసుకురానున్నట్లు తెలిపారు. ఎకో టూరిజం, మెడికల్ టూరిజం, వెల్‌నెస్ టూరిజంపై ప్రత్యేక దృష్టిసారించనున్నట్లు పేర్కొన్నారు.

## ఆసియాకు ఇన్నోవేషన్ క్యాపిటల్‌గా తెలంగాణ: భట్టి విక్రమార్క



హైదరాబాద్: దేశ ఎకానమీ చరిత్రలో లేని అత్యంత భారీ లక్ష్యాన్ని 2047 కోసం నిర్దేశించుకున్నామని, తెలంగాణను ఇన్నోవేషన్ క్యాపిటల్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో ఉన్నట్లు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్‌లో భాగంగా రెండో రోజు 3 ట్రిలియన్ డాలర్ ఎకానమీ లక్ష్యం కోసం మూలధనం, ఉత్పాదకత పెంపు అంశంపై సెషన్ నిర్వహించారు. దీనిలో భట్టి విక్రమార్కతో పాటు విజన్ డాక్యుమెంట్‌లో కీలకపాత్ర పోషించిన ప్రొఫెసర్ ప్రసన్న తాంత్రి, ఐఎస్‌బీ ఫ్యాకల్టీ ఆదిత్య, పారిశ్రామికవేత్త పరశురాం పాక, ఐఏఎస్ అధికారి కృష్ణభాస్కర్ పాల్గొన్నారు. తెలంగాణ రైజింగ్ 2047 కేవలం డాక్యుమెంట్ కాదు, భవిష్యత్ కోసం తాము చేస్తున్న ప్రతిజ్ఞ అని ఉపముఖ్యమంత్రి అన్నారు. తెలంగాణ ఎకానమీ ప్రస్తుతం దాదాపు 185 బిలియన్ డాలర్ల వరకు ఉందని చెప్పారు. త్రీ ట్రిలియన్ డాలర్లు చేరుకునేందుకు 22 ఏళ్లలో 16 రెట్లు పెరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. గుజరాత్, కర్ణాటక సహా దేశంలోని ఏ రాష్ట్రం కూడా అంత స్థాయిలో వృద్ధి చెందలేదని, దేశ ఎకానమీ చరిత్రలో లేని లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు పేర్కొన్నారు. కేవలం కష్టపడితేనే, మరిన్ని రోడ్లు.. భవనాలు కడితే మాత్రమే లక్ష్యాన్ని చేరుకోలేమని.. ఎకానమీ ప్రాథమిక సూత్రాలను మార్చాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. క్యాపిటల్, ఇన్నోవేషన్ కలిపి ఉత్పాదకత పెంచడం ద్వారా మాత్రమే ఇది సాధ్యమని పేర్కొన్నారు. డీప్ టెక్, ఏఐ, క్యాంటమ్ కంప్యూటింగ్‌లు ఇప్పుడు కీలక పాత్ర పోషిస్తున్న తరుణంలో తెలంగాణను ఆసియాకు ఇన్నోవేషన్ క్యాపిటల్‌గా తీర్చిదిద్దుతున్నట్లు వివరించారు. క్యూర్, ప్యూర్, రేర్‌తో ప్రాంతాల వారీ ప్రణాళికతో విజన్ డాక్యుమెంట్ వస్తోందని చెప్పారు.

## డిసెంబరు 9.. రాష్ట్ర ఏర్పాటుకు తొలి అడుగుపడిన రోజు: కేటీఆర్



హైదరాబాద్: తుది దశ తెలంగాణ ఉద్యమ ఫలితంగా రాష్ట్ర ఏర్పాటుకు తొలి అడుగుపడిన రోజు డిసెంబర్ 9 విజయ్ దివస్ అని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పేర్కొన్నారు. విజయ్ దివస్ సందర్భంగా ఆయన ఎక్స్‌లో.. కేసీఆర్ దీక్ష విరమించిన ఫోటోలు పంచుకున్నారు. సబ్బండ వర్గాల పోరాటం, అమరుల త్యాగం, కేసీఆర్ నిరవధిక నిరాహార దీక్షతో దిల్లీ పీఠం వణికి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించి నేటికి 16 ఏళ్లు అని తెలిపారు. నవంబర్ 29న దీక్షా దివస్ లేకుంటే డిసెంబర్ 9 విజయ్ దివస్ లేదన్న ఆయన.. డిసెంబర్ 9 లేకుంటే జూన్ 2 లేదని అన్నారు.

## తెలంగాణలో అద్భుతమైన క్రీడాపాలసీ తీసుకొచ్చాం: మంత్రి వాకిటి శ్రీహరి



హైదరాబాద్: "క్రీడాకారులూ.. మేమంతా మీపైనే ఆశలు పెట్టుకున్నాం. ఆటనే దైవంగా భావించి ఆడండి. ప్రపంచం మీ వైపు చూస్తోంది" అని తెలంగాణ క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం అద్భుతమైన క్రీడా పాలసీ తీసుకువచ్చిందన్నారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్ -2047లో ఒలింపిక్ గోల్డ్ క్వెస్ట్ ప్యానెల్ డిస్కషన్‌లో వాకిటి శ్రీహరి, మంత్రి అజారుద్దీన్‌లతో పాటు, క్రీడాకారులు పీవీ సింధు, గుత్తా జ్వాల, గోపీచంద్, అంబటి రాయుడు, అనిల్ కుంబ్లే పాల్గొన్నారు. క్రీడాకారుల విజయానికి అనేక అంశాలు దోహదం చేస్తాయని పీవీ సింధు అన్నారు. మౌలిక వసతులు, కోచ్‌లు చాలా కీలకమని చెప్పారు. ప్రతి దశలోనూ క్రీడాకారులకు ప్రోత్సాహం అవసరమన్నారు. మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ మాట్లాడుతూ.. "తెలంగాణ నుంచి సైనా నెహ్వాల్, నిఖత్ జరీన్ వంటి అనేకమంది క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి వెళ్లారు. గోపీచంద్ అకాడమీ నుంచి అనేకమంది వచ్చారు. క్రీడాభివృద్ధిలో మైదానాల పాత్ర చాలా కీలకం. ఫుట్‌బాల్‌ను కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. పీవీ సింధు, సైనా నెహ్వాల్, గుత్తా జ్వాల మంచి పేరు తెచ్చుకున్నారు. క్రీడాకారులకు ఆర్థిక సమస్యలు లేకుండా చూడాలి. గతంలో కోచ్‌ల కొరత ఎక్కువగా ఉండేది.. ఇప్పుడు దాన్ని అధిగమించాం" అని పేర్కొన్నారు.




హైదరాబాద్: భారీగా ఉద్యోగాలు వచ్చేలా ఫ్యూచర్ సిటీని తీర్చిదిద్దుతామని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. నెట్ జీరో కార్బన్ సిటీగా అభివృద్ధి చేస్తామన్నారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్‌లో నిర్వహించిన సెషన్‌లో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌కు నాలుగో న్యూక్లియస్ (కేంద్రం)గా ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తామన్నారు. " 13,500 ఎకరాల్లో గ్రీన్ సిటీగా అభివృద్ధి చేస్తాం. ఫ్యూచర్ సిటీని మెట్రో రైలుతో అనుసంధానిస్తాం. జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులకు అనుగుణంగా తీర్చిదిద్దుతాం.

జోన్లవారీగా విభజించి ప్రతి జోన్‌ను విభిన్నంగా తీర్చిదిద్దుతాం. ఏఐ సిటీ, హెల్త్ సిటీ, ఎంటర్‌టైన్‌మెంట్ డిస్ట్రిక్ట్, స్పోర్ట్స్ హబ్, ఎడ్యుకేషన్ జోన్, ఎకో టూరిజం హబ్ ఉంటాయి. ఫ్యూచర్ సిటీలో వర్సిటీల ఏర్పాటుకు పలు సంస్థలు ముందుకొచ్చాయి. త్వరలోనే యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ప్రారంభిస్తాం. జూపార్క్ ఏర్పాటుకు వంతారాతో ఇప్పటికే ఒప్పందం జరిగింది. 400 ఎకరాల్లో డేటా సెంటర్ సిటీ నిర్మాణం జరుగుతుంది" అని శ్రీధర్‌బాబు వివరించారు.




## టీవీకే అధినేత విజయ్ సభలో గన్ కలకలం

తమిళ ఇండస్ట్రీలో స్టార్ హీరోలుగా ఒక వెలుగు వెలిగిన వాళ్లు తర్వాత రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చి తమదైన మార్క్ చాటుకున్నారు. వారి బాటలోనే నడుస్తూ స్టార్ హీరో విజయ్ తమిళగ వెట్రి కళగం పార్టీ స్థాపించిన విషయం తెలిసిందే. ఇటీవల కరూర్‌లో తొక్కిసలాట జరిగిన తర్వాత, టీవీకే అధినేత విజయ్ ఈ రోజు (మంగళవారం) పుదుచ్చేరిలో తొలిసారిగా బహిరంగ సభలో పాల్గొన్నారు. ఈ సభా వేదిక వద్దకు ఓ వ్యక్తి తుపాకీతో రావడం గమనించిన పోలీసులు వెంటనే అతన్ని అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన వ్యక్తి పేరు డేవిడ్ అని, తమిళనాడు శివగంగై జిల్లా నివాసి అని తెలుస్తోంది. డేవిడ్ టీవీకే పార్టీ పుదుచ్చేరి జిల్లా కార్యదర్శి ప్రభు పర్సనల్ సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్నాడు. మెటల్ డిటెక్టర్ గేట్ వద్ద రొటీన్ చెకప్ చేస్తున్న సమయంలో పోలీసులు తుపాకిని కనుగొన్నారు. అతన్ని కస్టడీలోకి తీసుకుని దీని వెనుక ఏదైనా కుట్ర కోణం దాగి ఉందా అని విచారిస్తున్నారు.

ఈ ఘటన తర్వాత పుదుచ్చేరి పోలీసు ఉన్నతాధికారులు అలర్ట్ అయ్యారు. విజయ్ నిర్వహించే సభా వేదిక వద్ద అదనపు పోలీస్ బలగాలను ఏర్పాటు చేశారు.

ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పూర్తి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీనియర్ ఎస్పీ ఆర్.కలైవానన్ తెలిపారు. కాగా, పోలీసులు మొదట ఈ రోడ్ షోకి అనుమతి ఇవ్వలేదు. తర్వాత కఠిన షరతులతో అనుమతి లభించింది.

# జంతువుల హక్కులను పరిరక్షించడం సామాజిక బాధ్యత

## - డిసెంబర్ 10... ప్రపంచ జంతు హక్కుల దినోత్సవం




హక్కులు కేవలం మనిషికే కాదు జంతువులకూ ఉండాలన్న ఉద్దేశ్యంతో యూనివర్సల్ డిక్లరేషన్ ఆఫ్ అనిమల్ రైట్స్‌ని ప్రకటించారు. ఈ డిక్లరేషన్‌ని 1998లో ప్రపంచ దేశాలు ఆమోదించాయి. మానవ హక్కుల దినమైన డిసెంబర్ 10న జంతువుల హక్కుల దినంగా చేయడంద్వారా మనుషులు, జంతువులు ఒకటేనన్న సందేశం అందరికీ అందించడమే ఈ దిన ప్రధాన లక్ష్యం. మాంసం కోసం, వినోదం కోసం మానవులు అనేక రకాలుగా జంతువుల ప్రాణాలు తీస్తున్నారు. తమ వృత్తులకు, అవసరాలకు జంతు వులను ఉపయోగించు కుంటూ వాటిని హింసిస్తున్నారు. ఆవు, మేక, గేదె మొదలైన జంతువుల ఎక్కువ పాలు ఇవ్వడం కోసం రసాయనాల ఇంజెక్షన్లు ఇస్తూ వానిని హింసిస్తున్నారు. జంతు సంక్షేమానికి సంబంధించి 1960లో పార్లమెంటులో చట్టం రూపొందింది. ఈ చట్టం ప్రకారం జంతువులను ఉద్దేశ్యపూర్వకంగా గానీ, నిర్లక్ష్యంగా గానీ బంధించినా, ఇబ్బంది కలిగించినా శిక్షార్హులు అవుతారు. 1960 డిసెంబర్ 26 నుంచి ఈ చట్టం అమలులో ఉంది. భూమి మీద మనుషులతో పాటు ఎన్నో రకాల జంతువులూ ఉన్నాయి. వాస్తవానికి మనిషి కంటే ముందే జంతువులు భూమి మీద జీవించాయని సైన్స్ చెబుతోంది. జీవం నుండి జీవం రావడం మాత్రమే కాదు. ఒక జీవ జాతి అదే జీవ జాతి నుండి మాత్రమే ఉత్పన్నం అవుతుంది. అయితే భూమి ఆవిర్భవించిన తరవాత పుట్టిన చాలా జంతు జాతులు ఇప్పుడు లేవు. ఈ ఆధునిక యుగంలోనూ మనకు తెలిసిన ఎన్నో జంతు జాతులు కనుమరుగై పోతున్నాయి. మానవ మనుగడకు అనివార్యమైన జంతు సంపదను పరిరక్షించడం, వృద్ధి చేయడం, ప్రధానంగా జంతువుల హక్కులను కాపాడటం ఈ దినోత్సవ ప్రధాన లక్ష్యం. మానవుడికి, జంతువులకు మధ్య ఉన్న అవినాభావ సంబంధాన్ని ఈ దినోత్సవం తెలియ జేస్తుంది. భారత దేశంలో పశ్చిమ కనుమలు, నల్లమల కొండలు, శేషాచలం కొండలు, హిమాలయాలు, దేశ ఈశాన్యప్రాంతం విభిన్న జంతు జీవ జాలానికి నిలయంగా ఉన్నాయి. దేశంలో అడవులు అన్యాక్రాంత మవుతున్నాయి. ఒకప్పుడు విశాలంగా ఎక్కడ చూసినా పచ్చదనంతో బాసిల్లే అటవీ ప్రాంతాలు రాను రాను కనుమరుగై పోతున్నాయి. వన్యప్రాణి సంరక్షణ చట్టానికి తూట్లు పొడుస్తూ అటవీ ప్రాణుల వేట యధేచ్ఛగా జరుగుతుంది. వాస్తవానికి మనం జంతువుల ఆవాసాలను నాశనం చేస్తున్నాం. విచక్షణ రహితంగా అడవులు నరుకుతూ వాటి తావులను, మంచినీటి వనరులను ధ్వంసం చేస్తున్నాం. అందుకే అడవి జంతువులు గ్రామాల్లోకీ, పట్టణాల్లోకీ వస్తున్నాయి.

ఆహారం కోసం మనుషులపై దాడులు చేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితిని మార్చడం కూడా ఈ జంతు దినోత్సవం లక్ష్యాల్లో ఒకటి. జంతువులకు సహజ సిద్ధమైన ఆవాసాలను కల్పించడం, జంతు జాతులను రక్షించడం, వాటి సంక్షేమాన్ని కాపాడటం ఇవే ప్రధానం. జంతు సంరక్షణ కోసం మన ప్రభుత్వాలు ఏటా కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నాయి. అయితే స్మగ్లర్లు, వేటగాళ్లు.. వన్యప్రాణులు, అరణ్యాల పాలిట శాపంలా తయారయ్యారు. వీళ్ల దెబ్బకు కీకరారణ్యాలు సైతం మైదానాలుగా మారుతున్న పరిస్థితి. పరిశ్రమల స్థాపన పేరిట పెద్ద ఎత్తున అటవీ భూముల్లో పారిశ్రామిక కార్యకలాపాలు నిర్వహిస్తుండటం కూడా వన్యప్రాణుల మనుగడకు ముప్పుగా మారింది. దీంతో గూడు చెదిరిన వన్యప్రాణుల జనారణ్యం లోకి వస్తున్న పరిస్థితి. దేశంలోని జంతు సంపదను పరిరక్షించడానికి మొట్టమొదటి సారిగా 1898లో ఆనాటి బ్రిటీష్ ప్రభుత్వం మొదటి పక్షుల అభయారణ్యాన్ని తమిళనాడు లోని వేదాంతంగల్‌లో ఏర్పాటు చేసింది. ఆ తర్వాత 1935లో మొదటి వన్య ప్రాణి జాతీయ పార్కు 'హేలీ'ని ఉత్తరప్రదేశ్‌లో ఏర్పాటు చేశారు. ఇదే పార్కును ఇప్పుడు జిమ్ కార్బెట్ పార్కు అని పిలుస్తున్నారు. ప్రస్తుతం దేశంలో ఉన్న మొత్తం జాతీయ పార్కుల సంఖ్య 102. 1976లో జరిగిన రాజ్యాంగ సవరణలోని ఆర్టికల్ 51(ఏ) ప్రకారం వన్యప్రాణి సంరక్షణ పౌరుల ప్రాథమిక విధి. ఆదేశిక సూత్రాల్లో కూడా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విధిగా వన్యప్రాణులను సంరక్షించాలని పేర్కొన్నారు. జాతీయ వన్యప్రాణి చట్టం 1972, వన్యప్రాణులను వేటాడటాన్ని పూర్తిగా నిషేధించింది. ఆనాటి ప్రధాని స్వర్గీయ ఇందిరా గాంధీ 1972లో వన్యప్రాణుల సంరక్షణ చట్టాన్ని ప్రవేశపెట్టారు. ఈ చట్టం ప్రకారం వన్య ప్రాణుల వేట నిషేధం. జంతువులపట్ల జాలి, పరితాపములను చూపాలని భారత రాజ్యాంగం 51 ఎ అధికరణం పౌరుల ప్రాథమిక బాధ్యతలను నిర్వచిస్తున్నది. భారత రాజ్యాంగపు 21వ అధికరణం వ్యక్తిగత స్వేచ్ఛ, జీవన హక్కులను ధృవపరుస్తున్నది. భారత పౌరులకు జంతువులను పెంచి పోషించే హక్కును ఈ అధికరణం ద ృవపరుస్తున్నది. భారత పార్లమెంటు రూపొందించిన జంతువులపట్ల క్రూరత్వం నివారణ చట్టం సెక్షన్ 11 (1) నుండి (ఓ), ప్రకారం జంతువులను వేటాడటం, స్వాధీనం లేదా పట్టుకోవడం, ఏ జంతువునైనా అవయవమును తొలగించడం లేదా చంపడంవంటి అనేక ఇతర క్రూర చర్యలకు బాధ్యులైన వారిని చట్టం ద్వారా శిక్షిస్తారు. జంతు రవాణాలో అనవసర హింసకు పాల్పడే వారికి, జంతువులను కిక్కిరిసినట్టుగా వాహనాల్లో నింపేవారికి, జంతువుల కాళ్ళు కట్టేసి వాహనాలపై తీసుకువెళ్ళే వారికి రూ 100 లేదా మూడు నెలల కారాగార శిక్ష లేదా రెండు శిక్షలూ కలిపి విధించవచ్చు. భారత శిక్షా స్మృతి సెక్షను 428 మరియు 429 కింద జంతువులను భయపెట్టడం గాయ పరచడం చట్టవిరుద్ధం. జంతువులను లేదా జంతు సంరక్షకులను భయ కంపితులను చేయడం 1860 భారత శిక్షాస్మృతి సెక్షన్ 503 ప్రకారం తెలిసి లేదా న్యోహతో చేస్తున్న నేరంగా పరిగణిస్తారు. ఇటువంటి వారిని ఎటువంటి వారంటు లేకుండా అదుపులోకి తీసుకోవచ్చు. జంతుసంపదను పరిరక్షించడం, వాటిని వృద్ధి చేయడంతోపాటు జంతువుల హక్కులను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత. మానవ మనుగడకు అనివార్యమైన జంతు సంపదను పరిరక్షించడం, వృద్ధిచేయడం, జంతువులకూ తగిన గౌరవాన్ని అందజేయడం అందరి బాధ్యత. జంతువులపట్ల మరింత మానవీయంగా ప్రవర్తించడం, ఈ స్ఫూర్తిని భావితరాలకు తెలియజేయడం అవసరం, అనివార్యం....

**రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**

# మానవ హక్కులను పరిరక్షించాలి

## డిసెంబర్ 10... మానవ హక్కుల దినోత్సవం




ఐక్యరాజ్య సమితి 'సార్వత్రిక మానవ హక్కుల ప్రకటన (యూనివర్సల్ డిక్లరేషన్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ –యూడీహెచ్ఆర్)'ను ఐక్యరాజ్య సమితి ఆమోదించిన డిసెంబరు 10ని ఏటా మానవ హక్కుల దినోత్సవంగా జరుపుకొంటారు. అన్ని దేశాలు, ప్రజలందరికీ ఆదర్శ నీయమైన ఒక ఉమ్మడి ప్రమాణంగా ఈ పత్రాన్ని నిర్దేశిస్తూ 1948 డిసెంబరు 10న ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో ఐక్య రాజ్యసమితి సర్వప్రతినిధి సభ తీర్మానాన్ని ఆమోదించింది. ప్రపంచ మంతటా పరిరక్షించు కోవాల్సిన ప్రాథమిక మానవ హక్కులను తొలిసారిగా ఈ పత్రం నిర్దేశించింది. యు.డి.హెచ్.ఆర్ రూపొందించిన డాక్యుమెంట్ 360 భాషల్లోకి అనువాదమై ప్రపంచ రికార్డు సాధించింది. ఈ ప్రతిజ్ఞను సంపూర?ంగా సాకారం చేసుకోవడానికి ఈ సర్వప్రతినిధి సభ ఈ సార్వత్రిక మానవ హక్కుల ప్రకటనను అన్ని దేశాలకు, ప్రజలందరికీ ఆదర్శనీయమైన ఉమ్మడి ప్రమాణంగా ప్రకటిస్తోంది. ఈ సందర?గా హక్కుల విషయంలో ఏ ఆర్టికల్ ఏమి సూచిస్తుంది అనే విషయం తెలుసు కుందాం. ఆర్టికల్ 1: మనుషులందరికీ పుట్టుకతోనే స్వేఛ, సమానత్వం లభిస్తాయి. గౌరవం, హక్కుల విషయంలో అందరూ సమానులే. మనుషులందరికీ సొంత ఆలోచన, అంతః చేతన ఉంటాయి. ఒకరితో మరొకరు సోదరభావంతో మెలగాలి. ఆర్టికల్ 2: ఈ పత్రంలోని అన్ని హక్కులూ, స్వేఛలూ ప్రతి ఒక్కరికీ ఉంటాయి. జాతి, రంగు, లింగం, భాష, మతం లాంటి అంశాల ప్రాతిపదికగాగాని, రాజకీయ నేపథ్యంవల్లగాని, భిన్నాభిప్రాయం వల్లగాని, జాతీయ లేదా సామాజిక మూలాలవల్లగాని, సంపదలో వ్యత్యాసాలవల్లగాని, పుట్టుక లేదా ఇతర ప్రాతిపదికల వల్లగాని వివక్ష చూపడానికి వీల్లేదు. వ్యక్తులను వారి దేశం లేదా భూభాగం రాజకీయ/అంతర్జాతీయ హోదా ఏమిటనేదాని ప్రాతిపదికగా ఎలాంటి వివక్షా చూపరాదు. ఆర్టికల్ 3: జీవించే హక్కు, స్వేఛా హక్కు, స్వీయ భద్రతా హక్కు ప్రతి మనిషికీ ఉంటాయి. ఆర్టికల్ 4: ఎవ్వరినీ బానిసగా చేసుకోవడానికి వీల్లేదు. బానిసత్వాన్ని, బానిస వ్యాపారాన్ని అన్ని రూపాల్లో నిషేధించాలి. ఆర్టికల్ 5: ఎవ్వరినీ చిత్రహింసలకు గురిచేయరాదు. ఎవ్వరినీ క్రూరమైన, అమానవీయమైన, అవమానకరమైన శిక్షకు గురిచేయరాదు. ఆర్టికల్ 6: ప్రతి చోట చట్టం ముందు వ్యక్తిగా గుర్తింపు పొందే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది. ఆర్టికల్ 7: చట్టం ముందు అందరూ సమానులే. ఎలాంటి వివక్షా లేకుండా చట్టపరమైన రక్షణ పొందే హక్కు అందరికీ ఉంది. ఈ డిక్లరేషన్‌కు విరుద్ధంగా, ఎలాంటి వివక్షకు గురికాకుండా అందరికీ సమానమైన రక్షణ ఉంటుంది. ఆర్టికల్ 8: రాజ్యాంగం, లేదా చట్టం కల్పించిన ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లే చర్యల విషయంలో సంబంధిత జాతీయ ట్రైబ్యునల్ నుంచి పరిష్కారం పొందే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది. ఆర్టికల్ 9: ఎవ్వరినీ ఏకపక్షంగా అరెస్టు చేయడానికిగాని, నిర్బంధించడానికిగాని, ప్రవాసానికి పంపించడానికిగాని వీల్లేదు. ఆర్టికల్ 10: క్రిమినల్ నేరాభియోగాలపైగాని, తన హక్కులను, బాధ్యతలను నిర?యించే విషయంలోగాని స్వతంత్ర, నిష్పాక్షిక ట్రైబ్యునల్ ఆధ్వర్యంలో నిష్పాక్షిక, బహిరంగ విచారణ పొందే హక్కు ప్రతి ఒక్కరికీ సమానంగా ఉంది. ఆర్టికల్ 11: (1) శిక్షార్హమైన నేరాభియోగాన్ని ఎదుర్కొంటున్న ప్రతి ఒక్కరూ, బహిరంగ విచారణలో చట్ట ప్రకారం దోషిగా తేలే వరకు నిర్దోషిగానే భావించాలి. ఈ మేరకు ఆ వ్యక్తికి హక్కు ఉంది. ఈ విచారణలో, తనను తాను రక్షించుకోవడానికి అవసరమైన అన్ని హామీలూ వ్యక్తికి ఉంటాయి. (2) ఎవరైనా వ్యక్తి చేసిన తప్పిదం లేదా పని అది జరిగిన సమయానికి జాతీయ, లేదా అంతర్జాతీయ చట్టం ప్రకారం శిక్షార్హమైన నేరం కాకపోతే, ఆ వ్యక్తిని శిక్షార్హమైన నేరంలో దోషిగా ప్రకటించడానికి వీల్లేదు. శిక్షార్హమైన నేరం జరిగినప్పుడు వర్తించే శిక్ష కన్నా తీవ్రమైన శిక్షను విధించడానికి కూడా వీల్లేదు. ఆర్టికల్ 12: ఏ ఒక్కరి వ్యక్తిగత గోప్యత, కుటుంబం, ఇల్లు, ఉత్తరప్రత్యుత్తర విషయాల్లో ఏకపక్షంగా జోక్యం చేసుకోవడానికిగాని, గౌరవ ప్రతిష'లపై దాడి చేయడానికిగాని వీల్లేదు. అలాంటి జోక్యం, దాడుల నుంచి చట్టపరమైన రక్షణ పొందే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది. ఆర్టికల్ 13:(1) దేశంలో స్వేఛగా తిరిగే, నివసించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది. (2) సొంత దేశం నుంచి లేదా ఏ దేశం నుంచి అయినా వెళ్లిపోయే హక్కు, తన దేశానికి తిరిగి వచ్చే హక్కు ప్రతి ఒక్కరికీ ఉన్నాయి. ఆర్టికల్ 14: (1) పీడన నుంచి తప్పించుకొనేందుకు ఇతర దేశాలను ఆశ్రయం అడిగే, పొందే హక్కు ప్రతి ఒక్కరికీ ఉన్నాయి. (2) ఐక్యరాజ్యసమితి సూత్రాలకు, ప్రయోజనాలకు విరుద్ధమైన చర్యలు లేదా రాజకీయతేర నేరాలపై నిజమైన ప్రాసిక్యూషన్ జరిగే సందర?లో ఈ హక్కు ఉండకపోవచ్చు. ఆర్టికల్ 15: (1) ఏదైనా జాతీయతను కలిగి ఉండే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది. (2) ఎవరికీ ఏకపక్షంగా జాతీయతను తొలగించకూడదు, అలాగే జాతీయతను మార్చుకొనే హక్కును నిరాకరించకూడదు. ఆర్టికల్ 16: (1) జాతి, జాతీయత లేదా మతం పరిమితులు లేకుండా పెళ్లి చేసుకొనేందుకు, కుటుంబాన్ని కలిగి ఉండేందుకు వయోజనులైన మహిళలకు, పురుషులకు హక్కు ఉంది. వివాహం చేసుకొనేటప్పుడు, వాహ బంధంలో ఉన్న కాలంలో, దీనిని రద్దుచేసుకొనేటప్పుడు వారికి సమానమైన హక్కులు ఉంటాయి. (2) పెళ్లికి ఇద్దరు వ్యక్తుల్లో స్వేఛాయుత, సంపూర? అంగీకారం ఉంటేనే పెళ్లి చేసుకోవాలి. (3) సమాజంలో కుటుంబమనేది ఒక సహజమైన, ప్రాథమికమైన భాగం. కుటుంబానికి సమాజం, రాజ్యం రక్షణ కల్పించాలి. ఆర్టికల్ 17: (1) సొంతంగాగాని, ఇతరులతో కలసి గాని ఆస్తులు కలిగి ఉండేందుకు ప్రతి ఒక్కరికీ హక్కుంది. (2) ఎవరికీ ఏకపక్షంగా ఆస్తిని దూరం చేయడానికి వీల్లేదు. ఆర్టికల్ 18: స్వేఛాయుత అంతఃచేతనత్వానికి, స్వేఛగా ఆలోచించడానికి, మతాన్ని పాటించడానికి ప్రతి ఒక్కరికీ హక్కు ఉంది. మతాన్ని లేదా విశ్వాసాన్ని మార్చుకొనే హక్కు ఇందులో భాగం. ఒంటరిగాగాని, ఇతరులతో కలిసిగాని ప్రైవేటుగాగాని, బహిరంగంగాగాని తన మతవిశ్వాసాలను పాటించే, బోధించే స్వేఛ, పూజించే స్వేఛ అందరికీ ఉన్నాయి. ఆర్టికల్ 19: ప్రతి ఒక్కరికీ భావ ప్రకటనా హక్కు ఉంది. ఇతరుల జోక్యం లేకుండా సొంత అభిప్రాయాలు కలిగి ఉండే హక్కు, సరిహద్దులతో సంబంధం లేకుండా ఏ మార్గం నుంచైనా సమాచారం, ఆలోచనలు కోరే, స్వీకరించే హక్కు ఇందులో భాగం. ఆర్టికల్ 20: (1) స్వేఛగా శాంతియుతంగా సమావేశమయ్యేందుకు, సంఘంగా ఏర్పడేందుకు ప్రతి ఒక్కరికీ హక్కుంది. (2) ఏదైనా సంఘంలో భాగస్వామి కావాలని ఎవరినీ బలవంతపెట్టడానికి వీల్లేదు. ఆర్టికల్ 21: ప్రతి ఒక్కరికీ తమ దేశ ప్రభుత్వంలో ప్రత్యక్షంగా లేదా ఎంచుకున్న ప్రతినిధి ద్వారా భాగస్వామ్యమయ్యే హక్కు ఉంది. 1) ప్రతి ఒక్కరికీ తమ దేశంలో ప్రభుత్వ సేవలను సమానంగా పొందే హక్కు ఉంది. 2) ప్రభుత్వానికి ప్రజాభీష్టం ప్రాతిపదిక కావాలి. నిర్దేశిత కాలానికి జరిగే నిజమైన ఎన్నికల్లో ఈ ప్రజాభీష్టం వ్యక్తంకావాలి. ఈ ఎన్నికల్లో సార్వజనీన, సమానమైన ఓటు హక్కు ఉంటుంది. రహస్య ఓటింగ్ లేదా దానికి సమానమైన స్వేఛాయుత ఓటింగ్ నిర్వహించాలి. ఆర్టికల్ 22: సమాజంలో సభ్యులుగా ప్రతి ఒక్కరికీ సామాజిక భద్రత హక్కు ఉంది. తన గౌరవానికి, తన వ్యక్తిత్వం స్వేఛగా అభివృద్ధి చెందటానికి ఆవశ్యకమైన ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక హక్కులను జాతీయ కృషి, అంతర్జాతీయ సహకారం ద్వారా దేశ వనరులకు అనుగుణంగా సాధించుకునే హక్కు ఉంది. ఆర్టికల్ 23: (1) ప్రతి ఒక్కరికీ పని చేయడానికి హక్కుంది. స్వేఛగా కోరుకొన్న ఉపాధిని పొందడానికి, పనిచేయటానికి న్యాయమైన, అనుకూలమైన పరిస్థితులు పొందడానికి, నిరుద్యోగిత నుంచి రక్షణ పొందటానికి అందరికీ హక్కుంది. (2) ప్రతి ఒక్కరికీ ఎలాంటి వివక్షా లేకుండా సమాన పనికి సమాన వేతనం పొందే హక్కు ఉంది. (3) పని చేసే ప్రతి ఒక్కరికీ తాను, తన కుటుంబం మానవ గౌరవంతో మనుగడ సాగించటానికి హామీ ఇచ్చేలా న్యాయమైన, అనుకూలమైన వేతనం పొందే హక్కు ఉంది. అవసరమైతే ఇతర మార్గాల్లో అదనంగా సామాజిక రక్షణ పొందే హక్కు ఉంది. (4) ప్రతి ఒక్కరికీ తన ప్రయోజనాలను కాపాడుకోవటం కోసం కార్మిక సంఘాలు ఏర్పాటు చేయటానికి, వాటిలో చేరటానికి హక్కు ఉంది. ఆర్టికల్ 24: ప్రతి ఒక్కరికీ పనిగంటలకు హేతుబద్ధమైన పరిమితిని, నిర్దేశిత కాలానికి వేతనంతో కూడిన సెలవులను పొందే హక్కు, విశ్రాంతి, విరామం తీసుకునే హక్కు ఉన్నాయి. ఆర్టికల్ 25: (1) ప్రతి వ్యక్తికీ ఆహారం, దుస్తులు, నివాసం, వైద్యసేవలు, ఇతర సామాజిక సేవలు సహా.. తను, తన కుటుంబ ఆరోగ్య, సంక్షేమాలకు తగిన జీవన ప్రమాణం పొందే హక్కు ఉంది. నిరుద్యోగం, అనారోగ్యం, వైకల్యం, వైధవ్యం, వృద్ధాప్యం లేదా తన నియంత్రణలో లేని ఇతర కారణాల వల్ల జీవనోపాధి లేకపోవటం నుంచి భద్రత పొందే హక్కు ఉంది. (2) మాతృత్వం సమయంలో మహిళలకు, బాల్యదశలో చిన్నారులకు ప్రత్యేక సేవ, సహాయాలు పొందే హక్కు ఉంది. పెళ్లి ద్వారా పుట్టినా, పెళ్లి కాకుండా పుట్టినా చిన్నారులు అందరికీ సమానమైన రక్షణ లభించాలి. ఆర్టికల్ 26:(1) ప్రతి ఒక్కరికీ విద్యాహక్కు ఉంది. కనీసం ప్రాథమిక, మౌలిక స్థాయుల్లో అయినా అందరికీ విద్య ఉచితంగా అందాలి. ప్రాథమికవిద్య తప్పనిసరిగా ఉండాలి. సాంకేతిక విద్య, వృత్తినైపుణ్య విద్య అందుబాటులో ఉండాలి. ఉన్నతవిద్య ప్రతిభ ప్రాతిపదికన అందరికీ సమానంగా అందుబాటులో ఉండాలి. (2) మానవ వ్యక్తిత్వం సంపూర?ంగా వికసించేలా, మానవ హక్కులను, మౌలిక స్వాతంత్ర్యాలను గౌరవించేదిగా విద్య ఉండాలి. (3) తమ పిల్లలకు ఏ తరహా విద్య అందించాలో ఎంచుకునే హక్కు తల్లిదండ్రులకు ఉంది. ఆర్టికల్ 27: (1) ప్రతి ఒక్కరికీ సమాజ సాంస్కృతిక జీవనంలో స్వేఛగా పాలుపంచుకోవడానికి, కళలను ఆస్వాదించడానికి, శాస్త్రీయ పురోగతిలో, వాటి ప్రయోజనాల్లో భాగం పంచుకోవడానికి హక్కు ఉంది. (2) ప్రతి వ్యక్తికీ తను సృజించిన ఎలాంటి శాస్త్రీయ, సాహిత్య, కళా ఉత్పత్తుల నుంచి లభించే నైతిక, భౌతిక ప్రయోజనాలను పరిరక్షించుకునే హక్కు ఉంది. ఆర్టికల్ 28: ఈ ప్రకటనలో నిర్దేశించిన హక్కులు, స్వాతంత్ర్యాలు సంపూర?ంగా సాకారమయ్యే సామాజిక, అంతర్జాతీయ పరిస్థితులు పొందే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది. ఆర్టికల్ 29: తన వ్యక్తిత్వం సంపూర?ంగా వికసించటం సాధ్యమయ్యే సమాజం పట్ల ప్రతి ఒక్కరికీ బాధ్యతలు కూడా ఉన్నాయి. (1) ప్రతి ఒక్కరూ తన హక్కులు, స్వాతంత్ర్యాలను వినియోగించుకొనే క్రమంలో– ప్రజాస్వామ్య సమాజంలో ఇతరుల హక్కులు, స్వాతంత్ర్యాలకు తగిన గుర్తింపు, గౌరవం, నైతికత, శాంతిభద్రతలు, సాధారణ సంక్షేమం కోసం చట్టం నిర్దేశించిన పరిమితులకు మాత్రమే లోబడి ఉండాలి. (2) ఈ హక్కులు, స్వాతంత్ర్యాలను ఏ విధంగానూ ఐక్యరాజ్యసమితి లక్ష్యాలు, సూత్రాలకు వ్యతిరేకంగా ఉపయోగించరాదు. ఆర్టికల్ 30: ఈ ప్రకటనలోని ఏ అంశమైనా ఇందులో నిర్దేశించిన హక్కులు, స్వాతంత్ర్యాల్లో దేనినైనా ధ్వంసం చేసేందుకు, లేదా ఏమైనా చేసేందుకు ఏ రాజ్యానికీ, సంఘానికీ, వ్యక్తికీ వీలు కల్పిస్తున్నట్లు భావించరాదు.

**రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**

# డైనమైట్ ఆవిష్కర్త ఆల్‌ఫ్రెడ్ నోబెల్ - డిసెంబర్ 10...ఆల్‌ఫ్రెడ్ బెర్నార్డ్ నోబెల్ వర్ధంతి

ఆల్‌ఫ్రెడ్ బెర్నార్డ్ నోబెల్ (1833%--%1896) విజ్ఞాన శాస్త్రం, సాహిత్యం, మానవతా దృక్పథాలకు మార్గదర్శకుడైన శాస్త్రవేత్త, ఆవిష్కర్త, వ్యాపారవేత్త. ప్రపంచ వ్యాప్తంగా నోబెల్ పురస్కారాల స్థాపకుడిగా ప్రసిద్ధి చెందిన ఆయన జీవితం శాస్త్ర సిద్ధాంతాలు, మానవతా. వాదం, ఆలోచనాత్మకతల చిహ్నంగా నిలిచింది.

**జీవిత విశేషాలు...** ఆల్‌ఫ్రెడ్ నోబెల్ 1833 అక్టోబర్ 21న స్వీడన్‌లోని స్టాక్‌హోమ్‌లో జన్మించారు.

తండ్రి ఇమ్మాన్యుయేల్ నోబెల్ ఒక ఇంజనీర్ మరియు ఆవిష్కర్తబీ తల్లి ఆండ్రియెటా అహ్ల్సెల్ కుటుంబ వ్యవహారాల్లో నైపుణ్యం కలిగిన వ్యక్తి. ఆయన తండ్రి ఆవిష్కరణల పట్ల ఆసక్తిని చిన్నతనం నుంచే నోబెల్ అలవర్చుకున్నారు.

**విద్యాభ్యాసం...** చిన్నతనం లోనే నోబెల్ కుటుంబం రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్‌కు వలస వెళ్ళింది. అక్కడ ఆయన రసాయన శాస్త్రం, భౌతిక శాస్త్రం మీద కేంద్రీకరించి పాఠాలు నేర్చుకున్నారు. ఫ్రెంచ్, జర్మన్, ఆంగ్లం, రష్యన్ వంటి పలు భాషల్లో ప్రవీణత సాధించారు.


**శాస్త్రపరమైన అభిరుచి..** నోబెల్ చిన్నతనం నుంచే శాస్త్రాన్ని అధ్యయనం చేయడంలో మక్కువ చూపారు. తండ్రి పరిశోధనల్లో సహకరించడంతో పాటు స్వయంగా అనేక ప్రయోగాలను ప్రారంభించారు.

**డైనమైట్ ఆవిష్కరణ...** నైట్రోగ్లిసరిన్‌ను ఉపయోగించే విధానంలో ఉన్న ప్రమాదాలను గుర్తించిన నోబెల్, దానిని నియంత్రణలో ఉంచే సాంకేతికతను అభివృద్ధి చేశారు. 1867లో డైనమైట్ అనే పేలుడు పదార్థాన్ని ఆవిష్కరించారు. ఇది నిర్మాణ రంగం, మైనింగ్, రవాణా రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చింది.

ఈ ఆవిష్కరణకు పేటెంట్ పొందిన నోబెల్, డైనమైట్ తయారీలో ప్రముఖంగా మారి ప్రపంచ వ్యాప్తంగా ఖ్యాతి పొందారు.

**ఆర్థిక విజయాలు...** డైనమైట్ కారణంగా నోబెల్‌కు ప్రఖ్యాతి మాత్రమే కాకుండా, అతి పెద్ద ఆర్థిక వనరులు లభించాయి. ఆయన స్థాపించిన 90కి పైగా ఫ్యాక్టరీలు, పరిశ్రమలు ఆయన విజ్ఞాన శక్తి మరియు వ్యాపార ప్రతిభకు సాక్ష్యం.

**నోబెల్ పురస్కారాల ఆవిరావేం...** 1895లో తన ఆస్తిని మానవాళి కోసం ఉపయోగించాలని రాశారు. తన సంపదను శాంతి, విజ్ఞాన శాస్త్రం, సాహిత్యం, వైద్యం తదితర రంగాల్లో విశేష సేవలందించిన వారికి ఇవ్వాలని పేర్కొన్నారు.



**నోబెల్ ట్రస్ట్...** 1901లో నోబెల్ ట్రస్ట్ అనే సంస్థ ఏర్పాటు చేయబడింది. ఇది ప్రతి సంవత్సరం నోబెల్ పురస్కారాలను అందించే విధానాన్ని నిర్వహిస్తోంది.

**నోబెల్ పురస్కారాల ప్రాముఖ్యత...** ప్రధానంగా ఐదు విభాగాల్లో పురస్కారాలు అందించ బడుతున్నాయి. భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, వైద్యశాస్త్రం, సాహిత్యం, శాంతి. 1968లో స్వీడిష్ సెంట్రల్ బ్యాంక్ ఆర్థికశాస్త్ర విభాగాన్ని కూడా జోడించింది.

**విజేతల ఎంపిక...** పురస్కార విజేతలను స్వీడిష్ అకాడమీ, ఇతర సంస్థలు ఎంపిక చేస్తాయి. విజేతలకు డిప్లొమా, పతకం, నగదు బహుమతులు అందిస్తారు.

**వ్యక్తిగత జీవిత విశేషాలు...** 1. సాహిత్యంపై మక్కువ నోబెల్ కేవలం శాస్త్రవేత్త మాత్రమే కాకుండా, గొప్ప కవిగా కూడా ప్రసిద్ధి చెందారు. Nemesi" అనే నాటకాన్ని రచించారు. ఆయన జీవితంలో వివాహం చేసుకోలేదు. బెర్తా వాన్ సుట్నర్ అనే స్నేహితురాలితో సాన్నిహిత్యం ఉన్నప్పటికీ, అది ప్రొఫెషనల్ సంబంధాలకే పరిమితమైంది.

**మరణం....** 1896 డిసెంబర్ 10న ఇటలీలోని సాన్రెమో పట్టణంలో నోబెల్ మరణించారు. ఆల్‌ఫ్రెడ్ నోబెల్ జీవితం విజ్ఞానానికి, మానవతకు అంకితమైంది. "జ్ఞానం, శాంతి, మానవత్వం అనే త్రికరణ శక్తి ద్వారా ప్రపంచాన్ని మెరుగు పరచవచ్చు" అనే నమ్మకంతో ఆయన మార్గదర్శకుడయ్యారు. నోబెల్ పురస్కారాలు మాత్రమే కాకుండా, ఆయన జీవితం కూడా మన కోసం వెలుగుదారిలా మారింది.

**రామ కిష్టయ్య సంగన భట్ల... సీనియర్ జర్నలిస్ట్, కాల మిస్ట్, 9440595494**

చురకలు

## సంపాదకీయం

# 'సాఫ్ట్ స్కిల్స్'..

## ఏఐ యుగంలో విజయానికి ఇదే కీలకం

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) శరవేగంగా అన్ని రంగాల్లో తన ప్రభావాన్ని చూపుతున్న నేపథ్యంలో భవిష్యత్తులో ఉద్యోగులు, విద్యార్థులు కొత్త నైపుణ్యాలను అలవర్చుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. ఈ కీలక సమయంలో అమెజాన్ వెబ్ సర్వీసెస్ సీఈఓ మాట్ గార్మన్ యువతకు ఒక విలువైన సలహా ఇచ్చారు. భవిష్యత్తులో విజయానికి కేవలం సాంకేతిక (టెక్నికల్) జ్ఞానం మాత్రమే కాక సాఫ్ట్ స్కిల్స్ అత్యంత అవసరం అని నొక్కి చెప్పారు. గార్మన్ అభిప్రాయం ప్రకారం.. ఏఐ టెక్నాలజీ ఎంతగా అభివృద్ధి చెందినా.. మానవులకు మాత్రమే సొంతమైన కొన్ని సామర్థ్యాలను యంత్రాలు అనుకరించలేవు. అవేంటంటే.. క్రిటికల్ థింకింగ్.. క్లిష్టమైన సమస్యలను విశ్లేషించడం, లోతైన ఆలోచనతో సరైన నిర్ణయాలు తీసుకోవడం ఏఐతో సాధ్యం కాదు. అడాప్టబిలిటీ అవసరం. మారుతున్న పరిస్థితులకు, కొత్త టెక్నాలజీలకు త్వరగా అలవాటు పడగల సామర్థ్యం అవసరం.. కమ్యూనికేషన్ స్కిల్స్ తప్పనిసరిగా ఉండాలి. తమ ఆలోచనలను స్పష్టంగా వ్యక్తపరచడం, ఇతరులతో సమర్థవంతంగా సంభాషించడం ముఖ్యం.. గార్మన్ ఇదే విషయాన్ని చెబుతూ "మానవుల ఆలోచనా సామర్థ్యం, క్రియేటివ్ ప్రాబ్లమ్ సాల్వింగ్, వివేకంతో కూడిన నిర్ణయాలు తీసుకునే నైపుణ్యం మాత్రం యంత్రాలు చేయలేవు." అందుకే యువత ఏ విభాగంలో చదువుతున్నా, స్వతంత్రంగా ఆలోచించే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.

**మానవీయ నైపుణ్యాల ప్రాధాన్యత...** అనేక సంస్థలు తమ కస్టమర్లతో మానవీయంగా మాట్లాడగలిగే.. వారి భావనను పంచుకోగలిగే వ్యక్తులను కోరుకుంటాయి. ఏఐ యుగంలోనూ ఈ మానవీయ నైపుణ్యాలు అత్యంత ప్రాధాన్యం కలిగి ఉంటాయని అమెజాన్ వెబ్ సర్వీసెస్ సీఈఓ స్పష్టం చేశారు.

**జోహో కార్ప్ కూడా అదే సూచన...** ఈ అభిప్రాయాన్ని జోహో కార్పొరేషన్ ఏఐ రీసెర్చ్ చీఫ్ రాంప్రకాశ్ రామమూర్తి కూడా బలపరిచారు. ఇంటర్నెట్ వచ్చినప్పుడు ఉద్యోగాల రూపురేఖలు మారినట్లే, ఇప్పుడు ఏఐ కారణంగానూ ఉద్యోగాల స్వరూపం మారుతుందని ఆయన పేర్కొన్నారు. అయినప్పటికీ రీసనింగ్, క్రిటికల్ థింకింగ్ వంటి నైపుణ్యాలలో మానవులకే ఎప్పటికీ ఆధిక్యం ఉంటుందని తెలిపారు. మానవ మేధస్సు ఎల్లప్పుడూ కీలక పాత్ర పోషిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఏఐ సాంకేతికత అగ్రస్థానంలో ఉన్నప్పటికీ.. ఉద్యోగాలను భద్రపరుచుకోవాలంటే టెక్నాలజీ నైపుణ్యాలకు తోడు మానవీయ నైపుణ్యాలు, లోతైన ఆలోచనా శక్తి, సమస్య పరిష్కార దృక్పథం అత్యంత అవసరం. భవిష్యత్తులో విజయవంతం కావాలనుకునే ప్రతి ఒక్కరూ ఈ 'సాఫ్ట్ స్కిల్స్'పై దృష్టి సారించడం తప్పనిసరి.

# ఆంధ్ర విశ్వవిద్యాలయ తొలి ఉపకులపతి కట్టమంచి -డిసెంబర్ 10...కట్టమంచి రామలింగారెడ్డి జయంతి



తెలుగు సాహిత్యం, విద్యా రంగాల్లో చిరస్మరణీయ మహనీయులలో ఒకరైన కట్టమంచి రామలింగారెడ్డి (1880%--%1953) ప్రముఖ కవి, రచయిత, సంఘసంస్కర్త, విద్యావేత్త. 20వ శతాబ్దపు తెలుగు సాహిత్యానికి కొత్త గుణాత్మకతను అందించిన ఆయన, విద్యా రంగంలో చేసిన సేవల ద్వారా సమాజ మార్పుకు కృషి చేశారు. జననం...డిసెంబర్ 10, 1880న ఆంధ్రప్రదేశ్ లోని చిత్తూరు జిల్లాలోని కట్టమంచి గ్రామంలో జన్మించారు. ఈ గ్రామమే ఆయన పేరుతో పరిచితమైంది. విద్యాభ్యాసం...మద్రాసు క్రిస్టియన్ కళాశాలలో చదువు కున్నారు. ఆంగ్ల సాహిత్యం, తత్వశాస్త్రంలో ఆసక్తి చూపి, పండితుడిగా ఎదిగారు. విద్యాబోధన, రచనలతో నిమగ్నమైన రామలింగారెడ్డి కుటుంబ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారు

**విద్యా రంగానికి చేసిన సేవలు..** విద్యా సంస్కరణలు...రామలింగారెడ్డి విద్యను సమాజ మార్పు సాధనంగా భావించారు.ఆయన మహిళా విద్యకు ప్రాధాన్యత ఇచ్చి, విద్యను అందరికీ అందుబాటు లోకి తీసుకు రావడానికి కృషి చేశారు.విద్యా ప్రమాణాలను మెరుగు పరచడంలో ముఖ్య భూమిక పోషించారు.

**ఆంధ్రా విశ్వవిద్యాలయం:** ఆంధ్ర విశ్వవిద్యాలయానికి తొలి ఉపకులపతిగా (%ఎఅఎవ-జష్ఘఅఎవశ్రీశ్రీశీతీ%) నియమించబడ్డారు. ఆర్థిక సమస్యలు, బడ్జెట్ సమస్యలు ఉన్నప్పటికీ, విశ్వవిద్యాలయ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేశారు."విద్యార్థి నైతికతే సమాజ భవిష్యత్తు" అనే దృక్పథంతో విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించడంలో ఆయన విశేషంగా కృషి చేశారు.

**సాహిత్య కృషి..** కట్టమంచి రామలింగారెడ్డి తెలుగులో పలు విభిన్న ప్రక్రియలకు పునాది వేశారు. ఆయన రచనల్లో సామాజిక చైతన్యం, నైతిక విలువల ప్రతిఫలనం స్పష్టంగా కనిపిస్తుంది.

**ప్రసిద్ధ రచనలు:** ముసలమ్మ మరణం...గ్రామీణ జీవితంలోని నైతిక సమస్యలు, సామాజిక పరిస్థితులను వాస్తవంగా చర్చించిన కావ్యం. మంచి...నైతిక విలువలను, వ్యక్తిగత సమాజ బంధాలను విశదీకరించిన గీతకావ్యం. చిత్రలేఖ...అందమైన గీతకావ్యం, సమాజానికి కొత్త ఆలోచనలతో రూపుదిద్దింది. హరిశ్చంద్ర, శాంతిశ్రీ...ఇతిహాస గాథల ఆధారంగా రచించిన ఈ నాటకాలు పాఠకుల మన్ననలు పొందాయి.

**సాహిత్యంలో విశిష్టత:** "గద్య కవిత్వం" అనే నూతన ప్రక్రియను ప్రవేశపెట్టారు. రచనల ద్వారా సామాజిక సమత్వం, నైతికత, వ్యక్తిగత అభివృద్ధి వంటి అంశాలను విశదీకరించారు.

**సమాజ సేవ...** సామాజిక చైతన్యం...బాలికల విద్య, స్త్రీ స్వాతంత్ర్యం కోసం రచనల ద్వారా సామాజిక ఉద్యమాలకు ప్రేరణ కల్పించారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్య, ఆర్థిక సమానత్వం కోసం తన ఆలోచనలను వ్యాప్తి చేశారు.

**హేతువాద ఆలోచనలు...** ప్రాచీన ఆచారాలను తిరస్కరిస్తూ, ఆధునిక దృక్పథాలను సమర్థించారు. విద్య ద్వారా సమాజాన్ని మారుస్తారని నమ్మి, ఆ దిశగా సేవ చేశారు.

**రామలింగారెడ్డి ప్రత్యేకత....** బహుముఖ ప్రజ్ఞావంతుడు...కవి, రచయిత, హేతువాది, శాస్త్రవేత్త, న్యాయవాది వంటి అనేక పాత్రల్లో ప్రతిభ చూపారు. ఆదర్శవాది...తన జీవితంలో ఉన్నత ఆచారాలను పాటిస్తూ, సమాజానికి ఆదర్శంగా నిలిచారు. సాహిత్య సేవల విలువ...కేవలం రచయితగానే కాకుండా, సమాజానికి మార్గదర్శకుడు, చైతన్యవంతుడు.

**మరణం....** 1953 ఫిబ్రవరి 24న ఆయన పరమ పదించారు. కానీ, ఆయన రచనలు, విద్యాపరమైన సంస్కరణలు తెలుగు ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచి పోయాయి. కట్టమంచి రామలింగారెడ్డి తెలుగు సాహిత్యం, విద్యారంగాల్లో చేసిన కృషి అపారమైనది. ఆయన రచనలు నేటికీ తెలుగు భాషాభిమానులకు స్ఫూర్తినిస్తున్నాయి. విద్య, సాహిత్యం, సమాజ సేవలలో ఆయన చూపిన నిబద్ధత ప్రతి ఒక్కరికీ మార్గదర్శకంగా ఉంది. **రామ కిష్టయ్య సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్, 9440595494**

# తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవ కారకులు రావిచెట్టు రంగారావు

## నిజాం ఇలాకాలో తొలి తెలుగు గ్రంథాలయ స్థాపకులు రావిచెట్టు రంగారావు - డిసెంబర్ 10... రావిచెట్టు రంగారావు వర్ధంతి



నిజాం రాజ్యంలో తొలి తెలుగు గ్రంథాలయం స్థాపన ఎప్పుడు ఎక్కడ జరిగిందో చాలా మందికి తెలియదు. అప్పటి రాంకోఠిలోగల రావిచెట్టు రంగారావు బంగాళాలో స్థాపించడం జరిగింది. నాటి వ్యవస్థాపక సమావేశానికి పాల్వంచ, భద్రాచలం సంస్థానా ధిపతి రాజా పార్థసారథి అప్పా రావు అధ్యక్షత వహించారు. ఆ గ్రంథాలయం తొలి అధ్యక్షుడుగా రాజానాయని వెంకట రంగారావు బహదూర్, కార్యదర్శిగా రావిచెట్టు రంగారావు ఎన్నికయ్యారు. మరునాటి నుంచే రంగారావు తెలుగు గ్రంథాలయ ఆవశ్యకతను తెలుగు ప్రజానీకానికి వివరించి చెబుతూ, మంచి గ్రంథాల సేకరణకు ఉపక్రమించారు. 1897 సంవత్సరంలో రంగారావు కొందరు మరాఠీ మిత్రుల సహ కారంతో చతుర్వేదములు, దశోపనిషత్తులు, అష్టాదశ పురాణములు, కావ్యాలు, నాటకాలు, ఇతర సంస్కృత గ్రంథాలతో కూడిన 'శ్రీ శంకర భగవద్ పూజ్య పాద గీర్వాణ మంజూష' అనే గ్రంథాలయాన్ని తమ ఇంటిలోనే నిర్వహించేవాడు. తొలుత కొంతకాలం తమ బంగళా లోనే నిర్వహించబడ్డ భాషా నిలయానికి రావిచెట్టు సహధర్మచారిణి లక్ష్మీ నరసమ్మ సేవలను అందించేది. ఆమెనే శ్రీకృష? దేవరాయ ఆంధ్రభాషా నిలయముకి అవసరమైన ఇల్లు కొనడానికి 3,000 రూపాయలు విరాళ మివ్వగా, ఆ డబ్బుతో ఇప్పుడు సుల్తాన్ బజార్ లో భాషా నిలయం భవనం ఉన్న చోటనే 1910లో ఒక పెంకుటిల్లు కొని, కొన్ని మార్పులు చేసి అందులో గ్రంథాలయం నెలకొల్పడం విశేషం. రావిచెట్టు రంగారావు (డిసెంబర్ 10, 1877 – జూలై 3, 1910) తెలంగాణలో విద్యావ్యాప్తికి విశేష కృషి చేసిన ప్రముఖులు. రంగారావు 1877, డిసెంబర్ 10 న నరసింహా రావు, వేంకమాంబ దంపతులకు నల్లగొండ జిల్లా, దండంపల్లి గ్రామంలో జన్మించారు. తల్లిదండ్రులు చిన్నతనంలోనే మరణించారు. ఆయన వివాహం 13వ యేట లక్ష్మీ నరసమ్మతో జరిగింది. తల్లిదండ్రుల ఆస్తిపాస్తులు మొత్తం రంగారావుకు సంక్రమించగా, తండ్రి నుంచి సంక్రమించిన 'మున్సబుగిరి' స్వీకరించి 'మున్సబుదారు' అయ్యారు. తెలుగుతో పాటు హిందీ, మరాఠీ, ఇంగ్లీషు, సంస్కృతం భాషలు నేర్చుకున్నారు. తెలుగంటే వారికి వల్లమాలిన అభిమానం. మత, సాంఘిక, రాజకీయాల్లోనూ వారికి సరైన అవగాహన ఉండేది. రంగారావు, కొమర్రాజు లక్ష్మణరావుతో కలసి శ్రీ కృష?దేవరాయ ఆంధ్రభాషా నిలయం, పిమ్మట విజ్ఞాన చంద్రికా గ్రంథమండలిని స్థాపించారు. సంస్కృత భాషపై ఆయనకు ఎనలేని గౌరవం. ఒక సంస్కృత గ్రంథాలయాన్ని స్థాపించి, దాని అభివృద్ధికి తోడ్పడి "శ్రీ శంకర భగవత్పూజ్యపాద గీర్వాణరత్న మంజూష" అన్న పేరుతో సంస్కృత గ్రంథాలయాన్ని ఆ గ్రంథాలయంలో కలిపారు. అందులో చతుర్వేదాలు, దశోపనిషత్తులు, అష్టాదశ పురాణాలు, కావ్యాలు, నాటకాలు ఇత్యాది సంస్కృత ప్రబంధాలెన్నో కొనుగోలు చేసి సేకరించి పాఠకుల సౌకర్యార్థం ఉంచారు. ఆ గ్రంథా లయం తాలూకు రెండువేల రూపాయల విలువపై వచ్చే వడ్డీతో ప్రతియేట కొత్తగా వచ్చే సంస్కృత గ్రంథాలు కొనుగోలు చేసేవారు. అలా గ్రంథాలయం మొదట రంగారావు ఇంట్లోనే స్థాపించ బడింది.

దాదాపు ఐదేండ్లపాటు కార్యదర్శిగా ఉన్నారు. ఎందరో దాతలవద్దకు వెళ్ళి చందాలు వసూలు చేసి, ఆరువందల రూపాయలు నిలువ చేశారు. హైదరాబాద్ లో శ్రీకృష?దేవరాయల పేరిట గ్రంథాలయం స్థాపించినట్టే, 1904 జనవరి 26న రాజా నాయిని వెంకటరంగారావు బహద్దూర్ సహకారంతో హనుమకొండ లో 'రాజరాజ నరేంద్ర' గ్రంథాలయాన్ని 1904 లో స్థాపించారు. ఆ గ్రంథా లయం కోసం అనేక ముద్రణా లయాలకు, గ్రంథ విక్రయ శాలలకు లేఖలు వ్రాసి అనేక గ్రంథాలు ఉచితంగా, కొన్ని సగం ధరకు, మరికొన్ని పాతికశాతం ధరకు తెప్పించి ఇచ్చారు. హనుమకొండలో బ్రిటిష్ పోస్టాఫీసు లేనందున గ్రంథాలను, పత్రికలను తమ పేరున హైదరాబాద్‌కు తెప్పించి హనుమకొండకు పంపేవారు. అంతే కాకుండా భాషా నిలయానికి స్వంత గృహవసతి కల్పించడానికి కూడా రంగారావు చాలా కృషి చేశారు. మునగాల రాజు, కొమర్రాజు లక్ష్మణరావుల సహచర్యంతో రంగారావు మద్రాసుకు తరచూ వెళ్ళేవారు. అక్కడ 1905 లో విజ్ఞాన చంద్రికా గ్రంథ మండలి స్థాపించి పుస్తక ప్రచురణలు ప్రారంభించాలని నిర?యించారు. ముద్రణ మద్రాసులో లక్ష్మణరావు పర్యవేక్షణలో ఉండగా పుస్తకాలను చందాదారులకు చేర్చడం, వ్యాపార, రవాణా కార్యక్రమాలను రంగారావు హైదరాబాద్ నుండి స్వయంగా చేపట్టారు. కుటుంబ మంతా మద్రాసుకు తరలి వెళ్లి ఆర్నెల్లపాటు అక్కడే నివసిస్తూ గ్రంథ మండలిని అభివృద్ధికి కృషి చేశారు. రావిచెట్టు స్వదేశీ ఉద్యమాన్ని బలపరిచి, స్వదేశంలో తయారైన వస్తువుల ప్రచారానికి దృఢ సంకల్పంతో పనిచేశారు. భాషా నిలయానికి పత్రికలు, కొత్త గ్రంథాలు తెప్పించినంత మాత్రాన మాతృభాషాభివృద్ధి జరుగదని భావించి, భాషా నిలయానికి అనుబంధంగా ఒక పాఠశాలను నెలకొల్పి కొత్త పద్ధతిలో చరిత్ర, భూగోళం, గణితం మొదలైనవి తెలుగులోనే బోధించాలని ఆలోచన చేశారు. దానితో పది, పన్నెండు వేలమంది విద్యార్థులతో ఒక పాఠశాల ప్రారంభించారు. కానీ సభ్యులు చేసిన వాగ్ధానాలు ఆచరణకు నోచుకోలేదు. రంగారావు చొరవ తీసుకుని, చందాల కోసం తిరుగలవలసి వచ్చింది. విద్యార్థులకు పలకలు, బలపాలు, పుస్తకాలు కొనిచ్చారు. ఫలితం లేక ఆ పాఠశాల మూత పడి పోయింది. లక్ష్మీ నరసమ్మ కూడా విద్యా వికాసానికి, సాంఘిక కార్యక్రమాలతో భర్తతో పాటు పాల్గొనేవారు. స్త్రీ విద్యకై ఇద్దరూ పాటుపడ్డారు. స్త్రీలకు కుట్టు పనులు మొదలయినవి నేర్పించి వారిలో నైపుణ్యాన్ని పెంచాలనీ విద్యాభివృద్ధి చేయూత లక్ష్యంతో 'ఆంధ్రమహిళా సంఘాన్ని స్థాపించి లక్ష్మీనరసమ్మనే దాని మొదటి అధ్యక్షురాలుగా బాధ్యతల్ని చేపట్టారు. ప్రతి శుక్రవారం వారి ఇంట్లోనే స్త్రీ విద్య, శిశుపోషణ, గృహ నిర్వహణ, పాతివ్రత్యము, ఐకమత్యము మొదలయిన అంశాలపై ఉపన్యాస కార్యక్రమాలు నిర్వహించే వారు. 1908 సంవత్సరంలో మూసీనదికి భయంకరమైన వరదలు వచ్చి హైదరాబాదు నగరాన్ని ముంచి వేయగా, ఎంతో ధన, ప్రాణనష్టం జరిగింది. ఆపద కాలంలో రంగారావు హైదరాబాద్ నగర ప్రజలకు సహాయపడి, నిరాశ్రయులైన వారికి, వసతి సౌకర్యాలు కల్పించారు. వీరు ఎంతోమంది పేద విద్యార్థులను తన ఇంట్లో వుంచు కొని ఉన్నత చదువులు చెప్పించారు. అలా వారి సహాయంతో పైకివచ్చిన వారిలో ఆదిరాజు వీరభద్రరావు లాంటి వారు ఉన్నారు. రావిచెట్టు రంగారావు జీవిత చరిత్రను ఆదిరాజు వీరభద్రరావు 1910 లో 'జీవిత చరితావళి' అనే గ్రంథంలో నిక్షిప్తం చేశారు. ఇది విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి పక్షాన 1911 లో ప్రచురితమైంది. మాతృభాష, గ్రంథాలయాల అభివృద్ధి కోసం, సర్వస్వము ధారపోసిన రంగారావు తన ముప్పై మూడో ఏటనే 1910 జూలై 3వ తేదీన ఆకస్మికంగా కన్నుమూశారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**

# పెన్ను గన్నులతో పోరాడిన యోధుడు రావెళ్ళ వెంకట రామారావు - డిసెంబర్ 10... రావెళ్ళ వర్ధంతి

నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేక పోరాటంలో పాల్గొన్న ఎందరో పోరాట యోధులు, త్యాగ ధనులు ఎన్నో పోరాట పంథాలను ఎన్నుకున్నారు. అలాంటి వారిలో రావెళ్ళ వెంకట రామారావు ఎన్నదగిన యోధుడు. తన పెన్ను, గన్ను ద్వారా ప్రజల్లో చైతన్యాన్ని, పోరాట స్ఫూర్తిని కల్పించి ఎందరికో మార్గ నిర్దేశనం చేశాడు. ఆయన తొలితరం కవి. సాయుధ దళ కమాండర్. రావెళ్ళ వెంకట రామారావు (జనవరి 31, 1927 – డిసెంబర్ 10, 2013) తెలంగాణ గర్వించ తగిన సాయుధ పోరాట యోధుడు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఉద్యమించడంతో పాటు, తన రచనలు, పాటల ద్వారా ప్రజలను చైతన్య పరిచాడు. అయన ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం గోకినేపల్లిలో 1927, జనవరి 31 న రైతు కుంటుంబంలో లక్ష్మయ్య, సుబ్బమ్మ దంపతులకు జన్మించాడు. భూమి కోసం, భుక్తి కోసం, నిజాం రాచరిక పాలనకు చరమగీతం పాడేందుకు, నైజాం దమన కాండ అంతం కోసం తుపాకి పట్టి దళ కమాండర్‌గా ముందుకు దూసుకు వెళ్ళాడు. విద్యార్థి దశలోనే కమ్యూనిస్టు పార్టీ పట్ల ఆకర్షితుడై, రావెళ్ల 1944 లో ఆంధ్ర మహాసభలో చేరాడు. 1947 ప్రాంతంలో "నవభారత", "స్వతంత్ర భారత" పత్రికలలో నైజాంపాలనను విమర్శిస్తూ అభ్యుదయ జానపద శైలిలో రచనలకు శ్రీకారం చుట్టాడు. తెలంగాణ సాయుధ పోరాటం సమయంలో "తొలిదశ కమాండర్"గా పెన్నూ గన్నూ చేతబట్టి బరిలోకి దూకి పీడిత ప్రజల పక్షాన నిలిచి పోరాడాడు. రహస్య జీవితం గడుపుతూ పోరాట ఉద్యమం నిర్వహించాడు. 1948 అక్టోబర్ నుంచి 1952 డిసెంబర్ వరకు గుల్బర్గా, ఔరంగాబాద్, బీడ్, ఢిల్లీ, ఖమ్మం తదితర జైళ్లలో గడిపి...జైళ్లలో దుస్థితిని మార్చాలని 16 రోజులు నిరాహార దీక్ష చేపట్టడం ద్వారా చదవడం, రాయడం సౌకర్యాన్ని సాధించాడు. ఢిల్లీ కేంద్ర కారాగారంలో ప్రముఖ కమ్యూనిస్టు నేత ఇంద్రజిత్ గుప్తా, మణిపూర్ మాజీ ముఖ్యమంత్రి దశరథదేవ్, కే ఎన్ సింగ్, బర్ధన్, కెప్టెన్ మహ్మద్ తదితరులు రావెళ్లకు సహచరులుగా ఉన్నారు. 1952 డిసెంబర్ 8వ తేదీన ఆయన జైలు నుంచి విడుదల అయ్యాడు. నేలకొండపల్లి మండలం బోదుల బండలో క్యాంపు నిర్వహణ సమయాన ఓ సైనికుడు జరిపిన కాల్పుల్లో ఒక తూటా రావెళ్ల శరీరంలోకి దూసు కెళ్లింది. అయినప్పటికీ శక్తినంతటినీ కూడగట్టుకుని ఆయన కాల్పులు సాగించి, సైనికులను పలాయనం చిత్త గించేలా చేశాడు. "జయశ్రీ" అనే కలం పేరుతో 1947లో తన రచనా వ్యాసంగాన్ని ప్రారంభించి, తర్వాత... పురాతన్, క్రిషిక్, తెలంగాణ్యుడు, ఆర్.వి.ఆర్. పేరుతో ఎన్నో రచనలు చేశాడు. తన ఇంటినే ఓ కవితా కుటీరంగా మలుచు కున్నడు. ఆతరువాత గోకినేపల్లి కవిత కుటీరంలో నిరాడంబర జీవితం గడుపుతూ రచనలు సాగించాడు. రావెళ్ల పద్యరచనతో పాటు అనేక వచన రచనలు కూడా చేశాడు. తెలుగు, ఉర్దూల్లో అదుతేంగా రాయడంతో పాటు అనర్గళంగా మాట్లాడే వాడు. దాశరథి, ఆరుద్ర, శ్రీశ్రీ తదితర ప్రముఖుల సహచరుడు. రావెళ్ల కవితా ఖండికల్లో పల్లెభారతి, జీవనరాగం, అనలతల్పం, రాగజ్యోతులు, చైతన్య స్రవంతి తదితరాలు ఆయన పేరెన్నిక గన్న రచనలు. "మధుర కవి", "కర్షక కవి" అనే బిరుదులను పొందాడు. అలాగే "గురజాడ సాహితీ అవార్డు", "దాశరథీ సాహితీ పురస్కారం", "జాషువా సాహితీ అవార్డు"లను అందుకున్నాడు. "కదనాన శత్రువుల కుత్తుకలనవలీల నుత్తరించిన బలోన్మత్తులేలిన భూమి వీరులకు కాణాచిరా.. తెలంగాణ ధీరులకు మొగసాలరా...



భూగర్భమున నిధులు.. పొంగిపొరెడి నదులు శృంగార వనతతులు.. బంగారముల పంటనా తల్లి తెలంగాణరా.. వెలలేని నందనోద్యానమ్మురా... కలుపు మొక్కలు ఏరేస్తేనే చేనుకు బలం..రజాకార్లను తరిమేస్తే తెలంగాణకు వరం"...అంటూ తెలంగాణ వీరులకు కాణాచిగా, తరగని నిధులు, నదులతో రత్నగర్భగా ఉన్న స్థితిని, రజాకార్లను తరిమే యాల్సిన అవసరాన్ని పరమాద్భుతంగా కవిత్వీకరించాడు. 2013, డిసెంబర్ 10 న గ్రామీణ ప్రాంతంలో జీవించిన గొప్ప ప్రజా కవి, గోకినపల్లి లోని తన స్వగృహంలో తుదశ్వాస వదిలాడు.

**రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**

చురకలు



# నీటి'బొట్టు'... జల'సిరి'కి పట్టు

నేరేడుచర్ల : బొట్టు బొట్టుగా వచ్చే నీటిని ఒడిసి పట్టి భూమిలోకి ఇంకేలా చేస్తే తాగు, సాగునీటి ఇక్కట్లు చాలావరకు తీరతాయి. వర్షాకాలంలో చాలా వరకు భూగర్భ జలం ఆశాజనకంగానే ఉంటున్నా.. ఆ తరువాత అడుగంటి ఇక్కట్లు తప్పడం లేదు. జిల్లాలోని 23 మండలాల్లో ఒక్కో గ్రామాన్ని ప్రయోగాత్మకంగా ఎంపిక చేసి జలసంరక్షణ, పారిశుద్ధ్య సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఐదురకాల ఇంకుడు గుంతల నిర్మాణ పనులు చేపట్టారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం నిధులతో ఈ పనులు చేపడుతున్నారు. ఇళ్లలో వ్యక్తిగత, పాఠశాలల్లో సామాజిక ఇంకుడు గుంతలు, ప్రభుత్వ కార్యాలయాల్లో బోర్‌వెల్ రీఛార్జి, భవనాలపై నుంచి వచ్చే వాననీటి సంరక్షణ చర్యలు, గ్రామాల్లో మురుగు నీటిని సురక్షితంగా భూమిలో



ఇంకించేలా నిర్మాణాలు చేపట్టారు.

**నిధుల కేటాయింపు ఇలా...**

వ్యక్తిగత ఇంకుడు గుంతలకు రూ.6,500, సామాజిక రూ.14,073, బోర్‌వెల్ రీఛార్జి రూ.36,000, రూఫ్‌టాప్‌రెయిన్ వాటర్ సంరక్షణ రూ.39,000, డ్రైయిన్ చివర ఇంకుడు గుంతకు రూ.94,000 చెల్లించనున్నారు.

**చురుగ్గా సాగుతున్నాయి..**

డి.సోమసుందర్‌రెడ్డి, ఎంపీడీవో, నేరేడుచర్ల

వివిధ ఇంకుడు గుంతల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. వీటి నిర్మాణం వల్ల భూగర్భజలాలు పెరుగుతాయి. మురుగు నీరు భూమిలో ఇంకడం వల్ల గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు చాలావరకు తొలగే అవకాశం ఉంది.

# బడిలో ఐఐటీ పాఠాలు!



కరీంనగర్ : పాఠశాల దశలోనే అధునాతన సాంకేతిక కోర్సుల పట్ల అవగాహన పెంచుకోవడానికి మద్రాస్ ఐఐటీ స్వల్పకాలిక కోర్సులు ఉపయోగపడుతున్నాయి.. 'స్కూల్ కనెక్ట్' పేరిట ఆన్‌లైన్ ద్వారా శిక్షణ ఇస్తుండగా పదో తరగతి, ఇంటర్ విద్యార్థులు సద్విని యోగం చేసుకుంటున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల పదో తరగతి విద్యార్థులు సాంకేతిక కోర్సులకు సంబంధించి ప్రాథమిక అంశాలపై అవగాహన పెంచుకుంటున్నారు.

**ఉమ్మడి జిల్లాలో 71 విద్యాసంస్థలు..**

ఉమ్మడి జిల్లాలో మొత్తం 71 ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లోని విద్యార్థులు మద్రాస్ ఐఐటీ వారి వివిధ కోర్సులను అభ్యసిస్తున్నారు. డేటా సైన్స్-ఏఐ, ఎలక్ట్రానిక్స్ సిస్టమ్స్, ఆర్కిటెక్చర్ – డిజైన్, గణితం – కంప్యూటింగ్, గణితం – గేమ్-పజిల్స్, పర్యావరణ శాస్త్రం, బయో ఇంజినీరింగ్– బయోలాజికల్ సైన్స్, ఇంట్రడక్షన్ టూ లా, వైమానిక శాస్త్రం ప్రాథమికాంశాలు, మానవ శాస్త్రాల పరిచయం అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభంలో రిజిస్ట్రేషన్లు చేసుకున్న పాఠశాలలు, కళాశాలలకు ఈ అవకాశాన్ని కల్పిస్తున్నారు. ఎంపికైన విద్యా సంస్థకు ఐఐటీ వారు అందించే యునిక్ ఐడీ ద్వారా విద్యార్థులు వివిధ కోర్సుల్లో శిక్షణ కోసం రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నారు. ఒక్కో కోర్సుకు 2 నెలల పాటు ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తుండగా, విద్యార్థులు వ్యక్తిగత ఐడీ ద్వారా కోర్సులకు సంబంధించిన విద్యా విషయాలు, వీడియోలను పొందుతారు. ప్రతి 15 రోజులకోసారి వీకెండ్ పరీక్షలు, తుదకు ఫైనల్ పరీక్ష ఉంటుంది. ఇందులో అర్హత సాధించిన వారికి ధ్రువపత్రాలు ఇస్తున్నారు.ః విద్యార్థులకు ఏమైనా సందేహాలుంటే ప్రతి గూగుల్ మీట్ ద్వారా ఐఐటీ ఆచార్యులు నివృత్తి చేస్తారు.

**ఈ కోర్సులతో ప్రయోజనం ఇలా..**

డిజిటల్ నైపుణ్యాలు, లాజికల్ థింకింగ్ పెరుగుతుంది.

ఉన్నత విద్యావకాశాలపై అవగాహన కలుగుతోంది.

ఆధునిక సాంకేతికతపై పాఠశాల స్థాయిలోనే విద్యార్థులు పట్టు సాధిస్తున్నారు.తీరిక సమయంలో ఆన్‌లైన్ ద్వారా ఇంటి వద్దే తరగతులు వినే, చూసే వెసులుబాటు ఉండటంతో గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఆసక్తి ప్రదర్శిస్తున్నారు.

కృత్రిమ మేధపై ఆసక్తి పెరిగింది

డేటా సైన్స్- ఏఐ 8 వారాల కోర్సు పూర్తి చేసి మెరిట్ సర్టిఫికెట్ పొందా. కొత్త విషయాలు తెలుసుకోవడమే కాదు చిన్న ప్రోగ్రామ్స్ చేయడం నేర్చుకున్నా. కృత్రిమ మేధ భవిష్యత్తులో ఏరకంగా ఉపయోగపడుతుందనే దానిపై అవగాహన పెరిగింది.

పి.సహస్ర, జడ్పీ ఉన్నత పాఠశాల, ఇల్లంతకుంట

మార్పులపై అవగాహన

డేటా సైన్స్- ఏఐ కోర్సులో చేరడం ద్వారా చాలా అంశాలు నేర్చుకున్నా. సాంకేతిక పరిజ్ఞానంలో వచ్చే మార్పులపై అవగాహన కలిగింది. ఇంజినీరింగ్ కోర్సుల్లోని పలు అంశాలను ఇప్పుడే నేర్చుకునే అవకాశం దీని ద్వారా పొందా.కె.దిలీప్‌కుమార్, జడ్పీ ఉన్నత పాఠశాల, గట్టుబూత్కూర్

# కళాశాలను బతికిస్తున్నారు

మల్యాల: మల్యాల మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాలుగేళ్ల కిందట విద్యార్థుల సంఖ్య 150. ఇందులో తరగతులకు హాజరయ్యేది మాత్రం 50 మందే. ప్రస్తుతం మొదటి సంవత్సరంలో 105 మంది, రెండో సంవత్సరంలో 115 మంది చదువుతున్నారు. ఈ మార్పు వెనక అధ్యాపకులు, ప్రిన్సిపల్ సమష్టి కృషి ఉంది. విద్యార్థుల సంఖ్య తగ్గకుండా, వారు నిత్యం కళాశాలకు హాజరయ్యేలా చూడటంతో పాటు నాణ్యమైన బోధన ఇందుకు దోహదపడింది.

**ఆకలి తీరుస్తూ.. అండగా నిలుస్తూ**

దృశ్య, శ్రవణ విధానంలో బోధిస్తే చాలా కాలం గుర్తుండిపోతుందన్న ఆలోచనతో ప్రిన్సిపల్ శివరామకృష్ణ సొంత డబ్బుతో ప్రొజెక్టర్‌ను కొనుగోలు చేశారు. యానిమేషన్ వీడియోలతో పాఠాలు బోధిస్తున్నారు. ఒక్కో అధ్యాపకుడు 15-20 మంది విద్యార్థులను దత్తత తీసుకొని ప్రతి రోజూ కళాశాలకు హాజరయ్యేలా చూస్తున్నారు. విద్యార్థుల గైర్హాజరు, చదువులో పురోగతిపై ఎప్పటికప్పుడు తల్లిదండ్రులకు సమాచారం అందిస్తుంటారు.

తల్లిదండ్రులు లేని, పేద విద్యార్థుల చదువుకు మలబార్ గోల్డ్ సంస్థ అందించే ఆర్థిక సాయం కోసం అధ్యాపకులే స్వయంగా దరఖాస్తు చేస్తున్నారు. కళాశాల నుంచి రెండేళ్ల కిందట 42 మంది, గతేడాది



28 మంది విద్యార్థులు రూ.8 వేల నుంచి రూ.10 వేల ఆర్థిక సాయం పొందారు. ఈ సంవత్సరం 32 మంది దరఖాస్తు చేశారు.

వార్షిక పరీక్షల సమయంలో దాతల సాయంతో కళాశాలలో మధ్యాహ్నం భోజనం అందిస్తున్నారు.

దూర ప్రాంతాల నుంచి వచ్చే పేద విద్యార్థుల రవాణా ఖర్చులను అధ్యాపకులే సమకూరుస్తున్నారు.

విద్యార్థులకు కిచిడీ అందించడానికి ముడి సామగ్రి సమకూర్చడానికి సత్యసాయి సేవా సమితి నిర్వాహకులు ముందుకొచ్చారు.

పేరెంట్ టీచర్ సమావేశానికి అధ్యాపకులు స్వయంగా విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులను ఆహ్వానిస్తున్నారు.

పాఠాలు గుర్తుండిపోతున్నాయి

ప్రొజెక్టర్ సాయంతో యానిమేషన్ వీడియోల ద్వారా బోధించే పాఠాలు గుర్తుండిపోతున్నాయి. అధ్యాపకులు వివిధ రకాల బోధనా సామగ్రిని మాతోనే తయారు చేయించడంతో సబ్జెక్టుపై మరింత అవగాహన పెరుగుతోంది. అధ్యాపకుల ఆర్థిక సాయంతో బల్వంతాపూర్ నుంచి 6 కిలోమీటర్ల దూరంలోని కళాశాలకు వస్తున్నా.

గంగాభవాని, బైపీసీ రెండో సంవత్సరం

విద్యార్థుల హాజరుపై ప్రత్యేక శ్రద్ధ

ఒక్కో అధ్యాపకుడు 15 నుంచి 20 మంది చొప్పున దత్తత తీసుకున్నాం. గైర్హాజరయ్యే విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేస్తాం. కళాశాల జనావాసాలకు దూరంగా ఉండటంతో మధ్యాహ్న భోజనానికి ఇళ్లకు వెళ్తుంటే సమయం వృథా అవుతోంది. సత్యసాయి సేవాట్రస్టు నిర్వాహకులు కిచిడీ అందించడానికి ముందుకొచ్చారు. ఇటీవల మంజూరైన రూ.16 లక్షలతో అవసరమైన వసతులు కల్పిస్తాం.

శివరామకృష్ణ, ప్రిన్సిపల్

# ఉపాధి.. కొక్కొరోకో

రాజపేట: మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా సాగాలనే సంకల్పంతో ప్రభుత్వం అనేక రకాలుగా ప్రోత్సహిస్తోంది. వారుచేసే పనితో పాటు అదనపు ఆదాయం సమకూర్చుకోవాలని భావిస్తోంది. మహిళా స్వయం సహాయక సంఘం సభ్యుల అభ్యున్నతికి పథకాలు అమలు చేస్తోంది. పెరటికోళ్ల పెంపకం ప్రోత్సహిస్తోంది. తాజాగా జిల్లాలో ఒక్కో గ్రామైక్య సంఘంలో ముగ్గురు సభ్యులకు రూ.2 వేల రుణం కింద కోడి పిల్లల పంపిణీ కార్యక్రమం త్వరలో ప్రారంభించనుంది. ఒక్కొక్కరికి ఒక యూనిట్ కింద 20 కోడి పిల్లలు అందించనున్నారు. వీరు ప్రతి నెలా రూ.200 వాయిదా చెల్లించాల్సి ఉంటుంది.

వివరాలు క్లుప్తంగా..

**ప్రస్తుతం సభ్యుల గుర్తింపు ప్రక్రియ** కోళ్ల పెంపకందారులు గుడ్లతో కోడి పిల్లల పునరుత్పత్తి చేస్తే వారి నుంచి కోడి పిల్లలను కొనుగోలు చేసి ఇతర సభ్యులకు పంపిణీ చేసే అవకాశం ఉండనుంది. గతంలో జిల్లాలో కొన్ని మదర్ యూనిట్లు ఏర్పాటైనట్లుగా తెలుస్తోంది. నిరంతరం ఆదాయ వనరుగా మారే అవకాశం ఉండనుంది. ప్రస్తుతం జిల్లాలోని ఒక్కో గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో మూడు యూనిట్లు అందించే యోచనలో అధికారులు నిమగ్నమై ఉన్నట్లుగా సమాచారం. అయితే ప్రస్తుతం గుర్తింపు ప్రక్రియ జరుగుతున్నట్లుగా డీపీఎం సీహెచ్.రవీందర్ 'న్యూస్‌టుడే'తో వెల్లడించారు.

**యూనిట్లు మంజూరు ఇలా..**

భువనగిరి, ఆలేరు, బొమ్మలరామారం,చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం, భూదాన్ పోచంపల్లి, రాజపేట మండలాలకు 150 యూనిట్ల చొప్పున, అడ్డగూడూరు, ఆత్మకూర్(ఎం), బీబీనగర్, తుర్కపల్లి , మోటకొండూరు, రామన్నపేట, వలిగొండ మండలాలకు వంద, యాదగిరిగుట్ట, గుండాల 50 యూనిట్లు మంజూరయ్యాయి.

**పంపిణీ వివరాలు..**

ప్రస్తుతం మంజూరైనవి: 1850

ఒక్కో యూనిట్‌లో కోడిపిల్లలు : 20

యూనిట్‌కు అందించే రుణం: రూ.2వేలు

చెల్లించాల్సిన నెలవారీ కిస్తు : రూ.200

**అదనపు ఆదాయ వనరుగా..**

నాగిరెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి

మహిళల ఆదాయ అభివృద్ధికి దేశీయ కోడి పిల్లల పెంపకం దోహదపడుతుంది. ముఖ్యంగా పెరటికోళ్లతో పాటు పెరటి తోటలు, కూరగాయల సాగు, పాడి పరిశ్రమ వంటి యూనిట్లను మహిళా సభ్యులు సద్వినియోగం చేసుకోవాలి.

# బాల్యానికి భరోసా.. మనందరి బాధ్యత



పెద్దపల్లి : తల్లి పొత్తిళ్లలోనే కనుపాపలు మూసుకుంటున్నాయి. లోకం చూడకుండానే మృత్యు కౌగిలి ముద్దాడుతోంది. మాతృత్వపు మధురిమల రుచి చూడకుండానే కానరాని లోకాలకు చేరుకుంటున్నారు. ఏటికేటా పెరుగుతున్న నవజాతి శిశు మరణాలు తగ్గించేందుకు వైద్యారోగ్య శాఖ 'సంకల్ప్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలో ప్రయోగాత్మకంగా ఆదిలాబాద్ జిల్లాలో అమలు చేయగా సత్ఫలితం రావడంతో మిగిలిన జిల్లాల్లో ప్రవేశపెట్టారు. దీని కోసం ఆసుపత్రుల్లో ప్రత్యేక నవజాతి శిశు కేంద్రాలను ఏర్పాటు చేసి చికిత్స అందిస్తున్నారు.

**నిరంతర పర్యవేక్షణ**

జిల్లాలో నవజాతి శిశువు మరణాలు తగ్గించేందుకు పెద్దపల్లి, గోదావరిఖని సార్వజనిక ఆసుపత్రుల్లో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశారు. నిరంతరం పిల్లల వైద్యుల పర్యవేక్షణలో చికిత్స అందిస్తున్నారు. ఎలాంటి లక్షణాలు ఉన్నాయో తరచూ పరీక్షిస్తున్నారు. సంపూర్ణ ఆరోగ్యంగా తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. పుట్టిన వెంటనే పాలు పట్టించడం, తల్లి, తండ్రి ఒడిలోనే పాపను ఒదిగేలా చేస్తున్నారు. శిశువుల ఆరోగ్యాన్ని సాధారణ స్థితిలోకి తీసుకొస్తున్నారు. రెండేళ్ల గణంకాలు పరిశీలిస్తే కాస్త తగ్గుముఖం పట్టాయి.

**వివరాల సేకరణ**

జిల్లాలో నవజాతి, శిశు మరణాల సంఖ్య తేల్చేందుకు వివరాలు సేకరిస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో ఏడాదిలో ఎన్ని మరణాలు నమోదయ్యాయి? వాటికి గల కారణాలు తెలుసుకుంటున్నారు. గ్రామాల్లో గర్భం దాల్చిన ప్రతి ఒక్కరికి ఏఎన్‌ఎమ్‌లు, ఆశా కార్యకర్తలతో గర్భిణులు, బాలింతలకు చైతన్యం కల్పించనున్నారు. పౌష్టికాహారం తీసుకునేందుకు ప్రోత్సహించనున్నారు. ఏ ప్రాంతాల్లో అధికంగా మరణాలు ఉంటే వాటిపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు.

రెండేళ్లలో నవజాత శిశు మరణాలు

| | |
|---|---|
| 2024-25 | 40 |
| 2025-26 | 13 |

శిశు మరణాలకు కారణాలివే..

నెలలు నిండకముందే ప్రసవం

తల్లి గర్భ సంచి వదులుగా ఉండటం

రక్తహీనత, శరీర బలహీనత

పాప బరువు తక్కువగా, శ్వాసకోశ సమస్యలు ఉండటం

తల్లికి ఇన్‌ఫెక్షన్లు ఉండటం

# ఆటలకు చోటేది.. పోటీలకు నిధులేవి?

జగిత్యాల : 'క్రీడల అభివృద్ధే లక్ష్యం, క్రీడలతోనే ఆరోగ్యం' ఇవన్నీ వివిధ వేదికలపై ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు చెప్పే మాటలు. కానీ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే మైదానాలు, క్రీడా సామగ్రి అంతంతే. నిధుల కేటాయింపు అలసత్వంతో ఆటలకంటూ ఓ పీరియడ్ ఉంటుందనే విషయాన్ని విద్యార్థులు మరచిపోతున్నారు. దీంతో విద్యార్థుల్లో శారీరక, మానసిక ఆరోగ్యం ఆశించిన స్థాయిలో ఉండటం లేదు. చాలామందికి క్రీడల్లో ప్రవేశం లేకుండానే విద్యార్థి దశ ముగు స్తోంది. రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచేందుకు అవకాశం కల్పించే ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలకు ప్రభుత్వం నిధులు కేటాయించాలని క్రీడాకారులు అభ్యర్థిస్తున్నారు.

**బాలబాలికల విభాగాల్లో..**

ఉమ్మడి జిల్లాలో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బాస్కెట్బాల్, హ్యాండ్‌బాల్, నెట్బాల్, సాఫ్ట్‌బాల్, యోగా, క్రికెట్, అథ్లెటిక్స్ తదితర పోటీలపై ఆసక్తి ఉంది. దీంతో 14 ఏళ్లు, 17 ఏళ్లలోపు బాల, బాలికలకు పోటీలు నిర్వహిస్తున్నారు. ఇటీవల జగిత్యాల జిల్లాలో కథలాపూర్, మెట్పల్లిలో ఖోఖో.. లక్ష్మీపూర్‌లో బాస్కెట్బాల్ పోటీలు, రాజన్న సిరిసిల్ల జిల్లాలో కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించగా.. ఆసక్తి, ప్రాధాన్యత, ప్రాచుర్యం తదితర పరిస్థితులకనుగుణంగా మండలాలను గుర్తించి ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తున్నారు. మిగిలిన చదరంగం, టెండికాయిట్, బ్యాడ్మింటన్, ఈత



తదితర క్రీడలకు పెద్దగా పోటీ లేకపోవడంతో ఎంపికలతోనే సరిపెడుతున్నారు. మొత్తం 50 వరకు క్రీడాంశాలుండగా.. ఉమ్మడి జిల్లాలో పోటీలు, ఎంపికలు చేపట్టే క్రీడల సంఖ్యను వేళ్ల మీద లెక్కపెట్టే పరిస్థితులుండటం గమనార్హం.

**దాతలు ముందుకొస్తేనే నిర్వహణ**

జిల్లా స్థాయి పోటీలకు ప్రభుత్వం నుంచి ఎంతోకొంత నిధులు మంజూరవుతుండగా,.. ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలకు పైసా లేకుండా పోతుంది. వీటి నిర్వహణకు రూ.వేలల్లో నిధులు వెచ్చించాల్సి రావడంతో దాతలపై ఆధారపడటం తప్పనిసరిగా మారింది.

ఇటీవల కథలాపూర్‌లో ఉమ్మడి జిల్లా స్థాయి 14, 17 ఏళ్లలోపు విభాగంలో బాల, బాలికలకు ఖోఖో పోటీలు నిర్వహిస్తే ఒక్కో విభాగంలో నాలుగు జిల్లాల నుంచి 16 జట్లు పాల్గొన్నాయి. 192 మంది క్రీడాకారులు, న్యాయ నిర్ణేతలు, పీడీలు, పీఈటీలు, నిర్వాహకులు కలిపి మొత్తం 250 మందికి భోజనం ఖర్చు రూ.20 వేలు అయింది. సమ దుస్తులు ఒక్కో దానికి రూ.300 చొప్పున రూ.60 వేలు, బహుమతులకు మరో రూ.5 వేలు, నిర్వహణ కోసం టెంట్లు, మైక్, తాగునీరు తదితరాలకు రూ.10 వేలు కలిపి సుమారు రూ.లక్ష వరకు వెచ్చించాల్సి వస్తోంది.

# రెండుచోట్ల తాగునీరు కలుషితం..

ఖమ్మం : జిల్లా వ్యాప్తంగా అధిక వర్షాలకు వాగులు, వంకలు ఉప్పొంగి, నీటి వనరులన్నీ పూర్తిగా నిండాయి. రహదారుల పక్కన వరద నీరు నిలుస్తోంది. ఈ క్రమంలో కొన్ని గ్రామాల్లో తాగునీరు కలుషితం అవుతోంది. గ్రామీణ తాగునీటి సరఫరా(ఆర్‌డబ్ల్యూఎస్) అధికారులు ఖమ్మం, మధిర, సత్తుపల్లి తాగునీటి ప్రయోగశాలల్లో నీటి నమూనాలు పరీక్షించి ఫలితాలు తెలుసుకుంటున్నారు.

2025 జూన్ నుంచి సెప్టెంబరు 16 వరకు 2,729 తాగునీటి నమూనాలు పరీక్షించారు. 88 నమూనాల్లో అధిక మోతాదులో రసాయన పదార్థాలు గుర్తించారు. మరో 556 నమూనాలు సేకరించి బ్యాక్టీరియలాజికల్ పరీ క్షలు జరపగా ఎనిమిది నమూనాల్లో పాజిటివ్ ఉన్నట్లు తేల్చారు.

**సమస్య ఎక్కడ?**

ఖమ్మం రూరల్ మండలం కస్నాతండా, ఆరెకోడు గ్రామ పంచాయతీల పరిధిలోని బోర్లు, బావులు, ట్యాంకుల నుంచి ఈనెల 5, 6 తేదీల్లో సేకరించిన నీటి నమూనాల్లో బ్యాక్టీరియా, అధిక రసాయన పదార్థాలున్నట్టు తేలింది. వీటిని ప్రజలు తాగొద్దని పంచాయతీ కార్యదర్శులకు లేఖ ద్వారా తెలిపారు. వారం రోజులుగా బావులు, ట్యాంకులు శుభ్రం చేయిస్తున్నారు. కస్నాతండాలోని బావిలో నీటిని తోడేసి క్లోరినేషన్ చేయించారు. బోర్లు, ట్యాంకు లను శుభ్రపరుస్తున్నారు. జిల్లాలోని మూడు ప్రయోగశాలల్లో నిరంతరం తాగునీటి పరీక్షలు చేస్తున్నాం. ఎక్కడైనా తేడా ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే క్లోరినేషన్ చేయిస్తున్నాం. భగీరథ పైపులైన్ల ద్వారా శుద్ధి చేసిన నీరు సరఫరా అవుతున్నా కొన్నిచోట్ల పరీక్షిస్తున్నాం.పుష్పలత, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ, ఖమ్మం

# వడివడిగా భూసేకరణ ప్రక్రియ

కోరుట్ల : ఎల్లంపల్లి ఎత్తిపోతల ప్యాకేజీ-2లోని కలికోట సూరమ్మ జలాశయ కాలువల నిర్మాణం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కథలాపూర్, బీమారం, మేడిపల్లి, రుద్రంగి మండలాల్లోని దాదాపు 40 వేల ఎకరాలకు సాగు నీరందించే లక్ష్యంతో కథలాపూర్ మండలం కలికోట వద్ద 0.45 టీఎంసీల సామర్థ్యంతో జలాశయం నిర్మించారు. రూ.173.26 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ప్రాజెక్టులో ఇప్పటికే మత్తడి నిర్మాణం పూర్తి కాగా కట్ట, రివిట్‌మెంట్ తదితర పనులు కొనసాగుతున్నాయి. ప్రధాన కాలువలు, డిస్ట్రిబ్యూటరీలకు భూ సేకరణ కోసం నిధులు విడుదలయ్యాయి. అధికారులు రెండు గ్రామాల్లో సభలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. పంచాయతీ ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యాక పరిహారం చెల్లింపు పూర్తి కానుంది.

**13 గ్రామాలు.. 520 ఎకరాలు**

జలాశయం కుడి, ఎడమ కాలువలను కథలాపూర్, బీమారం, మేడిపల్లి మండలాల్లోని 13 గ్రామాల మీదుగా నిర్మించనున్నారు. 19.40 కిలోమీటర్ల మేర మొత్తం 520.19 ఎకరాల భూమిని సేకరించనుండగా సర్వే ద్వారా హద్దులు నిర్ణయించారు.

ఎడమ కాలువ కింద కలికోటలో 48.31 ఎకరాలు, పోతారం 24.17, ఇప్పపల్లి 39.11, తాండ్రియాల 40,13 ఎకరాలు, పోసానిపేట 20.17, దుంపేట 27.32, చింతకుంట 24.33 ఎకరాలు కలిపి మొత్తం 225.34 ఎకరాలు ముంపునకు గురి కానుంది.

కుడి కాలువ కింద తాండ్రియాల 2.09 ఎకరాలు, అంబారిపేట 73.03, గంభీర్‌పూర్ 50.05, గోవిందారం 104.09, బీమారం 22.18, మన్నేగూడెం 37.14, దమ్మన్నపేట 5.06 ఎకరాలు, 294.25 ఎకరాల భూమిని సేకరిస్తున్నారు.

**పది రోజుల్లో పరిహారం**

కుడి, ఎడమ కాలువల భూసేకరణ కోసం రూ.80 కోట్లు అవసరం. ఇందులో భాగంగా ఏడాది కిందట ప్రభుత్వం రూ.10 కోట్లను విడుదల



చేసింది. ఇటీవల మరోమారు రూ.34.50 కోట్లు రాగా మొత్తం రూ.45 కోట్లు కలెక్టర్ ఖాతాలో ఉన్నాయి. భూ సేకరణ కింద కలికోటలో ఎకరానికి రూ.9,40,310, పోతారంలో రూ.8,60,597 చొప్పున పరిహారం నిర్ణయించారు. మరో పది రోజుల్లో రైతుల ఖాతాల్లో పరిహారం జమ కానుంది. ఇప్పపల్లిలో శనివారం గ్రామసభ నిర్వహించగా తాండ్రియాల, పోసానిపేటల్లో ఈ నెల 16, దుంపేట, చింతకుంట గ్రామాల్లో 19న రైతులతో అధికారులు సమావేశమై అవార్డు పాస్ చేయనున్నారు. ఆ తర్వాత రైతుల ఖాతాల్లో పరిహారం జమ చేయనున్నారు.

**నెలాఖరు నాటికి పనులు ప్రారంభం**

కాలువలకు భూసేకరణ కోసం ఇప్పటికే గ్రామాల్లో పరిహారం ధర నిర్ణయించి అవార్డు పాస్ చేస్తున్నారు. భూమి కోల్పోయిన రైతుల ఖాతాల్లో త్వరలోనే నగదు జమ కానుంది. రెండు, మూడు వారాల్లో మొత్తం 13 గ్రామాల్లో భూ సేకరణ పూర్తవుతుంది. ఈ నెల చివరి వరకు కాలువల నిర్మాణ పనులు ప్రారంభించే అవకాశముంది.

జివాకర్‌రెడ్డి, కోరుట్ల ఆర్డీవో

చురకలు


# కలుషిత ముప్పు.. కలగాలి కనువిప్పు

సూర్యాపేట : ప్రస్తుతం అకాల వర్షాలు కురుస్తుండటంతో చలికాలం వానాకాలన్ని తలపిస్తోంది. పొద్దున ఎండ, సాయంత్రం వర్షం కురవడం.. వాతావరణంలో అనూహ్య మార్పులు చోటుచేసుకోవడంతో ప్రజలు జ్వరాలబారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం జిల్లాలో మిషన్ భగీరథ పథకంతో పాటు స్థానిక సంస్థల ద్వారా చాలా గ్రామాల్లో తాగునీటిని సరఫరా చేస్తున్నారు. జలాశయాలు, ట్యాంకులు, నల్లాల వద్ద నీటి నమూనాలను సేకరించి తప్పనిసరిగా పరీక్షలు చేయాల్సి ఉంది. నాణ్యత లోపించినట్లు నిర్ధారణ జరిగితే వెంటనే చర్యలు తీసుకోవాలి. గ్రామాల నుంచి నగరాల వరకు అనేక చోట్ల ప్రజల కోసం ఏర్పాటు చేసిన ప్రజా కుళాయిల నిర్వహణను గాలికి వదిలేస్తున్నారు. నీటి నాణ్యత, పర్యవేక్షణ విషయాన్ని అధికారులు పూర్తిగా మరిచారన్న విమర్శలున్నాయి.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

గ్రామ పంచాయతీ సంబంధిత సిబ్బందితో ఏటా నీటి నాణ్యత నిర్ధారణ పరీక్షలు చేయాలి.గ్రామీణ ప్రాంతాల్లో మిషన్ భగీరథ అధికారులు పరీక్షలు నిర్వహించాలి.

నీటి ట్యాంకులను శుభ్రం చేయాలి. వివరాలు నమోదు చేయాలి.

ఫిల్టర్ బెడ్‌లు, గృహాల వద్ద ఉండే నల్లాల నుంచి నమూనాలు సేకరించాలి.మంచినీటిని సరఫరా చేసే పైపులకు లీకేజీ సమస్యలు ఉంటే తక్షణ మరమ్మతు చేపట్టాలి.ప్రతిరోజు క్లోరిన్ కిట్లద్వారా నీటి పరీక్షలు నిర్వహించాలి.నీరు కలుషితం కాకుండా చర్యలు

యాదగిరి, జిల్లా పంచాయతీ అధికారి గ్రామాల్లో నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకుంటున్నాం. ప్రణాళిక రూపొందించి స్థానిక నీటి వనరుల్లో పరీక్షలు చేయడం, ట్యాంకులను శుభ్రం చేయించడం, క్లోరినేషన్ వంటి ప్రక్రియ చేపట్టనున్నాం. అన్ని పంచాయతీల్లో బ్లీచింగ్, ఇతర రసాయాలను సిద్ధంగా ఉంచాం. పైపులైన్లకు లీకేజీ ఏర్పడిన వెంటనే గ్రామపంచాయతీ, మిషన్ భగీరథ సిబ్బంది సమన్వయంతో మరమ్మతులు చేస్తున్నాం.

# శునకం వణికిస్తోంది..!

సూర్యాపేట : రోజురోజుకూ వీధి కుక్కలు పెరుగుతున్నా.. వాటి సంతతి నియంత్రణపై సంబంధిత అధికారులు దృష్టిసారించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఎక్కడో ఒకచోట వీటి బారినపడి బాధితులు చికిత్స పొందుతూనే ఉన్నారు. వీటి సంతతి పెరగకుండా చర్యలు చేపట్టాలని రెండేళ్ల క్రితం హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. క్షేత్రస్థాయిలో అధికారులు నేటికీ సరైన చర్యలు చేపట్టడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి నల్గొండ జిల్లాలోని పట్టణాలు, గ్రామాల్లో కుక్కకాటు బాధితులు ఏటా పెరుగుతున్నారు. శునకాల నియంత్రణ విషయంలో అధికారులు ప్రణాళిక ప్రకారం వ్యవహరించక పోవడంతో నానాటికీ వీటి బారిన పడుతున్న వారు అధికమవుతున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబరు వరకు 32,168 మంది శునకాల బారిన పడి గాయాలపాలయ్యారు. ఎవరూ మృత్యువాత పడలేదు. ఈ లెక్కన చూసుకుంటే నల్గొండ జిల్లాలో రోజుకు 55 మంది, సూర్యాపేట–57, యాదాద్రి జిల్లాలో 4 చొప్పున గాయపడుతున్నారు. చిన్నారుల నుంచి వృద్ధులపై ఎక్కడో ఒకచోట వీధి కుక్కలు దాడులు చేస్తూనే ఉన్నాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు సూర్యాపేట జిల్లాలో అధికంగా బాధితులు ఉన్నారు. వీధి కుక్కల నియంత్రణ విషయంలో చర్యలు చేపట్టాలని కోర్టులు ఆదేశాలు జారీ చేస్తున్నా.. చాలాచోట్ల అమలు కావడం లేదు.



సంతతి పెరగకుండా శునకాలకు చికిత్స చేయాల్సి ఉండగా.. కొన్ని రోజులకే పరిమితమవుతోంది. కొన్ని శునకాలకు చికిత్స చేసి మిగతా వాటిని వదిలేస్తున్నారు.వీధుల్లో గుంపులుగా ఉంటున్న కుక్కలు ఒంటరిగా వెళుతున్న చిన్నారులపై దాడులు చేసి తీవ్రంగా గాయపరుస్తున్నాయి. ఈ కారణంగా చిన్నారులను ఒంటరిగా బయటకు పంపాలంటే వారి కుటుంబ సభ్యులు జంకాల్సిన పరిస్థితి నెలకొంది. మాంసం విక్రయదారులు ఇష్టారాజ్యంగా వ్యర్థాలను పడేయడంతో వాటిని తినేందుకు కుక్కలు రోడ్లపై గుంపులుగా చేరుతున్నాయి. ఆ మార్గంలో ద్విచక్ర వాహనదారులు వెళితే వెంటపడుతున్నాయి. వీటి బారినుంచి రక్షించుకునే క్రమంలో వాహనాలు అదుపుతప్పి ఎంతోమంది గాయాలపాలైన ఘటనలు ఉన్నాయి.

రాత్రి సమయంలో గుంపులుగా స్వైర విహారం చేస్తున్న శునకాలు ఆ మార్గంలో ఎవరైనా వస్తే దాడులకు పాల్పడుతున్నాయి. రాత్రి సమయంలో వీధుల్లో ఒంటరిగా కాలినడకన వెళ్లలేని దుస్థితి నెలకొంటోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పట్టణాల్లో కుక్కల సంతతి పెరగకుండా చర్యలు తీసుకుంటామని పుర అధికారులుకు తెలిపారు.

# తేమ తగ్గితే బంగారమే..!

సూర్యాపేట : ఉమ్మడి నల్గొండ జిల్లాలో 7.82 లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతుంది. ఎకరాకు 10 క్వింటాళ్ల చొప్పున 78.31 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. సీసీఐ ద్వారా కొనుగోలు చేసేందుకు 41 జిన్నింగు మిల్లులను ఎంపిక చేశారు. నుంచి తెల్ల బంగారం కొనుగోలుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుకింగ్ చేసుకున్న రైతులే సీసీఐకి విక్రయించాలి. యాప్ గురించి పత్తి రైతులకు రైతువేదికల్లో ఏఈవోలు అవగాహన కల్పిస్తున్నారు.

తేమను బట్టి ధర: 8శాతం కాకుండా 9, 10, 11, 12శాతం తేమ ఉంటే సీసీఐ నిర్ణయించిన పింజ రకాలు, పొడవునుబట్టి ధర తగ్గుతూ వస్తుంది.పింజపొడవు (గింజ నుంచి పత్తిని వేరు చేసినప్పుడు వచ్చే దూది పొడవు)

మైక్రోనీర్ (గింజ నుంచి లాగినప్పుడు కనిపించే పత్తి సాంద్రత)

ప్రభుత్వం పత్తి కొనుగోలు సంబంధిత సేవలను పొందడానికి టోల్ ఫ్రీ నెంబరును అందుబాటులోకి తీసుకొచ్చింది. సందేహాలున్న రైతులు 1800 599 5779 నెంబరుకు ఫోన్ చేసి పరిష్కరించుకోవచ్చు.

జిల్లాలో 9 సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నట్లు మార్కెటింగ్ శాఖ ఏడీ ఛాయాదేవి తెలిపారు. తిప్పర్తి మండలం రామలింగాలగూడెం సత్యనారాయణ కాటన్ ఇండస్ట్రీ, చండూరు బాలాజీ కాటన్ ఇండస్ట్రీ, చిట్యాల వరలక్ష్మి కాటన్ ప్రైవేట్ లిమిటెడ్, మాల్–ఏ శ్రీలక్ష్మి నరసింహ ఆగ్రో ఇండస్ట్రీ, మాల్–బి శివ గణేష్ కాటన్ ఇండస్ట్రీ, మల్లేపల్లి–ఏ శివ కాటన్ ఇండస్ట్రీ, మల్లేపల్లి–బి తిరుమల కాటన్ జిన్నింగ్ ప్రాసెసింగ్ మిల్, నకిరేకల్ శ్రీనాథ్ కాటన్ ఫైబర్, శాలిగౌరారం టీఆర్ఆర్ కాటన్ మిల్లుల్లో పత్తి కొనుగోలు జరుపుతారు.

# బడి జాగా.. అక్రమార్కుల పాగా




కొడంగల్: గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల స్థలాలు కబ్జాలకు గురవుతున్నాయి. చాలామంది ఆక్రమించి దర్జాగా ఇళ్లు నిర్మించుకొంటున్నారు. ప్రస్తుతం భూముల ధరలకు రెక్కలు రావడంతో ఇంతకుముందు జాగాలు దానం చేసిన వారూ తిరిగి కబ్జాలకు పాల్పడుతున్నారు. జిల్లాలో ఇలాంటి సంఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. బడులకు ప్రహరీలు లేకపోవడంతో అక్రమార్కులకు అవకాశంగా మారిందని ఆయా పల్లెల ప్రజలు అంటున్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేసి పాఠశాలలకు కొత్త భవనాలు నిర్మిస్తున్నా.. ప్రహరీల విషయం పట్టించుకోవడం లేదు.

**ఆట స్థలాలు, అదనపు గదుల్లేక ఇక్కట్లు..**

విద్యార్థులకు చదువుతోపాటు ఆటలూ చాలా ముఖ్యం. అప్పుడే విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటారు. ఆటలు ఆడుకొనేందుకు స్థలాల్లేక విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారు. గతంలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉంటే ఒకటి, రెండు గదులు నిర్మించి వదిలేశారు. ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య పెరగడంతో అదనపు గదులు అవసరమవుతున్నాయి. ప్రభుత్వం అదనపు గదులు నిర్మించాలనుకొన్నా.. సరైన స్థలాల్లేక ఇబ్బందులు తప్పడం లేదు. గతంలో నిర్మించినవి శిథిలావస్థకు చేరడంతో వాటిని కూల్చడానికీ నిధుల్లేవని పలు గ్రామాల ప్రజలు అంటున్నారు.

**ఆక్రమణలు ఇలా..**

హుసేన్‌పూర్‌లో దాతలు పాఠశాల భవన నిర్మాణానికి 10 గుంటల భూమి కేటాయించారు. దాంట్లో గతంలో ఓ గది నిర్మించారు. తరవాత మరోటి కట్టారు. ముందుగా నిర్మించిన గది పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్న ఒక్క గదిలో 48 మంది కూర్చోలేక తిప్పలు పడుతున్నారు. కొందర్ని వరండాలో కూర్చోబెడుతున్నారు. బడికి ప్రహరీ లేకపోవడంతో ఆవరణలో ఇప్పటికే కొందరు ఇళ్లు నిర్మించుకున్నారు.

ప్యాలమద్దిలో ఊరికి కొంత దూరంలో దాతలు అర ఎకరం స్థలం దానమిచ్చారు. ప్రస్తుతం రెండు గదులున్నాయి. ప్రహరీ లేకపోవడంతో కొంత స్థలం కబ్జాకు గురైంది. హస్నాబాద్ ఉన్నత పాఠశాలకు కేటాయించిన స్థలాన్ని చాలా మంది ఆక్రమించారు. దీంతో తాత్కాలికంగా చుట్టూ తీగలతో ప్రహరీ సిద్ధం చేశారు.

కబ్జా స్థలాలపై దృష్టి సారిస్తాం..

ప్రభుత్వ పాఠశాలల స్థలాలపై ప్రత్యేక దృష్టి సారించి కబ్జా నుంచి విడిపించేందుకు ప్రయత్నిస్తాం. కొన్ని బడుల స్థలాలు కబ్జా అయినట్లు సమాచారం వచ్చింది. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరిస్తాం.

రాంరెడ్డి, ఎంఈవో, కొడంగల్

# అసంపూర్తిగా.. ఆకర్షణీయం



కరీంనగర్ : కరీంనగర్ స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏడేళ్ల కిందట ప్రారంభించిన ‘ఆకర్షణీయ’ పనుల గడువు ముగియనుంది. నగరాభివృద్ధిలో భాగంగా 34 ప్రాజెక్టులు తీసుకున్నారు. రహదారులు, వరద కాలువలు, ఫుట్‌పాత్‌లు, కూడళ్ల సుందరీకరణ, పార్కులు, స్పోర్ట్స్ కాంప్లెక్స్, స్టేడియంలో పనులు, ట్రాఫిక్ సిగ్నళ్లు, ఉచిత వైఫై, డిజిటల్ తెరలు, స్మార్ట్‌క్లాసులు, 24 గంటల తాగునీటి సరఫరా వంటి పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొచ్చారు. మధ్యలో వదిలేసిన పనులపై అధికారులు, గుత్తేదారు కన్నెత్తి చూడటం లేదు.**ఆ పనులను చేసేదెవరు?**

కట్టరాంపూర్ ప్రధాన రహదారిపై రెండు చోట్ల రోడ్డుతోపాటు మురుగుకాలువ నిర్మించాల్సి ఉంది.

గౌతమినగర్‌లో స్మార్ట్‌సిటీ పనులు చేసేందుకు ఏర్పాటు చేసుకున్న పాయింట్ దగ్గర రోడ్డుతోపాటు మురుగునీరు వెళ్లేందుకు పనులు చేయకుండా వదిలేశారు.

అంబేడ్కర్ స్టేడియం నుంచి గణేశ్‌నగర్ బైపాసురోడ్డులో ప్రధాన కాలువ నిర్మించగా మాజీ ఎమ్మెల్సీ ఇంటికి ఎదురుగా కాలువ నిర్మించేందుకు సగం మేర పనులు చేసి అలాగే ఉంచారు.

అశోక్‌నగర్ చౌరస్తా నుంచి మాజీ ఎమ్మెల్యే బొమ్మ వెంకన్న ఇంటివరకు వరద కాలువపై శ్లాబు వేయగా మిగతా కొద్ది భాగం సీసీ రోడ్డు వేయకుండా ఆపేశారు.

**నిర్వహణ సమయంలో నిర్లక్ష్యం**

అభివృద్ధి పనులకు నిర్వహించే టెండర్ నిబంధనల ప్రకారం రెండేళ్లు నిర్వహణ గడువు ఉంటుంది. ఎక్కడా ఎలాంటి లోపాలు వచ్చినా మరమ్మతులు చేసిన తర్వాతే బిల్లులు ఇవ్వాల్సి ఉంటుంది. అవేవి పరిశీలించకుండానే కమీషన్ల కక్కుర్తితో బిల్లులు మాత్రం చెల్లించారు. పలు చోట్ల టైల్స్ పగిలాయి. ఎక్కడ పడితే అక్కడ రోడ్ల మధ్య పైపులైన్లు లీకయ్యాయి. స్మార్ట్‌లైట్లు వెలిగించకుండా, బిగించకుండా పత్తాలేకుండాపోయారు.

స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో పనులు త్వరగా వేగంగా జరుగుతాయని భావించిన నగరవాసులకు ఎప్పటిలాగే అవస్థలు తప్పడం లేదు. అసంపూర్తి పనులు వదిలేయగా, కొత్తగా వేసిన రోడ్లు కూడా లీకేజీల పేరుతో తవ్వేస్తున్నారు.


ఇతర నిధులతో పూర్తి చేస్తాం

స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో జరుగుతున్న పనులు ఈనెల 31లోగా పూర్తి చేయాలి. మధ్యలో వదిలేసిన పనులన్నీ ఇతర నిధులు, సీఎంఏ గ్రాంట్స్‌తో పూర్తి చేయిస్తాం.

ప్రఫుల్ దేశాయ్, కమిషనర్, నగరపాలిక

| | |
|---|---|
| ప్రాజెక్టుల విలువ | : రూ.937.14 కోట్లు |
| మొత్తం పనులు | : 46 |
| పూర్తయినవి | : 34 |
| పూర్తయిన రోడ్లు | : 36.15 కి.మీ |
| వరదకాలువలు | : 26.05 కి.మీ |

# నగరవాసి చూపు.. భావినగరం వైపు




హైదరాబాద్: భారత్ ఫ్యూచర్‌సిటీ తెలంగాణ గ్లోబల్ సమిట్–2025కి ఆతిథ్యం ఇచ్చేందుకు సర్వం సిద్ధమైంది. తుదిమెరుగులు దిద్దుకుంటోంది. హైదరాబాద్ దక్షిణ ప్రాంతమంతా సదస్సు కోసం చేస్తున్న ముమ్మర ఏర్పాట్లతో సందడి నెలకొంది. సోమవారం ప్రారంభమయ్యే ప్రతిష్ఠాత్మక సదస్సు కోసం రంగారెడ్డి జిల్లా మీర్‌ఖాన్‌పేటలోని 100 ఎకరాల ప్రాంగణాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. డిజిటల్ హంగులద్దారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీని తలదన్నేలా, స్టార్ హోటల్‌ను మరిపించేలా ప్రధాన వేదిక, ఎగ్జిబిషన్ స్టాల్, ఇతర వేదికలు, ఆరుబయట ఏర్పాట్లు అదుర్స్ అనేలా తీర్చిదిద్దారు. దేశ, విదేశీ ప్రతినిధులకు ఘనంగా ఆహ్వానం పలికేందుకు తుక్కుగూడ ఓఆర్ఆర్ నుంచి ఫ్యూచర్‌సిటీ వరకు స్వాగతతోరణాలు ఏర్పాటు చేశారు. శ్రీశైలం జాతీయ రహదారి మార్గంలో కందుకూరుకు రెండు కిలోమీటర్ల ముందే గూడూరు గేటు వద్ద ఎడమ వైపు వెళితే ఫ్యూచర్‌సిటీ వస్తుంది. గూడూరు నుంచి ఫ్యూచర్‌సిటీ వరకు రహదారికి ఇరువైపుల తెలంగాణ విజన్ తెలిసేలా చేసిన ఏర్పాట్లు ఆకట్టుకుంటున్నాయి. ప్రాంగణంలోకి అడుగుపెట్టగానే పచ్చదనం, వేలకొద్దీ అలంకరణ మొక్కలతో భవిష్యత్తు నగరానికి అద్దం పడుతోంది. ఈ దృశ్యాలను కనులారా చూసేందుకు, తెలంగాణ దార్శనికతను దర్శించేందుకు ఇప్పుడు దారులన్నీ సదస్సు జరిగే ప్రాంగణానికే బారులు తీరాయి.

# మంజీరా.. అరకొర!

సంగారెడ్డి : ఇంటింటికీ శుద్ధి చేసిన నీటిని సరఫరా చేస్తున్నామని చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో మరోలా ఉంది. జిల్లా కేంద్రానికి చేరువలోని కొండాపూర్ మండలం మల్కాపూర్‌లో, కంది మండలం బేగంపేట తండా, ఎర్దనూర్ తండా, ఇలా అధికారికంగా 22 గ్రామాలకు నీటి సరఫరా నోచుకోవడం లేదు. ఎత్తుపల్లాలు, చివరి గ్రామాల్లో ఈ పరిస్థితి నెలకొంది. రూ.కోట్ల వ్యయంతో చేపట్టిన పనులు.. ప్రజలకు దాహం తీర్చడం లేదు. సరఫరా అయ్యే నీటిని శుద్ధి చేయడం లేదని పలుమార్లు కలెక్టరేట్, పురపాలక కార్యాలయాల్లో ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నారు. స్థానిక బోరు ద్వారా మిషన్ భగీరథ నీటిని ట్యాంకుల్లోకి ఎక్కించి కలుషితం చేస్తున్నారని ఆరోపణలున్నాయి.

**బుస్సారెడ్డిపల్లి నుంచి సరఫరా..**

జిల్లాలో మిషన్ భగీరథ పథకం అమలులో భాగంగా మునిపల్లి మండలం బుస్సారెడ్డిపల్లి మంజీరా పరివాహకంలోని ఇన్‌టెక్ వెల్‌లో నీటిని శుద్ధి చేసి పైపులైన్ల ద్వారా సరఫరా చేస్తుంటారు. ప్రతి గ్రామంలో ప్రతి కుటుంబానికి 100 లీటర్లు, పురపాలక పరిధిలో 135 లీటర్ల చొప్పున అందిస్తున్నామని అధికారులు చెబుతున్నా ఆ దిశగా ఎక్కడ అమలు కావడం లేదని విమర్శలొస్తున్నాయి. ఇదిలా ఉంటే పైపులైన్ల లీకేజీలు, మరమ్మతుల పేరిట నెలలో మూడు, నాలుగు రోజుల పాటు



అంతరాయం తలెత్తుతోంది. గ్రామాల్లో ప్రతి నెలలో 1, 11, 21 తేదీల్లో బ్లీచింగ్ పౌడర్ వేసి ట్యాంకులను పరిశుభ్రం చేసి సరఫరా చేయాలనే నిబంధనలు అమలుకు నోచుకోవడం లేదు.

**జిల్లాలో మిషన్ భగీరథ పథకం లెక్కలిలా..**

అవాస ప్రాంతాలు 854

ప్రాజెక్టు విలువ రూ.523.65కోట్లు

ఇప్పటి వరకు ఖర్చు చేసింది రూ.458.54 కోట్లు

ట్యాంకులు 1423

కుళాయి కనెక్షన్లు 2,27,382

పైపులైన్ కిలో మీటర్లు 2849.78

# నిఘా నీడలో పోరు

సంగారెడ్డి : పంచాయతీ ఎన్నికలు సజావుగా సాగేందుకు జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపడుతోంది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈపాటికే సమస్యాత్మకం, అత్యంత సమస్యాత్మకం, సున్నితమైన పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. అక్కడ పోలింగ్ సరళిని నిరంతరం పర్యవేక్షించడానికి వెబ్ కాస్టింగ్ విధానం అమలుచేయనున్నారు.

**956 పోలింగ్ కేంద్రాల్లో..**జిల్లాలో మూడు విడతల్లో పల్లె పోరు సాగనుంది. పోలింగ్ సరళితో పాటు గొడవలకు అవకాశం ఉన్న గ్రామాలను వెబ్ కాస్టింగ్ ప్రక్రియకు ఎంపిక చేశారు. ఇందుకోసం ఆయా గ్రామాల్లో ఆన్‌లైన్‌లో ఒక్క క్లిక్ కొడితే అక్కడ పోలింగ్ సరళి వీక్షించేలా నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్ ఆమోదం ప్రకటించారు. జిల్లాలో మొత్తం 956 పోలింగ్ కేంద్రాల్లో(తొలి విడతలో 139, మలి దశలో 436, తుది ఘట్టంలో 351) వెబ్ కాస్టింగ్ చేసేలా యంత్రాంగం చర్యలు చేపడుతోంది.

ప్రజలు సహకరించాలి

జానకిరెడ్డి, ఇన్‌ఛార్జి డీపీఓ, సంగారెడ్డి

ఎన్నికల సమయంలో అల్లర్లు, గొడవలు జరిగే గ్రామాలను ఇప్పటికే గుర్తించాం. అక్కడ పోలీసులు బందోబస్తు పర్యవేక్షిస్తారు. వెబ్ కాస్టింగ్ విధానం ద్వారా క్షణాల్లో పోలింగ్ సరళితో పాటు గొడవలను సులభంగా తెలుసుకునేందుకు అవకాశం ఉంటుంది. జిల్లా ప్రజలు సహకరించాలి.

# పాదుల తవ్వకాల్లోనూ అక్రమం

వెల్దుర్తి: వెల్దుర్తి మండలం కంచన్‌పల్లి పరిధి మానేపల్లి అడవిలో నాటిన చెట్ల చుట్టూ పొదలు శుభ్రం చేసి పాదులు తవ్వకంలోనూ అక్రమాలు చోటుచేసుకోవడం గమనార్హం. ఒక చెట్టు చుట్టూ సాయిల్ వర్క్ చేసేందుకు అటవీ శాఖ రూ.9 ఇస్తుండగా కూలీలకు మాత్రం కేవలం రూ.5 చెల్లిస్తున్నారు.30 హెక్టార్లలో..

కంచన్‌పల్లి బీట్ పరిధిలో మూడేళ్ల క్రితం 30 హెక్టార్లలో మొత్తం 36 వేల మిశ్రమ జాతుల మొక్కలు నాటారు. వాటి సంరక్షణకు మూడేళ్లు నిర్వహణ నిధులు మంజూరు చేస్తారు. ఇటీవల చివరి దశలో నిర్వహణ నిధులు మంజూరయ్యాయి. ప్రస్తుతం సుమారు 32 వేల చెట్లు ఉన్నాయి.

ఒక అడుగు మేర..

ప్రతి చెట్టు చుట్టూ రెండు అడుగుల చుట్టుకొలతతో పొదలు శుభ్రం చేసి పాదులు తవ్వాలి. ఓ అడుగు మేర మట్టి తవ్వాలి. దీనివల్ల ప్రస్తుతం కురిసే మంచుతో తేమ అంది చెట్లు ఏపుగా పెరుగుతాయి. మానేపల్లి, మంగళపర్తి గ్రామాలకు చెందిన పలువురు కూలీలు సదరు పనులు చేశారు.

రూ.4 తక్కువగా..

కూలీలకు ప్రతి చెట్టు చుట్టూ చేసే పనికి రూ.9 చెల్లించాలి. అయితే కేవలం రూ.5 ఇచ్చి చేతులు దులుపేసుకుంటున్నారు. ఇలా ప్రతి చెట్టుకు మిగిలిన రూ.4 ఏమయ్యాయో అధికారులకే తెలియాలి. ప్రస్తుతం ఉన్న 32 వేల మొక్కలకు రూ.9 చొప్పున మొత్తం రూ.3.24 లక్షలు వెచ్చించాలి. కానీ కూలీలతో ఒప్పందం చేసుకొని తక్కువకు పని చేయిస్తున్నారు.

చేతులకు గాయాలు.. చెర్ల భారతమ్మ కూలీ

చెట్ల చుట్టూ పాదులు తీయడం వల్ల మా చేతులకు గాయాలు అవుతున్నాయి. కూలీ ఎక్కువ ఇవ్వాలని కోరినా ఎవరూ పట్టించుకోవడం లేదు. రూ.5 మాత్రమే చెల్లిస్తున్నారు.

గుత్తేదారుదే బాధ్యత

30 హెక్టార్లలో చెట్ల చుట్టూ పాదులు తవ్వే పనులు (సాయిల్ వర్కింగ్) చేయిస్తున్నాము. మేము కూలీలను నియమించడానికి ప్రయత్నించగా, ఎవరూ ముందుకు రాలేదు. దీంతో గుత్తేదారుకు బాధ్యతలు అప్పగించాం. కూలీ తక్కువగా చెల్లించడం అతడిదే బాధ్యత. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

భూపతి, అటవీ శాఖ సెక్షన్ అధికారి, మంగళపర్తి

చురకలు



# అయిదు తరగతులకు ఒకే పాఠం!

పెద్దశంకరంపేట: పెద్దశంకరంపేట మండలం రాఘవానితండా ప్రాథమిక పాఠశాలలో 17 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి ఒక్కరే ఉపాధ్యాయురాలు. అయిదు తరగతులకు బోధన చేయాల్సి వస్తోంది. అత్యవసర పరిస్థితిలో ఆమె సెలవు కూడా పెట్టలేని పరిస్థితి. ఇక ఒకే పాఠం అయిదు తరగతుల వారు వినాల్సి వస్తోంది. జిల్లా వ్యాప్తంగా 234 పాఠశాలల్లో ఇలాంటి దుస్థితే నెలకొంది. జిల్లా వ్యాప్తంగా: మెదక్ జిల్లా వ్యాప్తంగా 902 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో ప్రాథమిక పాఠశాలలు 623. వీటిలోనే అధికంగా 234 పాఠశాలలు ఏకోపాధ్యాయులతో కొనసాగుతున్నాయి. వీటిల్లో విద్యార్థుల సంఖ్య 20 లోపే ఉండడంతో బోధనకు ఒక్కరినే కేటాయించారు. వీటిలో 51 పాఠశాలల్లో పదిలోపే విద్యార్థులు ఉండటం గమనార్హం. మారుమూల ప్రాంతాల్లో ఈబడులు కొనసాగుతుండటం వల్ల విద్యార్థుల సంఖ్య లేకపోవడం వల్ల ఉపాధ్యాయ పోస్టులు లేకుండా పోయాయి. అయితే ఉన్న విద్యార్థులకు



మాత్రం సరిగా బోధన అందడం లేదు. ఉన్న ఒక్క ఉపాధ్యాయులపై పాఠశాల నిర్వహణ బాధ్యత పడటంతో బోధనకు పూర్తి స్థాయి సమయం దొరకడం లేదు.

**తప్పని ఇబ్బందులు**

ఉపాధ్యాయులకు యూడైస్ ఆన్‌లైన్ పని, మధ్యాహ్న భోజన పర్యవేక్షణ, హాజరు, ప్రధానోపాధ్యాయుల సమావేశాలు వంటి పనులతో ఇబ్బందులు తప్పడం లేదు. ఈ పాఠశాలలతో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అవస్థలు తప్పడం లేదు. బోధన సరిగా సాగక విద్యా ప్రమాణాలు దెబ్బతింటున్నాయి. ఉన్న ఒక్క ఉపాధ్యాయులు అన్ని తామై నడిపించడం భారంగా మారుతోంది. ఉపాధ్యాయులకు అత్యవసర పరిస్థితిలో సెలవుపై వెళ్లాలంటే ప్రత్యామ్నాయంగా ఒక ఉపాధ్యాయులైనా, సీఆర్పీ అయినా పాఠశాలకు రావాల్సిందే. పాఠశాల మూసేయకుండా ఉండేలా ఆదేశాలు ఉండడంతో సెలవు తీసుకోవడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విద్యావాలంటీర్లు ఉన్న సమయంలో వెసులుబాటు ఉండేది. ఈ పాఠశాలల ఉపాధ్యాయులు పాఠశాల సముదాయ సమావేశాలు, దృశ్యసమీక్షలు వంటి ఇతర సమావేశాలకు వెళ్లాలంటే ప్రత్యామ్నాయం వెతుక్కోవాల్సి వస్తోంది. ఇలా ఇబ్బందులు నడుమ ఏకోపాధ్యాయ పాఠశాలలు కొనసాగక తప్పడం లేదు.

**మూతపడకుండా చర్యలు**

ఏకోపాధ్యాయ పాఠశాలలు ఇబ్బందులు నడుమ కొనసాగుతున్నా విద్యార్థులకు నష్టం జరగకుండా చూస్తున్నాం. వాటిని మూసివేయకుండా ప్రత్యామ్నాయంగా అక్కడ ఏర్పాటు చేస్తున్నాం. విద్యార్థులు తక్కువగా ఉన్న పాఠశాలల్లోనే ఈ పరిస్థితి ఏర్పడుతోంది. సంఖ్య పెరిగితే ఉపాధ్యాయుల సర్దుబాటు, పోస్టుల మంజూరు చేసే అవకాశం ఉంటుంది. రాధాకిషన్ జిల్లా విద్యాధికారి

# తెలుసుకో.. జాగ్రత్తగా మసలుకో!

సిద్దిపేట : మారిన పరిస్థితుల్లో చరవాణి తోడుగా.. ఆన్‌లైన్ వేదికగా లావాదేవీలకు ప్రాధాన్యం పెరిగింది. ఇదే అదనుగా సైబర్ నేరగాళ్లు వివిధ రూపాల్లో మోసాలకు పాల్పడుతున్నారు. కేవైసీ నమోదు.. నవీకరణ పేరిట.. గాలం వేసి బురిడీ కొట్టిస్తున్నారు. ఈ నేపథ్యంలో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని బ్యాంకు అధికారులు సూచిస్తున్నారు. ఎలాంటి సందర్భాల్లో ఈ కేవైసీ(నో యువర్ కస్టమర్) అవసరం.. ప్రక్రియను ఎక్కడ.. ఎలా చేపట్టాలనే సమాచారం మీకోసం..

**పథకాల లబ్ధిదారులకు..**

ప్రభుత్వ రాయితీ, వివిధ పథకాల కింద లబ్ధి పొందాలంటే డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్(డీబీటీ) కింద బ్యాంకులు ఆధార్, మొబైల్ నంబరు, ఇతర వివరాలు(కేవైసీ) జత చేయాలని సూచిస్తుంటాయి. ప్రధానంగా ఉపాధి హామీ కూలీలు, రైతులు, చేయూత పింఛనర్లు, ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నగదు జమ క్రమంలో ప్రత్యేకంగా అడుగుతుంటాయి. ఖాతాకి ఆధార్, పాన్ కార్డును లింకు చేసుకోవాల్సిందిగా అధికారులు సూచిస్తుంటారు.

**మూడు విభాగాల్లో పరిశీలన**

బ్యాంకు వినియోగదారులను మూడు కేటగిరీలుగా విభజిస్తారు. లో రిస్క్ (చిరువ్యాపారులు, ఉద్యోగులు) పదేళ్లకోసారి, మీడియం రిస్క్(స్థిరాస్తి, ఉన్నత స్థాయి వ్యాపారులు, కంపెనీలు నిర్వహించే వారు) ఎనిమిదేళ్లకోసారి, హైరిస్క్(ఎగుమతి-దిగుమతి వ్యాపారులు, అధిక రిస్కు దేశాల్లో ఉండేవారు, నేర చరితులు) రెండేళ్లకోసారి రీ-కేవైసీ చేయాలి.




**వీరు బ్యాంకుకు వెళ్లాల్సిందే..**

సంతకాలు, ముఖ కదలికలు, వివిధ రకాల వివరాల మార్పు సహజంగా జరుగుతుంది. కొన్ని సందర్భాల్లో ఖాతాదారులను గుర్తించేందుకు ప్రత్యేకంగా బ్యాంకులు ఆహ్వానిస్తుంటాయి. లావాదేవీలు సక్రమంగా చేపట్టేందుకు, నవీకరణకు పునః ప్రక్రియ దోహదం చేస్తుంది.

ఖాతా ఏడాది నుంచి రెండేళ్ల పాటు వినియోగించకుంటే ఇన్‌యాక్టివ్ దశలోకి వెళ్తుంది. బ్యాంకు ద్వారా వడ్డీ లాంటివి జమ అయినా.. ఖాతాదారుల లావాదేవీలు మాత్రం స్తంభిస్తాయి. రీ-కేవైసీ, ఈ-కేవైసీ పత్రాల సమర్పణను బ్యాంకుల్లో నేరుగా ఖాతాదారు చేపట్టడం ఉత్తమం. **నేరుగా సంప్రదించాలి**హరిబాబు, ఎల్‌డీఎం, సిద్దిపేట

రెండేళ్లుగా ఖాతాను వినియోగించని వారు సంబంధిత బ్యాంకుల్లో అధికారులను నేరుగా సంప్రదించాలి. నిర్దేశిత ధ్రువపత్రాలతో కేవైసీ ఫారాన్ని పూరించి సమర్పించాలి. గుర్తుతెలియని, అనుమానిత నంబర్ల నుంచి వచ్చే లింకులు, ఫోన్లకు స్పందించవద్దు.

# రాళ్లు వెనకేసుకొంటున్నారు..



బషీరాబాద్: మండలంలోని నాలుగు గ్రామాల్లో నాపరాయి అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ప్రభుత్వ భూముల్లో ఎలాంటి అనుమతుల్లేకుండా యంత్రాలను వినియోగించి మట్టిని తోడేసి నాపరాళ్లను వెలికి తీస్తున్నారు. ఈ విషయం గనులు, భూగర్భ, రెవెన్యూ శాఖల అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. అక్రమ తవ్వకాలను కొందరు వ్యక్తులు పోటాపోటీగా సాగిస్తున్నారు. ఇటీవల రెవెన్యూ అధికారులు ఎక్మాయి గట్టుపై దాడులు చేసి లారీని పట్టుకున్నారు. హెచ్చరించినా అక్రమార్కులు పట్టించుకోవడం లేదు.

**మండలంలో ఎక్కడెక్కడంటే..**

మండల పరిధి ఎక్మాయి గట్టు, క్యాద్గిర, జీవన్గీ, కొర్విచేడ్‌లో వందల ఎకరాల ప్రభుత్వ భూముల్లో నాపరాయి గనులున్నాయి. ఎక్మాయి గట్టుపై, క్యాద్గిర భూముల్లో నాపరాళ్లు నాణ్యంగా ఉంటాయన్న పేరుంది. గతంలో కొందరికి ఇచ్చిన అనుమతుల గడువు ముగిసినా.. అవే పత్రాలను పట్టుకొని నేతల అండతో గనులు తోడేస్తున్నారు. మరికొందరు ఎలాంటి అనుమతుల్లేకుండా తవ్వకాలు జరిపి లారీల్లో వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నారు.

**ప్రభుత్వ ఆదాయానికి గండి..**

రాయల్టీ లేకుండా తరలిస్తుండడంతో రూ. లక్షల్లో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. ఆయా గ్రామాల ప్రజలు, యువకులు ఎవరైనా ఫిర్యాదు చేస్తే తప్ప గనులు, రెవెన్యూ శాఖల అధికారులు దాడులు నిర్వహించడం లేదు. దాడులు చేసినా పూర్తిస్థాయి అక్రమ రవాణాను అడ్డుకోవడం లేదనే విమర్శలున్నాయి. ఆయా గ్రామాల్లో నాపరాళ్లను కోత కోసేందుకు విద్యుత్తు చౌర్యానికి పాల్పడుతున్నారని, అధికారులు పట్టించుకోవాలని కోరుతున్నారు.

గ్రామాలు: 5మొత్తం గనులు: 180

నాపరాళ్లు తరలించే లారీలు: 30 (రోజువారీగా)

దాడులు నిర్వహిస్తాం..: షాహిదాబేగం, తహసీల్దార్, బషీరాబాద్

ప్రభుత్వ భూముల్లో అనుమతుల్లేకుండా ఎలాంటి పనులు చేయొద్దు. రెవెన్యూ, గనులశాఖ అనుమతులు తీసుకొని నాపరాళ్లను తవ్వాలి. లేదంటే దాడులు నిర్వహించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటాం.

# కూరగాయల సాగు.. రాయితీలు బాగు



ధర్మారం :కూరగాయల సాగులో స్వయం సమృద్ధిని సాధించేందుకు ప్రభుత్వాలు రాయితీ అందిస్తున్నాయి. అవసరానికి సరిపడా కూరగాయల సాగు విస్తీర్ణం పెరిగేలా ప్రోత్సహించడం, దిగుబడి పెరిగేలా సాంకేతిక విధానాలను వివరించడం ప్రభుత్వ లక్ష్యం. ఇప్పటికే పూర్తి రాయితీపై మేలు రకాల వంగడాలకు సంబంధించిన నారు అందించడంతోపాటు మల్చింగ్, బిందు సేద్యం, స్టేకింగ్(తీగజాతి రకాలకు ఊతకర్రలు, స్టేకింగ్) ఏర్పాటుచేసుకునేందుకు రాయితీ అందిస్తోంది. ఈ పథకంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో నిధులు సమకూరుస్తాయి.

**50 శాతం రాయితీతో మల్చింగ్**

నేలలో తేమ నిలుపుదల, కలుపు నివారణకు దోహదం చేయడానికి తోడ్పడే మల్చింగ్ కవర్లు వినియోగిస్తారు. ఇందుకు ఎకరాకు రూ. 16 వేలు ఖర్చవుతుంది. ఇందులో ప్రభుత్వం 50 శాతం రాయితీని అందిస్తుంది. ఎస్సీ, ఎస్టీ రైతులకు అవకాశముంది. టమాటా సాగులో దారాలతో స్టేకింగ్ చేస్తారు. దీనికి సైతం హెక్టారుకు రూ. 10 వేల రాయితీ అందిస్తారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర రైతులు దరఖాస్తు చేసుకోవచ్చు.

**బిందు సేద్యానికి..**

జిల్లాలో 800 ఎకరాలకు బిందు సేద్యం ఏర్పాటు చేసేందుకు వీలుంది. అయిదు హెక్టార్లు(12.5 ఎకరాలు) వరకు రాయితీ వర్తిసుంది. ఎస్సీ ఎస్టీ రైతులు కేవలం జీఎస్టీ చెల్లిస్తే సరిపోతుంది. బీసీలు జీఎస్టీతోపాటు యూనిట్ ఏర్పాటు ఖర్చులో 10 శాతం చెల్లించాలి. ఇతర రైతులకు అయిదెకరాల వరకు 90 శాతం, ఆపై 80 శాతం రాయితీ వస్తుంది. జీఎస్టీలోనూ ప్రభుత్వం రూ. 5 వేల వరకు రాయితీ ఇస్తోంది.


ఉద్యానశాఖ లెక్కల ప్రకారం జిల్లా అవసరాలకు వెయ్యి ఎకరాల్లో కూరగాయలు సాగు చేస్తే సరిపోతాయి. ఈ ఏడాది కేవలం 373 ఎకరాల్లోనే సాగు చేశారు.

**రైతుల ఖాతాకే రాయితీ సొమ్ము**

పట్టాదారు పాసు పుస్తకం, రైతు ఆధార్, బ్యాంకు ఖాతా పుస్తకం, పాసుపోర్టు సైజు ఫొటో దరఖాస్తుకు జతచేయాలి. క్షేత్రస్థాయిలో పరిశీలించి మంజూరు చేస్తాం. యూనిట్ గ్రౌండింగ్ పూర్తయ్యాక.. ఏర్పాటు చేసుకున్న పరికరాలకు సంబంధించిన బిల్లులు అందించాలి. రాయితీ సొమ్ము బ్యాంకు ఖాతాలో జమవుతోంది.

మహేశ్, ఉద్యానశాఖ అధికారి, పెద్దపల్లి

# దక్షిణాదికి వెలుగు రేఖ



రామగుండం : దక్షిణాదికి వెలుగురేఖగా రామగుండం ఎన్టీపీసీ విరాజిల్లుతోంది. నాటి ప్రధాని మొరార్జీ దేశాయ్ 1978 నవంబరు 14న పునాదిరాయి వేయగా 200 మెగావాట్ల 3 యూనిటు 500 మెగావాట్ల 4 యూనిట్లతో 2600 మెగావాట్ల సామర్థ్యంతో విద్యుత్తు ఉత్పత్తి చేస్తోంది. ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టు ద్వారా 1600 మెగావాట్ల ఉత్పత్తి కేంద్రాలు పనిచేస్తున్నాయి. త్వరలో మరో 2400 మెగావాట్ల కేంద్రాలను నిర్మించనుంది. నాణ్యతకు మారుపేరుగా నిలుస్తున్న ఎన్టీపీసీతో 48వ వసంతంలోకి అడుగుపెడుతోంది.

**డిజిటల్ కంట్రోల్ సిస్టమ్...**

సాంకేతిక అభివృద్ధితో డిజిటల్ కంట్రోల్ సిస్టమ్ విధానంలో ఒకే చోట ఉండి నియంత్రణ చేస్తున్నారు. పరిశ్రమలో నీటి సామర్థ్యం, ఉష్ణోగ్రతల తేడాలు, బొగ్గు వినియోగం, బూడిదను డిజిటల్ కంట్రోల్ సిస్టమ్ ద్వారా నియంత్రణ గది నుంచే ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటారు. పర్యావరణ పరిరక్షణ కోసం 200 మెగావాట్ల మూడు యూనిట్ల టర్బైన్, జనరేటర్ విభాగాలను ఆధునికీకరిస్తున్నారు. గతంలో 2000 మంది ఉద్యోగులు, అధికారులున్న పరిశ్రమలో సాంకేతిక అభివృద్ధితో నేడు 680 ఉద్యోగులు, అధికారులు, 4500 మంది ఒప్పంద కార్మికులున్నారు.

**ఎఫ్‌జీడీ దిశగా...**

రామగుండం ఎన్టీపీసీలో వెలువడే కర్బన ఉద్గారాలను తగ్గించేందుకు ఎఫ్‌జీడీ(ఫ్యూయల్ గ్యాస్ డీసల్ఫరైజేషన్) యూనిట్‌ను నెలకొల్పనున్నారు. ఎఫ్‌జీడీ విధానంతో వాతావరణంలో కలిసే విషవాయువులను తగ్గించే దిశగా యాజమాన్యం ముందుకు సాగుతోంది. పర్యావరణ పరిరక్షణ నిర్వహణలో 275 మీటర్ల చిమ్నీ, గ్యాస్ డిసల్ఫరైజేషన్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. అల్ట్రా సూపర్ క్రిటికల్ టెక్నాలజీని ఉపయోగించడంతో బొగ్గు వినియోగం తగ్గుతుందని, దీంతో తక్కువ కాలుష్యం వెలువడుతుందని అధికారులు చెబుతున్నారు.

**రూ. 7 కోట్లు హరితహారానికి**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హరితహారానికి ఎన్టీపీసీ యాజమాన్యం సామాజిక బాధ్యత పథకం(సీఎస్సార్) కింద సుమారు రూ. 7 కోట్లు హరితహారానికి వెచ్చించారు. సుమారు 35 వేల మొక్కలు నాటడం, 50 వేల మొక్కలు నాటే ప్రక్రియ ఉంది.

**సౌర విద్యుత్తుపై ప్రత్యేక దృష్టి**

సౌర విద్యుత్తును మరింత ఉత్పత్తి చేసేందుకు రామగుండం ఎన్టీపీసీ మరో అడుగు ముందుకు వేసింది. 100 మెగావాట్ల నీటిపై తేలియాడే సౌర ఫలకాల విద్యుత్తు కేంద్రం నిర్మాణం కూడా పూర్తి చేసి విద్యుత్తు వినియోగం ప్రారంభించారు.

**అవార్డులు**ఎనర్జీ కన్జర్వేషన్ ఇండస్ట్రీస్ అవార్డు-2024

ఎన్టీపీసీకి ఎనర్జీ కంపెనీ అవార్డు

ఎన్టీపీసీకి గ్రామీణ క్రీడల నైపుణ్యం బంగారు అవార్డు

సామాజిక అవగాహన యాడ్ ఫిల్మ్ బంగారు అవార్డు

హెచ్‌ఆర్ వైవిధ్యం బంగారు అవార్డు

ప్రజా ఆధారిత అభ్యాసాల కాంస్య అవార్డు

సీఎస్‌ఆర్ ఆవిష్కరణలకు కాంస్య అవార్డు

అంతర్జాతీయ ఎనర్జీ అవార్డు(ఎన్టీపీసీ రిజర్వాయర్‌లోని 100 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్‌కు అవార్డు లభించింది)ఎస్‌ఆర్‌ఈఐ అవార్డు పవర్ క్విజ్ విజేతగా ఎన్టీపీసీకి అవార్డు ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో నిర్వహించిన ఇండియన్ పవర్‌స్టేషన్(ఐపీ ఎస్) సమ్మిట్ 2025 రాజభాష అవార్డు ఎన్టీపీసీ రామగుండం, తెలంగాణకు గుజరాత్‌లోని గాంధీనగర్ మహాత్మా మందిర్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రశస్థి పత్రం స్వీకరణ ఎక్సలెంట్ ఎనర్జీ ఎఫిషియన్సీ ప్లాంటు అవార్డు-2025(సీఐఐ) గెలుచుకొంది.

# ఇందిరమ్మ పేరు.. ఇసుకాసురుల తీరు

రామడుగు: రామడుగు పరిధి గుండా ప్రవహించే మోతెవాగు నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా కొనసాగుతోంది. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు తరలిస్తున్నామని చెబుతూ.. సమీప మండలాలకు అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కోరిటపల్లి, వన్నారం, రామడుగు, రుద్రారం తదితర గ్రామాల్లో రాత్రి పగలు తేడా లేకుండా ఈ దందా సాగుతోంది.

**మూడు మండలాలకు తరలిస్తూ..**

గత జూన్ వరకు రామడుగు మండలంలో 750 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడంతో లబ్ధిదారులు నిర్మాణ పనులు చేపడుతున్నారు. అయితే మోతెవాగు నుంచి సేకరించే ఇసుకకు అధికారులు ఆటంకం లేకుండా చర్యలు చేపట్టారు. ఇదే అదనుగా అక్రమార్కులు కొత్తపల్లి, గంగాధర, పెగడపల్లి మండలాలకు తరలించి అధిక ధరకు విక్రయించుకుంటున్నారు. నిత్యం వందల సంఖ్యలో ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకను సమీప మండలాలకు తరలిస్తున్నా.. అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు.

**పడిపోయిన భూగర్భ జలాల మట్టం**

ఇసుక అంతరించి భూగర్భ జలాల మట్టం పడిపోతుందని రైతులు వాపోతున్నారు. గతంలో ఇసుక క్వారీలు ఏర్పాటు చేసేందుకు మైనింగ్ శాఖ అధికారులు సర్వే చేశారు. కానీ ఇసుక అక్రమ రవాణాదారులు



స్థానికులను పురమాయించి క్వారీ ఏర్పాటు చేయకుండా అడ్డుకున్నారు. మరోవైపు డ్రైవర్లు అతి వేగంగా వెళ్తుండటంతో గ్రామాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి.

**అధికారుల కళ్లు గప్పి..**

ఇసుక నింపిన ట్రాక్టర్ మోతె వాగు నుంచి బయలుదేరిన స్థలం నుంచి గమ్యం చేరేవరకు సెల్‌ఫోన్ల ద్వారా అక్రమ వ్యవహారాన్ని అధికారుల కంట పడకుండా జాగ్రత్త వహిస్తున్నారు. ఒక్కో ఇందిరమ్మ ఇంటికి ప్రభుత్వం 25 క్యూబిక్ మీటర్ల(10ట్రాక్టర్ల) ఇసుకను అనుమతించింది. ఈ లెక్కన ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిన నెల రోజుల్లోనే రామడుగు మండలానికి సరిపడా ఇసుక రవాణా పూర్తవుతోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ అక్రమ రవాణా అరికట్టాలని మోతె వాగు పరిసర రైతులు కోరుతున్నారు. దీనిపై తహసీల్దార్ రాజేశ్వరిని వివరణ కోరగా.. గ్రామాల్లో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుల అవసరాల మేరకు పంచాయతీ కార్యదర్శులు ఇసుక టోకెన్ జారీ చేస్తున్నట్లు తెలిపారు.

# గంటలో వైద్యం.. ప్రాణాలు భద్రం

గోదావరిఖని: ఉమ్మడి జిల్లాలో రహదారి ప్రమాదాల్లో సగటున రోజుకు ఇద్దరు చొప్పున ప్రాణాలు కోల్పోతున్నారు. నిత్యం ఏదో ఒక చోట రహదారి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గాయపడ్డ వారికి గంట వ్యవధిలో అత్యవసర చికిత్స అందించడం ద్వారా ప్రాణాలు నిలబెట్టే అవకాశం ఉంటుంది. ఏదైనా ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ప్రాణాపాయంలో ఉన్న వారికి సకాలంలో వైద్య సేవలందించేందుకు 'ట్రామా' కేంద్రాలు పనిచేస్తాయి. సురక్షితమైన భవిష్యత్తు నిర్మించాలన్న లక్ష్యంతో ఈ ఏడాది ప్రపంచ ట్రామా దినోత్సవాన్ని జరుపుకొంటున్నారు.

**ప్రతి 25 కి.మీ.కు ఒకటి**

హైవేలు విస్తరించి ఉన్న ప్రాంతాల్లో ప్రతి 25 కి.మీ.కు ఒక ట్రామా కేంద్రం తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. దీని వల్ల ప్రమాదం ఎక్కడ జరిగినా కేవలం అరగంట వ్యవధిలోనే ట్రామా కేంద్రానికి క్షతగాత్రులను చేర్చే అవకాశం ఉంటుంది. ట్రామా కేంద్రంలో అత్యవసర చికిత్సకు సంబంధించిన వైద్య సౌకర్యాలు, అనుభవజ్ఞులైన వైద్యులు అందుబాటులో ఉండటంతో ప్రమాద బాధితుల ప్రాణాలను కాపాడేందుకు అవకాశం ఉంటుంది.

**ప్రమాద తీవ్రత ఆధారంగా చికిత్స**

ప్రమాదాలు చోటుచేసుకునే సమయంలో చాలా సందర్భాల్లో అవయవాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుంది. తీవ్రరక్తస్రావం కావడంతో పాటు ఊపిరి తీసుకోవడానికి కూడా ఇబ్బంది పడతారు. ఆ సమయంలో వైద్యం అందించేందుకు అందుబాటులో ఆస్పత్రులు ఉండవు. ఒకవేళ ఉన్నా అందులో అధునాతన సౌకర్యాలు, అనుభవజ్ఞులైన వైద్యులు ఉండరు. ఇలాంటి సమయాల్లోనే ట్రామా కేంద్రాలు ప్రాణాపాయంలో ఉన్న వారికి సకాలంలో అత్యవసర చికిత్స అందించేందుకు అవకాశం ఉంటుంది.

**క్రిటికల్ కేర్‌తోనే సరి**

అత్యవసర వైద్యం అందించేందుకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో క్రిటికల్ కేర్ సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. కరీంనగర్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో క్రిటికల్ కేర్ సేవలు అందుబాటులో ఉన్నాయి. గోదావరిఖని, జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రుల్లో సేవలు అందించేందుకు పనులు తుది దశకు చేరుకొన్నాయి. సిరిసిల్లలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఇంకా క్రిటికల్ కేర్ సేవలు అందించేందుకు పనులు మొదలు పెట్టలేదు.

**ఉమ్మడి జిల్లాలో ఒక్క కేంద్రం లేదు**

ఉమ్మడి జిల్లాలో ఒక్క ట్రామా కేంద్రం కూడా ఏర్పాటు చేయలేదు. గుండ్లపల్లి నుంచి గోదావరిఖని వరకు కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల మీదుగా రాజీవ్ రహదారి 100 కిలోమీటర్లు విస్తరించి ఉంది. ఇటు కరీంనగర్ నుంచి వరంగల్ వరకు 65 కిలోమీటర్లు, జగిత్యాల నుంచి కరీంనగర్, మెట్‌పల్లి నుంచి జగిత్యాల, కరీంనగర్ నుంచి సిరిసిల్ల, జగిత్యాల నుంచి రాయపట్నం వరకు ప్రధాన రహదారులున్నాయి. కరీంనగర్ నుంచి చొప్పదండి మీదుగా రాయపట్నం వరకు ప్రధాన రహదారి ఉంది. పెద్దపల్లి నుంచి మంథని వరకు ఉన్న రహదారుల్లో ఒక్క కూడా ట్రామా కేంద్రం లేదు. కరీంనగర్ జిల్లాలో హుజూరాబాద్, జగిత్యాల జిల్లాలో వెల్గటూరు వద్ద ట్రామా కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు చేశారు.

**మన చేతుల్లోనే**

కారు డ్రైవింగ్ చేసే సమయంలో సీటుబెల్టు, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి మద్యం తాగి, చరవాణి మాట్లాడుతూ వాహనాలు నడపకూడదుఅపసవ్య దిశలో ప్రయాణం చేయొద్దు

చురకలు



# చిక్కీ విప్పి చూడ చక్కెరుండు!

పుట్టపర్తి: మేం చేస్తూనే ఉంటాం.. మీరు చూస్తూనే ఉండండి అన్నట్లుంది మధ్యాహ్న భోజన పథకం సరకులు సరఫరా చేసే గుత్తేదారుల తీరు. పిల్లలకు పౌష్టికాహారం అందించాలన్న లక్ష్యంతో మధ్యాహ్న భోజనం పథకం కింద ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేస్తున్నా.. క్షేత్రస్థాయిలో ఆశించిన ఫలితాలు ఉండటం లేదు. ప్రధానంగా కోడిగుడ్లు, చిక్కీలు సరఫరాలో అవకతవకలు జరుగుతున్నాయి. కోడిగుడ్లను రెండు ఏజెన్సీలు, చిక్కీలను మరో ఏజెన్సీ సరఫరా చేస్తున్నాయి. వారానికోసారి కాకుండా.. నెలలో రెండుసార్లు ఇస్తున్నాయి. దీంతో ఎక్కువ రోజులు నిల్వ ఉంచి విద్యార్థులకు అందజేయాల్సి వస్తోంది. ఫలితంగా కోడిగుడ్లు పాడవుతుండగా చిక్కీలు దుర్వాసన వస్తున్నాయి.

**కాలం చెల్లిపోయి..**

చెన్నేకొత్తపల్లి ఉన్నత పాఠశాలలో కాలం చెల్లిన చిక్కీలు నిల్వ ఉన్నాయి. ఈ ఏడాది ఆగస్టు ఏడో తేదీకి ముగిసినట్లు చిక్కీ కవర్‌పై ముద్రించి ఉంది. కాలం చెల్లి మూడు నెలలు కావస్తున్నా గదిలోనే ఉంచారు. ఎంఈఓ 2 దృష్టికి తీసుకుపోగా పాఠశాలను సందర్శించి విచారిస్తామన్నారు. అగళి మండలం దొక్కలపల్లి, గ్యారగొండ్లపల్లి, నరసంబూది ప్రాథమిక పాఠశాలల్లో బుధవారం కోడిగుడ్లు, చిక్కీలు



ఇవ్వలేదు. ఈనెలలో దొక్కలపల్లిలో ఒక్కసారి కూడా ఇవ్వలేదని విద్యార్థులు చెబుతున్నారు.

కదిరి మండలం కొండమనాయునిపాల్యం జడ్పీ ఉన్నత పాఠశాలలో పరిశీలించగా 79 మందికిగాను 71 మంది హాజరయ్యారు. ఇక్కడ కొన్ని కోడిగుడ్లు పాడైపోవడం కనిపించింది. వాస్తవానికి కోడిగుడ్లు 45 నుంచి 55 గ్రాములుండాలి. కొన్ని తక్కువ బరువు ఉండటంతో ఉడికించిన తర్వాత విద్యార్థులు తినడానికి అనువుగా ఉండటం లేదు.

**జిగటగా అవుతాయంట..**

వాస్తవానికి చిక్కీలను బెల్లంతో తయారు చేయాలి. అయితే చక్కెర కలుపుతున్నారు. అలా చేయకపోతే జిగటగా అవుతాయని, కొంత శాతం చక్కెర కలుపుతున్నామని నిర్వాహకులు చెబుతున్నట్లు అధికారులు అంటున్నారు. ఎంత శాతం కలుపుతున్నారో తనిఖీ చేస్తేనే తెలుస్తుంది.

**గుత్తేదారులకు నోటీసులిస్తాం**

గుత్తేదార్లు కోడిగుడ్లు, చిక్కీలను నెలకు రెండుసార్లే సరఫరా చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. విద్యార్థులకు పంపిణీ చేయని రోజులకు బిల్లులు ఇవ్వం. కొన్ని బడుల్లో గుడ్లు పాడైపోవడం, చిక్కీల్లో చక్కెర ఉండటం, వాసన వస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాం. సంబంధిత గుత్తేదారులకు నోటీసులిచ్చి చర్యలు తీసుకుంటాం.

వినయ్‌మోహన్, ఏడీ

జిల్లా: శ్రీసత్యసాయి

ఎండీఎం పాఠశాలలు: 1,983

మొత్తం విద్యార్థులు: 1,16,520

# పేదల.. 'జాగా'రణ

తిరుపతి : రేణిగుంట మండల కేంద్రంలోని దాదాపు మూడువేల మందికి వైకాపా హయాంలో ఇంటి పట్టాలు ఇచ్చారు. ఎన్నికలకు ముందు ఈ మండలంలోని పాగలిలో స్థలాలు ఇస్తామని చెప్పినా ఎక్కడెక్కడ ఎవరెవరికి కేటాయించారో స్పష్టం చేయలేదు. దాంతో లబ్ధిదారులు అప్పట్లోనే ధర్నాకు దిగారు. ఎన్నికల్లో లబ్ధి పొందడానికే ఈ విధంగా చేశారని దుయ్యబట్టారు.

తమకు ఇళ్ల స్థలాలు చూపండంటూ లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయాల్లో పెద్దఎత్తున వినతిపత్రాలు ఇస్తున్నారు. వైకాపా ప్రభుత్వంలో ఆ పార్టీ నేతలు క్షేత్రస్థాయిలో స్థలాలు చూపకుండానే పట్టాలు పంపిణీ చేసి మమ అనిపించారు. కూటమి ప్రభుత్వం స్పందించి ఇలాంటివారికి మేలుచేస్తే ప్రయోజనం ఉంటుంది.

**రూ.లక్ష వరకు వసూలు**

దరఖాస్తుదారుల్లో కొందరి నుంచి వైకాపా నేతలు రూ.లక్ష వరకు తీసుకుని స్థలాలు చూపించారు. శ్రీకాళహస్తి పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీ ఉదంతమే ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ.

చిత్తూరులో అప్పట్లో ఓ తహసీల్దారు డబ్బులు తీసుకుని పట్టాలు ఇచ్చారే తప్ప స్థలం చూపలేదు. ఇందులో నేతలకూ వాటాలు అందాయి. లంచం ఇవ్వని పేదలకు రిక్తహస్తమే ఎదురైంది. కనీసం ఓ చిన్న గూడు లేనివారెందరో నేటికీ ఉన్నారు.



**తిరుపతి, శ్రీకాళహస్తి, చిత్తూరులో అధికం**

జగన్ ప్రభుత్వ హయాంలో 2020 డిసెంబరులో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో లబ్ధిదారులకు ఇంటి పట్టాలు ఇచ్చారు. పట్టణ ప్రాంతాల్లో సెంటు, గ్రామాల్లో సెంటున్నర స్థలం మాత్రమే కేటాయించారు. అదీ కొండలు, గుట్టల్లో చూపారు. దీంతో పునాదులు వేసుకోవడానికే రూ.2 లక్షల వరకు ఖర్చవుతుందని గృహ నిర్మాణాలకు వెనకడుగు వేశారు. వీరు కాకుండా ఇంకా ఎవరైనా మిగిలి ఉన్నా ఎప్పటికప్పుడు స్థలాలు చూపిస్తామని ప్రకటించారే తప్ప ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఎన్నికల గడువు సమీపిస్తున్న తరుణంలో తిరుపతి, శ్రీకాళహస్తి, చిత్తూరు నియోజకవర్గాల్లో స్థానిక నాయకులు అధికంగా అర్జీలు తీసుకున్నారు.

**ఉన్న వాటిలోనైనా కేటాయిస్తే..**

ఇప్పటికీ కొన్ని కాలనీల్లో ఇంటి స్థలాలు ఖాళీగా ఉన్నాయి. రెండు జిల్లాల్లో కలిపి దాదాపు ఎనిమిది వేల మందికి సర్దుబాటు చేయవచ్చు. ఏ మండలంలోని తహసీల్దారు అక్కడ కేటాయిస్తే కొంతవరకు పేదలకు అవస్థలు తప్పుతాయి. తిరుపతి నియోజకవర్గంలోని అర్హులకు శ్రీకాళహస్తి, చంద్రగిరిలో స్థలాలు చూపించాలి. ఇప్పటికైనా ఆ దిశగా చర్యలు తీసుకుంటే పేదల సొంతింటి కల సాకారమవుతుంది.

**ఓట్లు దండుకునేందుకు వైకాపా మాయ**

'నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు' కార్యక్రమంలో అర్హులందరికీ దరఖాస్తు చేసుకున్న 90 రోజుల్లో ఇంటి స్థలాలు కేటాయిస్తామని వైకాపా ప్రభుత్వం ఘనంగా ప్రకటించింది. సార్వత్రిక ఎన్నికలకు ముందు వరకూ అర్జీలు స్వీకరించింది. ఓట్లు దండుకోవడానికి 'ఇవిగో ఇంటి పట్టాలు' అంటూ కొందరికి ఆర్భాటంగా పంపిణీ చేశారు. ఏ ప్రాంతంలో స్థలాలు కేటాయించారని అడిగితే సమాధానం కరవైంది.

# చెరువులకు చేపపిల్ల వస్తోంది..!



పలమనేరు : జిల్లాలో వర్షాలు సమృద్ధిగా కురవడంతో ప్రభుత్వం మత్స్య సహకార సంఘాల సభ్యులకు చేప పిల్లలు, వలలు, బోట్ల పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగానే ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పీఎంఎంఎస్‌వై(ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన) పథకం ద్వారా 40 శాతం రాయితీతో చేప పిల్లలను అందించనున్నారు. ఇప్పటికే సంఘాల నుంచి ప్రతిపాదనలు పంపాలని అధికారులు కోరుతున్నారు. చెరువులన్నీ నీటితో నిండుగా ఉండటంతో ఈ నెలాఖరుకు పిల్లలను ఉమ్మడి జిల్లాలోని మొత్తం 50 మత్స్య సహకార సంఘాల్లోని నాలుగు వేల మంది సభ్యులకు అందించనున్నారు. గతంలో ఇలా.. గత తెదేపా హయాంలో మత్స్యకారులకు 90 శాతం రాయితీతో సైకిళ్లు, బోట్లు, వలలు, ఆటోలు పంపిణీ చేశారు. ఆ తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం లబ్ధిదారులకు రాయితీ తగ్గించడంతో తీవ్రంగా నష్టపోయారు. వైకాపా ప్రభుత్వం రూ.3 లక్షలు విలువ చేసే ఆటోను 40 శాతం సబ్సిడీతో ఇవ్వగా... అదనపు ఫిట్టింగులు ఉన్నాయని దాన్ని 4.59 లక్షలు చేసింది. ఫలితంగా లబ్ధిదారులపై అదనంగా రూ.1.59 లక్షలు పడింది. అప్పట్లో చేప పిల్లల సరఫరా కూడా అంతంతమాత్రంగానే సాగింది. మొత్తం 250 చెరువులకు.. పీఎంఎంఎస్‌వై పథకం ద్వారా సోమశిల నుంచి చేప పిల్లలను తెప్పించి జిల్లాలోని మత్స్యకారులకు అందివ్వనున్నారు. మొత్తం 250 చెరువుల్లో పిల్లలు పెంచేందుకు చర్యలు చేపట్టారు. చేప పిల్లలను తెప్పించి సరఫరా చేయడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు మత్స్యశాఖ డీడీ రవికుమార్ తెలిపారు.

వలలు, బోట్లు, ఇతర సామగ్రిపై రాయితీ వివరాలిలా..

బీసీలు: 75 శాతం ఎస్సీ, ఎస్టీలు: 90 శాతం

# దారి తప్పకుండా.. లెక్క తగ్గకుండా



నర్సీపట్నం : జిల్లాలో ధాన్యం విక్రయాలు మొదలయ్యాయి. రైతుకు మద్దతుగా ఉండేలా అధికారులు ఈ ఏడాది ప్రత్యేకంగా శ్రద్ధ చూపుతున్నారు. రైతుసేవా కేంద్రాలకు ధాన్యం నమూనాలు తెచ్చినప్పుడు సిబ్బంది తేమశాతాన్ని నిర్ధారిస్తారు. మిల్లుకు వెళ్లిన తరువాత యజమానులు తేమశాతం పరీక్షిస్తుంటారు. గతంలో సిబ్బంది నిర్ధారించిన తేమశాతం సరిగా లేదని సాకులు చూపుతూ కొంతమంది మిల్లర్లు రైతుల నుంచి కొంతమొత్తం ధాన్యాన్ని అధికంగా తీసుకునేవారు. ప్రభుత్వ సిబ్బంది నిర్ధారించిన తేమశాతం, మిల్లరు చెబుతున్న శాతానికి తేడా ఉందని ఎక్కడైనా ఆరోపణ వస్తే రైతు సేవాకేంద్రాల సిబ్బంది మరోసారి పరిశీలన చేస్తారు. సిబ్బందికి, మిల్లర్లకు పౌరసరఫరాల శాఖే ఒకే కంపెనీకి చెందిన తేమ కొలిచే యంత్రాలను సరఫరా చేసింది. తద్వారా లెక్క కచ్చితంగా ఉంటుందని భావిస్తున్నారు. ధాన్యం విక్రయించిన రైతుకు గరిష్ఠంగా 24 గంటల్లోగా నగదు జమ చేయాలన్నది మార్గదర్శకమైనా గంటల వ్యవధిలోనే చెల్లింపు జరిగేలా అధికారులు చూస్తున్నారు. ప్రస్తుతం మాడుగుల నియోజకవర్గంలో ధాన్యం అమ్మకాలు మొదలయ్యాయి. శుక్రవారానికి 157 మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు చేశారు. తాండవ రిజర్వాయర్ పరిధిలోని నర్సీపట్నం, నాతవరం, కోటవురట్ల, కాకినాడ జిల్లాలోని కోటనందూరు, తుని, రౌతులపూడి మండలాలు ఉన్నాయి. ప్రస్తుతం నాతవరం, కోటనందూరు మండలాల్లో కోలాహలంగా వరికోతలు జరుగుతున్నాయి. కొద్దిరోజుల్లో నూర్పుళ్లు మొదలై ధాన్యం అమ్మకాలు మొదలు కానున్నాయి. ధాన్యం బస్తాలను వాహనంలో ఎక్కించింది మొదలు మిల్లులో దిగుమతి అయ్యేవరకు జీపీఎస్ ద్వారా ట్రాక్ చేస్తారు. వాహనం బయలుదేరిన తరువాత మూడు గంటల్లో మిల్లుకు చేరుకోవాలన్నది మార్గదర్శకం. దారి తప్పినట్లు అనిపిస్తే ఫిర్యాదు చేయడానికి 80089 01584 నంబరును రైతులకు అందుబాటులో ఉంచారు. జిల్లాలో 3.7 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా. 35 నుంచి 40 వేల మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు చేయాలని లక్ష్యంగా తీసుకున్నారు.

**నాణ్యత కలిగిన ధాన్యం తేవాలి:**

ప్రభుత్వ నిర్ణయించిన మద్దతు ధరలు పొందడం రైతుల హక్కు. తాలు, మట్టిగడ్డలు, తొక్కు వంటివి లేకుండా చూడాలి. నిర్దేశిత తేమశాతం కలిగి ఉండాలి. ముందుగా రైతు సేవా కేంద్రాల సిబ్బందికి నమూనాలు అందజేయాలి. ధాన్యం కల్లాల్లో ఉన్నప్పుడే సిబ్బందికి చూపించడం మేలు. ఆ తరవాత బస్తాలకెత్తించాలి.

పి.జయంతి, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్

# ఎలమంచిలిలో చకచకా.. అనకాపల్లిలో నత్తనడక



ఎలమంచిలి : ఎలమంచిలి రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. రూ. 10 కోట్లతో రైల్వేస్టేషన్‌లో రెండేళ్ల కిందట అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఏడాదిన్నర పాటు సాగిన పనులు మధ్యలో నిలిపివేశారు. దీంతో రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం ప్రమాదకరంగా మారి ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. ఇటీవల రైల్వే ఉన్నతాధికారులు స్టేషన్‌ను పరిశీలించి నెలరోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. దీంతో పనులు ముమ్మరమయ్యాయి. కాలిబాట పైవంతెన దాదాపు 80 శాతం పూర్తి చేశారు. ప్రయాణికుల విశ్రాంతి భవనం, తాగునీటి వసతి, ప్లాట్‌ఫాంల ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి. ప్లాట్‌ఫాం పొడవునా షెడ్లు వేసే పనులు ఊపందుకున్నాయి. రెండో నంబరు ప్లాట్‌ఫాంపై గోతులు తవ్వి వదిలేయడంతో వీటిలో పడి ప్రయాణికులు గాయాలపాలవుతు న్నారు. ఈ నేపథ్యంలో ముందుగా వీటికి ప్రాధాన్యం ఇచ్చారు. ఒకటి, రెండు ప్లాట్‌ఫాంల మధ్యలో ఉన్న ఫుట్‌పాత్ వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతో కొత్తగా మరొకటి నిర్మిస్తున్నారు. పాత వంతెన వినియోగించడానికి ప్రయాణికులు ఆందోళనకు గురవుతున్నారు. కొత్తగా చేపట్టిన వంతెనను పూర్తి చేయడానికి చర్యలు ముమ్మరం చేశారు. ముందుగా ఈ రెండు ప్లాట్‌ఫాం పనులను పూర్తిస్థాయిలో సిద్ధం చేసిన తరవాత మూడో నంబరు ప్లాట్‌ఫాం పనులు చేపట్టనున్నారు. ఇప్పటికే ఈ స్టేషన్ మీదుగా ప్రయాణికుల రాకపోకలు పెరిగాయి. ఇప్పటికే పలు రైళ్లు ఆగుతున్నాయి. వీటితోపాటు కొత్త రైళ్ల హాల్ట్‌కు ప్రతిపాదనలు ఉన్నాయి. ప్రధానంగా భువనేశ్వర్–బెంగళూర్ మధ్య నడిచే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌ను ఈ స్టేషన్‌లో నిలపాలనే డిమాండ్ వివిధ వర్గాల నుంచి వినిపిస్తోంది. మెజార్టీ ప్రయాణికులకు మేలు చేసే ఈ రైలును ఇక్కడ నిలిపేందుకు ప్రజాప్రతినిధులు కూడా ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు. అనకాపల్లి రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. అమృత్ భారత్ కింద దక్షిణ మధ్య రైల్వే అధికారులు రూ. 12 కోట్లతో శ్రీకారం చుట్టారు. కాలిబాట వంతెన, ప్లాట్‌ఫాంలు పునరుద్ధరణ, స్టేషన్ ప్రధాన ద్వారాలు వద్ద రక్షణ గోడలు, ఎస్కలేటర్, అదనపు గదుల నిర్మాణం ఇలా పలు రకాల పనులు చేపడుతున్నారు. ఆరు నెలల్లో పనులు పూర్తి చేస్తామని చెప్పిన అధికారులు తొమ్మిది నెలలు గడుస్తున్నా పూర్తి చేయలేదు. వృద్ధులు, దివ్యాంగులు అసంపూర్తి పనులతో ఇబ్బంది పడుతున్నారు. నిత్యం వేల మంది ప్రయాణికులు ఈ స్టేషన్ మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. ఏ గ్రేడ్ హోదాలో స్టేషన్ ఉన్నా అభివృద్ధి పనుల్లో మాత్రం పురోగతి కనిపించడం లేదు. త్వరితగతిన పూర్తిచేసి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలని రోజువారీ ప్రయాణికుల సంఘ ప్రతినిధులు కోరుతున్నారు.

# కార్మికులకు కార్డు.. భద్రతకు రివార్డు!

తిరుపతి : అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందడగు వేస్తున్నాయి. ఈ - శ్రమ్ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. కార్మికుల గుర్తింపునకు పోర్టల్‌లో నమోదుకు అవకాశం కల్పిస్తోంది. ఈ కార్డుతో అనేక ప్రయోజనాలు ఉన్నా.. చాలామంది నమోదు చేసుకోలేదు.

**అర్హులు ఎవరు:**

18– 59 ఏళ్లలోపు వారు అర్హులు. ఈ– శ్రమ్ కార్డులతో అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత లభిస్తుంది.

ఇప్పటివరకు కొన్ని పథకాలు కుటుంబంలో ఒక్కరికే వర్తించేవి. ఫలితంగా కుటుంబంలో ఒకరిద్దరు కార్మికులుంటే నష్టపోయే పరిస్థితి. ఈ - శ్రమ్‌తో ప్రతి అసంఘటిత కార్మికుడికి సామాజిక భద్రతతోపాటు వివిధ పథకాలు అందుతాయి.

దరఖాస్తు ఇలా..: ఈ - శ్రమ్ గుర్తింపు కార్డు కోసం చరవాణిలో సొంతంగా దరఖాస్తు చేసుకోవచ్చు. తిరుపతి, చిత్తూరు కార్మిక శాఖ కార్యాలయాలలో ప్రత్యేకంగా సెంటర్లు ఏర్పాటు చేశారు. సీఎస్‌ఈ




కేంద్రాల్లోనూ దరఖాస్తు చేసుకోవచ్చు. ఫొటో గుర్తింపు కార్డుతోపాటు వివరాలు నింపి కార్డులు పొందవచ్చు. ఒకసారి తీసుకుంటే ఐదేళ్లు అమలులో ఉంటుంది. జిల్లా కార్మిక శాఖ అధికారులు అవగాహన సదస్సులు.. ప్రత్యేక శిబిరాల ద్వారా నమోదు ప్రక్రియ చేపట్టారు.

మాన్‌ధనం: పీఎం - శ్రమ యోగి మాన్ ధన్ (ఎస్‌వైఎం) పథకానికి 18 - 40 ఏళ్ల వయస్సున్న కార్మికులు అర్హులు. కార్మికులు వయస్సు ఆధారంగా కొంత నగదు చెల్లిస్తే అందుకు సరిపడా డబ్బును ప్రభుత్వం చెల్లిస్తాయి. 61 ఏళ్లు దాటిన తర్వాత కార్మికులకు పింఛను వర్తిస్తుంది. కనిష్ఠంగా రూ.55.. గరిష్ఠంగా రూ.200 చెల్లించాల్సి ఉంటుంది.

**ఆర్థిక ప్రయోజనం:**

ఈ - శ్రమ్‌తో ప్రతి అసంఘటిత రంగ కార్మికుడికి ఏడాదిపాటు సురక్షా బీమా యోజన ద్వారా రూ.2 లక్షల ప్రమాద మరణ, అంగ వైకల్య బీమా ఉచితంగా వర్తిస్తుంది.

వలస కార్మికులు ఎక్కడ ఉన్నారో గుర్తించి వారికి ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటారు.

కార్మికుడు ప్రమాదవశాత్తు చనిపోతే చంద్రన్న బీమా సాయం కింద రూ.ఐదు లక్షల సాయం చేస్తారు.

కార్మికురాలు, కార్మికుడి కుమార్తె వివాహానికి రూ.20 వేలను మూడేళ్ల తర్వాత ఫిక్సడ్ డిపాజిట్ రూపంలో అందిస్తారు.

ఉమ్మడి జిల్లాలో కార్మికులు: 9 లక్షల మంది ఇందులో భవన నిర్మాణ కార్మికులు: 1,45,341 మందిఈ శ్రమ్‌లో నమోదైన కార్మికులు

చిత్తూరు: 4,66,831

తిరుపతి: 78,912

మదనపల్లె: 1,08,117

# తెలుగు అకా'డమ్మీ'

తిరుపతి : రాష్ట్ర విభజన నేపథ్యంలో వెనుకబడిన రాయలసీమ ప్రాంతానికి రాష్ట్రస్థాయి ప్రభుత్వ సంస్థ కేటాయించాలని నిర్ణయించారు. తిరుపతి కేంద్రంగా ఏపీ తెలుగు, సంస్కృత అకాడమీని తిరుపతికి 2020 జూన్ 16న నిర్ణయించి ఉత్తర్వులు జారీ చేశారు. తెలుగు, సంస్కృత భాషల అభివృద్ధి బాధ్యతల్ని తెలుగు అకాడమీకి అప్పగిస్తూ తిరుపతిలో తెలుగు, సంస్కృత అకాడమీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. అంతర్గత సమస్యలతో అకాడమీ ఏర్పాటులో జాప్యం చోటు చేసుకోగా.. 2022 జూన్ 1 ఎట్టకేలకు తిరుపతిలోని తుమ్మలగుంట మార్గంలో తితిదే గోశాలకు చెందిన భవనంలో ప్రారంభమైంది. వైకాపా ప్రభుత్వ పాలనలో అకాడమీని విజయవాడ నుంచి తరలింపు ప్రక్రియ కూడా ప్రారంభం కాలేదు. దీంతో తిరుపతిలో అకాడమీ కాగితాలకే పరిమితమైంది.

**ఉద్యోగులు విజయవాడలో..**అకాడమీని అధికారికంగా తిరుపతిలో ఏర్పాటు చేసినప్పటికీ అనధికారికంగా ఇప్పటికీ విజయవాడ నుంచే కార్యకలాపాలు జరుగుతున్నాయి.

**స్థలాన్వేషణతో సరి**

విభజిత ఆంధ్రప్రదేశ్ తొలి ఛైర్‌పర్సన్‌గా లక్ష్మీపార్వతిని గత ప్రభుత్వం నియమించగా ఆమె అకాడమీ భవన నిర్మాణ స్థలాన్వేషణకే పరిమితమయ్యారు.

**వారు తిరుపతి వస్తే ఒట్టు**

తెలుగు అకాడమీ కార్యాలయ నిర్వహణ కోసం కేటాయించిన రీసెర్చ్, సేల్స్, పరిపాలనాధికారులతో సహా 14 మంది ఉద్యోగులు తిరుపతిలోని కార్యాలయంలో ఇప్పటి వరకు అడుగుపెట్టిన దాఖలాలు లేవు.

**అక్కడి నుంచి అటే..**

విజయవాడలో పుస్తకాలను ముద్రించి వాటిని అక్కడి నుంచే రాష్ట్రంలోని అనంతపురం, విజయవాడ, తిరుపతి, విశాఖపట్నం, గుంటూరు ప్రాంతీయ కేంద్రాలకు చేరవేసి విక్రయాలు సాగిస్తున్నారు. తెలుగు, సంస్కృత అకాడమీ ఛైర్మన్‌గా నియమితులైన ఆర్.డి.విల్సన్ సైతం తిరుపతిలోని అకాడమీ ప్రధాన కార్యాలయాన్ని కన్నెత్తి చూడలేదు.

**ఇంటర్ పాఠ్యపుస్తకాలకే పరిమితం**

ఆంధ్రప్రదేశ్ తెలుగు అకాడమీ ఇంటర్, డిగ్రీ, పీజీ, డీఎడ్, బీఎడ్, ఆధునిక తెలుగుబోధన, ఎంసెట్ పుస్తకాలతో పాటు వివిధ అనువాదాలు, మోనోగ్రాఫులు, జనరంజక గ్రంథాలు, వ్యాసావళి, పోటీ పరీక్షల పుస్తకాలతో పాటు నిఘంటువులు, పరిపాలన న్యాయ పదకోశం వంటి 158కి పైగా ప్రచురణలు ముద్రించేది. ప్రస్తుతం కేవలం ఇంటర్, డీఎడ్, బీఎడ్, పాఠ్యపుస్తకాలు, పరిమిత సంఖ్యలో టెట్, డీఎస్సీ స్టడీ మెటీరియల్ మాత్రమే ముద్రించి సరఫరా చేస్తోంది.

ప్రస్తుతం తిరుపతి ప్రాంతీయ కేంద్రం తరహాలో పనిచేసే అసిస్టెంట్ మేనేజర్, పొరుగుసేవల విధానంలో పనిచేసే కంప్యూటర్ ఆపరేటర్, ముగ్గురు సహాయకులే తిరుపతి కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు.

**భాషాభిమానుల ఆకాంక్షలివీ..**

ఉమ్మడి రాష్ట్రంలో ఏటా రూ.250 కోట్లకు పైగా లావాదేవీలు జరిగే తెలుగు అకాడమీ, ప్రస్తుతం రూ.15 కోట్లకు మించలేదని అంటున్నారు. త్వరలో పాఠశాలల పాఠ్యపుస్తకాలు, డిగ్రీ, పోటీ పరీక్షల పుస్తకాలు, సివిల్స్‌కు సిద్ధం అవుతున్న వారికి అకాడమీ పుస్తకాలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తున్న నేపథ్యంలో తెలుగు, సంస్కృత అకాడమీ వ్యవహారంపై స్పష్టతను భాషాభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

## సర్కారు భూమిపై కబ్జాదారుల కన్ను

కదిరి : కదిరి పట్టణ పరిధిలో భూముల ధరలు అమాంతం పెరగడంతో కబ్జాదారుల కళ్లు ప్రభుత్వ భూములపై పడ్డాయి. కదిరి రెవెన్యూగ్రామం బేరిపల్లికాలనీ సమీపంలోని సర్వేనంబరు 268లో దాదాపు 15సెంట్ల స్థలాన్ని అక్రమార్కులు రాత్రికి రాత్రే చదును చేశారు. బాహ్యావలయ రహదారికి ఆనుకుని ఉన్న ఈస్థలం మీదుగా దేవరచెరువు నుంచి పంట పొలాలకు నీరందించే కాలువను గట్లను ధ్వంసం చేసి భూమిని చదును చేసేశారు. జాతీయ రహదారి 42కు సమీపంలో ఉండటంతో ఈ ప్రాంతంలో సెంటు భూమి ధర 10 లక్షల వరకు పలుకుతోంది. పదిహేనుసెంట్ల భూమి కోటిన్నర రూపాయల పైమాటే. పట్టణానికి సమీపంలోనే ప్రభుత్వ భూమిని కబ్జాచేసేందుకు యత్నిస్తున్నా రెవెన్యూ అధికారులు దృష్టికి రాకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. ఆక్రమణదారుల పట్ల అధికారులు కఠినచర్యలు తీసుకోని కారణంగానే పెట్రేగిపోతున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. బేరిపల్లి వద్ద పొలాలకు



వెళ్లేదారి నుంచి ఉన్న నీటికాలువ వరకు ఉన్న స్థలంపై కన్నేసిన కబ్జాదారులు రాత్రివేళల్లో పొక్లెయిన్ సాయంతో చదును చేసేశారు.

**తగిన చర్యలు తీసుకుంటాం: మురళీకృష్ణ, తహసీల్దార్, కదిరి**

ప్రభుత్వభూమిని చదును చేసిన వారిని గుర్తించి చర్యలు తీసుకుంటాం. అక్రమార్కులను గుర్తించాలని గ్రామ రెవెన్యూ అధికారికి సూచించా. భూమి అన్యాక్రాంతం కాకుండా హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసి.. తగిన చర్యలు తీసుకుంటాం.

## ఇరుకు గదుల్లో.. పసిమొగ్గలు మగ్గిపోవాలా?

పాలకొల్లు మండలం వాలమర్రులో 159వ నంబరు అంగన్‌వాడీ కేంద్రం ఇది. గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో ఈ నిర్మాణం చేపట్టగా తరువాత వచ్చిన వైకాపా సర్కారు పనులను పూర్తి చేయడంలో వివక్ష చూపింది. దీంతో అసంపూర్తి భవనంలోనే కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు.మార్టేరు, అత్తిలి, పాలకొల్లు గ్రామీణ, పోడూరు, బాలల సమగ్ర వికాసానికి బాటలు వేయాల్సిన అంగన్‌వాడీ కేంద్రాలు వైకాపా పాలనలో ప్రాభవం కోల్పోయాయి. గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో చేపట్టిన అంగన్‌వాడీ భవన నిర్మాణాలను విస్మరించడంతో పాటు కొత్తగా ప్రారంభించిన పనులకు సైతం నిధులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేశారు. ఈ నేపథ్యంలో జిల్లాలో అధిక శాతం కేంద్రాలు అద్దె గదుల్లో అరకొర వసతులతో కొనసాగుతున్నాయి.

రూ.13.5 లక్షల అంచనా వ్యయంతో మూడేళ్ల క్రితం చేపట్టిన పెనుమంట్ర-3 అంగన్‌వాడీ భవన నిర్మాణం ఇలా అసంపూర్తిగా మిగిలింది. 2023 జూన్‌లో ఈ నిర్మాణాన్ని పరిశీలించిన అప్పటి కలెక్టర్ ప్రశాంతి స్థానిక అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినా పరిస్థితిలో మార్పు రాలేదు. ఈ భవనం చుట్టూ పిచ్చిమొక్కలు, పొదలు పెరిగిపోవడంతో చిట్టడవిని తలపిస్తోంది.

**ఇదీ పరిస్థితి..**

పశ్చిమగోదావరి జిల్లాలోని ఏడు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 1,626 కేంద్రాలు ఉండగా వీటిలో 600 వరకు అద్దె గదుల్లో నడుస్తున్నాయి. వీటికి పట్టణ పరిధిలో నెలకు రూ.6 వేలు, గ్రామాల్లో అయితే రూ. 2 వేల చొప్పున అద్దె చెల్లిస్తున్నారు. గతంలో తెదేపా, వైకాపా ప్రభుత్వాల హయాంలో చేపట్టిన 82 కేంద్రాల నిర్మాణాలు వివిధ దశల్లో ఆగిపోయాయి. పెనుగొండ మండలం ములపర్రులో 166వ నంబరు కేంద్రం అద్దె భవనంలో నడుస్తోంది. ఇక్కడ గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు చేసి భవన నిర్మాణం చేపట్టారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా నిధులను నిలిపేసింది. పెనుగొండలోని 135వ నంబరు కేంద్రానిదీ ఇదే పరిస్థితి. ఈ మండలంలో 71 కేంద్రాలకు గాను 25 అద్దె గదుల్లో కొనసాగుతున్నాయి.అత్తిలి, ఇరగవరం మండల్లాలోని ఈడూరు, కంతేరు, ఏలేటిపాడు గ్రామాల్లో భవన నిర్మాణాలను నిధులు మంజూరు కాకపోవడంతో గుత్తేదారులు మధ్యలోనే వదిలేశారు.

పోడూరు మండలం జిన్నూరు శివారు భూపయ్యచెరువులో నిర్మించిన భవనానికి గుమ్మాలు, పైపులైన్ల ఏర్పాటు, విద్యుదీకరణ పనులు చేయించాల్సి ఉంది. ఈ మండలంలో మూడు భవనాలు అసంపూర్తిగా మిగిలాయి. భవన నిర్మాణాల పరిస్థితిపై ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి తెలిపారు.

## మూడున్నర కోట్లు మురగబెట్టారు


ఏలూరు: 17వ లోక్‌సభలో ఏలూరు నుంచి ప్రాతినిధ్యం వహించిన వైకాపా ఎంపీ కోటగిరి శ్రీధర్ ఐదేళ్ల పదవీకాలం పూర్తి చేసుకుని, లోక్‌సభ రద్దయ్యే నాటికి కేటాయించిన ఎంపీ లాడ్స్ నిధులను పూర్తిగా వెచ్చించలేకపోయారు. నిధులు ఖర్చు చేసే విషయంలో ఆయన ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో మిగిలిపోయిన నిధులే అందుకు నిదర్శనం. ఖర్చుకాకుండా రూ.3.76 కోట్లు మిగిలిపోయాయి. ఈ నిధులను ప్రస్తుత 18వ లోక్‌సభ సభ్యుడు పుట్టా మహేశ్‌కుమార్ వినియోగించొచ్చు.గ్రామాల్లో సామాజిక భవనాలు, పట్టణ, గ్రామీణంలో రహదారుల నిర్మాణాలు, క్రీడావసతుల కల్పనకు, మున్సిపల్ పట్టణాల్లో తాగునీటి సౌకర్యం కల్పనకు, ఆసుపత్రుల అభివృద్ధికి, పొలాల బాటలకు, కొల్లేరు గ్రామాల అనుసంధాన రహదారుల నిర్మాణాలకు ఖర్చుపెట్టుకోవచ్చు. జిల్లాలో రహదారులు చాలా అధ్వానంగా ఉన్నాయి. అయినా నిధులు ఖర్చు చేయలేదంటే ఎంపీకి చిత్తశుద్ధి కొరవడమే కారణమని చెప్పాలి. ఆయా పనులకు ఎంపీ ఆమోదం తెలపగానే జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి(సీపీవో)కి ప్రతిపాదనలు పంపితే మంజూరు పత్రాలు జారీ చేస్తారు. అధికారులు టెండర్లు పిలిచి వాటిని పూర్తి చేయాలి. అయితే 52 పనులకు కనీసం టెండర్లు పిలవలేదు. వాటి విలువ రూ.3.76 కోట్లు. గతంలో ఎంపీ శ్రీధర్ ప్రతిపాదించిన ఈ పనులు రద్దయిపోయాయి. ప్రస్తుత ఎంపీ ప్రతిపాదిస్తేనే టెండర్లు పిలిచి ప్రారంభిస్తారు.

5 ఏళ్లలో రూ.22.66 కోట్ల పనులు..

కోటగిరి శ్రీధర్‌కు ఎంపీలాడ్స్ కింద మొత్తం 251 పనులకు రూ.22.66 కోట్లు కేటాయించగా ఈ ఏడాది నవంబరు నాటికి 193 పనులు మాత్రమే పూర్తయ్యాయి. వాటి విలువ రూ.17.60 కోట్లు. ఈ బిల్లులు మంజూరు చేశారు. మరికొన్ని పనులు పురోగతిలో ఉన్నాయి. అవి పలు దశల్లో ఉన్నాయి. చింతలపూడి నియోజకవర్గంలో అత్యధిక పనులకు కేటాయింపులు జరిపారు. ఏలూరు నగరంతో సహా పలు చోట్ల నిర్మించిన సామాజిక భవనాల వ్యయం పెరిగి పనులు పూర్తికాక అసంపూర్తిగా నిలిచిపోయాయి.

ఎంపీ లాడ్స్ నిధులు రూ.22.66 కోట్లు
పనుల సంఖ్య: 251
పూర్తయినవి 193
వెచ్చించిన వ్యయం రూ.17.60 కోట్లు
ప్రస్తుతం పురోగతిలో ఉన్న పనులు 6
వెచ్చించాల్సిన వ్యయం రూ.1.29 కోట్లు

# జైకా.. కదలక



చిత్తూరు : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సాగునీటి వనరుల అభివృద్ధికి రూ.82 కోట్లు ఉన్నా వినియోగించడం లేదు. జపాన్ అంతర్జాతీయ సహకార సంస్థ(జైకా) తోడ్పాటుతో చేపట్టిన కృష్ణాపురం, అరణియార్ జలశయాలతో పాటు 76 చెరువుల అభివృద్ధి పనుల్లో స్తబ్దత నెలకొంది. తాజాగా అంచనాలు పెరగడంతో ఆయా పనుల్లో కదలిక కరవైంది.

**చేపట్టిన పనులివే..**

గతంలో తెదేపా పాలనలో చిత్తూరు జిల్లా కార్వేటినగరం మండలంలోని కృష్ణాపురం ప్రాజెక్టుకు రూ.28 కోట్లు, తిరుపతి జిల్లా పిచ్చాటూరు మండలం అరణియార్ ప్రాజెక్టుకు రూ.35 కోట్లు ఇచ్చింది. వీటితోపాటు.. చిత్తూరు జిల్లాలో 41, తిరుపతి జిల్లాలో 24 చెరువుల అభివృద్ధికి నిధులు తెప్పించింది. వైకాపా ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులకు గుత్తేదారులకు బిల్లులు చెల్లించలేదు. పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి.

**17 పనుల రద్దు..**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తాజాగా జైకా పనులపై దృష్టి సారించింది. ఒప్పందం చేసుకుని పనులు ప్రారంభించని చెరువుల వివరాలు సేకరించి ప్రభుత్వానికి జలవనరుల శాఖ అధికారులు నివేదించగా.. ప్రభుత్వం 17 పనులు రద్దు చేసింది. మరో ఐదింటికి చెరువుల ఒప్పందం నుంచి గుత్తేదారును తప్పించింది. పురోగతిలో ఉన్న 48 పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించింది.

**పనులు చేపట్టలేం..**

సాగునీటి పథకాల ఆధునీకీకరణకు 2019-20 నాటి ఎస్ఎస్ఆర్ ప్రకారం అంచనాలు రూపొందించారు. ఆ ధరలతో ప్రస్తుతం పనులు చేపట్టలేమని గుత్తేదారులు చేతులెత్తేశారు. ధరలు పెరిగిన నేపథ్యంలో పనులు చేయడం తమవల్ల కాదని తేల్చిచెప్పారు. గతంలో పనులు కేటాయించిన వారిని తొలగిస్తే వాటిని మళ్లీ ఇప్పుడు కొత్త వారికి అప్పగించాలి. ఈ మేరకు టెండర్లు పిలవాలి. ఇలాగైతే అదనంగా మరో రూ.10-12 కోట్లు భారం పడుతుందని అధికారులు భావిస్తున్నారు.

**నోటీసులిచ్చినా చలనం లేదు..**

పనులు ప్రారంభించి వెంటనే పూర్తిచేయాలని ఇప్పటికే గుత్తేదారులకు నోటీసులు ఇచ్చాం. వారిలో చలనం లేదు. పెరిగిన ధరలకు అనుగుణంగా అంచనా విలువ ప్రతిపాదనలు ప్రభుత్వానికి నివేదించాం. ఎలాంటి అనుమతులు రాలేదు. అన్నీ అనుకూలిస్తే త్వరలో పనులు ప్రారంభించి పూర్తిచేస్తాం.

వెంకటేశ్వరరాజు, ఎస్ఈ, జలవనరుల శాఖ

చిత్తూరు జిల్లాలో ఇలా..

చేపట్టిన పనులు: 41 అంచనా విలువ: రూ.38.18 కోట్లు

# నకిలీ విత్తు.. రైతన్న చిత్తు



చిత్తూరు : ఏపీ సీడ్స్ నిర్లక్ష్యం రైతన్నలకు శాపంగా మారింది. నాణ్యత లేని విత్తనాలు సరఫరా చేసి చేతులు దులుపుకొంది. దీనికి తోడు ప్రణాళికాలోపం స్పష్టంగా కనిపిస్తోంది. రబీలో వేరుసెనగ విత్తుకు గడువు ముగుస్తున్నా రాయితీ విత్తనాలు ఇప్పటికీ పంపిణీకి నోచుకోలేదు.

**ముందస్తు ప్రణాళిక ఎక్కడ..?**

రబీ సీజన్‌లో ఉమ్మడి చిత్తూరు జిల్లా తూర్పు ప్రాంత మండలాల్లో విస్తారంగా.. మిగిలిన చోట్ల నామమాత్రంగా వేరుసెనగ సాగు చేస్తారు. చిత్తూరు జిల్లాలో నగరి, నింద్ర, విజయపురం మండలాల్లో.. తిరుపతి జిల్లాలో శ్రీకాళహస్తి, ఏర్పేడు, తొట్టంబేడు, బీఎన్‌కండ్రిగ తదితర మండలాల్లో సాగవుతుది.

నవంబరు రెండో వారంలో రైతులు రాయితీ విత్తు అందించాలి. డిసెంబరు 15 లోగా విత్తుకుంటే లాభదాయకమని వ్యవసాయ శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.

రాయితీ విత్తు పంపిణీపై అధికారులకు ముందస్తు ప్రణాళికే లేదు. కేటాయింపుల నుంచి ధర నిర్ణయం వరకు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. పంపిణీ పూర్తి చేయాల్సిన సమయం నవంబరు చివరి వారంలో ఎట్టకేలకు రాయితీపై 30 కిలోల బస్తా ధర రూ.1,656గా ఖరారు చేస్తూ ఉత్తర్వులిచ్చారు.

**కాలయాపన.. తిరస్కరణ**

రబీ సీజన్ విత్తన పంపిణీకి అక్టోబరులోనే విత్తనాన్ని సేకరించి ప్రాసెసింగ్ చేయాల్సి ఉన్నా ఏపీ విత్తన సంస్థ దృష్టిసారించలేదు. కర్నూలు, అనంతపురం జిల్లాల్లో విత్తన సేకరణ నవంబరు చివర్లో ప్రారంభించారు. వర్షాలతో కాయలు తేమ శాతం అధికంగా ఉందని, నాణ్యత లేదంటూ నేటికీ చిత్తూరు, తిరుపతి జిల్లాలకు సరఫరా చేయలేదు.

చిత్తూరు జిల్లాకు సరఫరా చేసిన కాయలు నాణ్యమైనవి కావని ఏవోలు.. 2,070 క్వింటాళ్లు తిరస్కరించి వెనక్కి పంపేశారు.

**త్వరలో అందజేస్తాం..**

రబీ సాగు రైతులకు రాయితీ వేరుసెనగ విత్తు వీలైనంత త్వరగా పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టాం. నాణ్యమైన విత్తు లభించడం లేదు. మేలైన కాయల సరఫరాకు.. ఏపీ విత్తన సంస్థకు లేఖ రాయనున్నాం.

మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

# తర్ఫీదు సరే.. ఉపాధి ఏదీ?



అనంతపురం : మహిళలు స్వయం ఉపాధి సాధించాలనే ఉద్దేశంతో ఉచితంగా కుట్టు శిక్షణ అందించారు. అదే తీరులో ఉచితంగా మిషన్ పంపిణీ చేస్తామని అధికారులు చెప్పడంతో మహిళలు ఆసక్తి కనబరిచారు. మరికొందరు ఆర్థిక స్వావలంబన సాధించవచ్చు అని తర్ఫీదు పొందారు. నెలలు గడుస్తున్నా కుట్టుమిషన్లు అందకపోవడంతో ప్రభుత్వం ఆశించిన లక్ష్యం నెరవేరడం లేదు. ప్రారంభం నుంచి ముగిసే వరకు శిక్షణకు హాజరైతే ఒక్కో మహిళకు ప్రభుత్వం రూ.25 వేలు అందిస్తుంది. ఆ నిధులను ఏజెన్సీకి అందజేస్తుంది. సంబంధిత ఏజెన్సీ నిర్వాహకులు కుట్టుకు అవసరమైన సామగ్రితో పాటు ఒక్కో మహిళకు ఉచితంగా కుట్టు మిషన్ అందివ్వాల్సి ఉంది. ముఖ ఆధారిత హాజరుశాతం 75 ఉన్న వారికి మాత్రమే మిషన్ ఇవ్వాలన్నది నిబంధన. శిక్షణ ఇచ్చారేగాని చాలా చోట్ల ఇప్పటిదాకా మిషన్లు పంపిణీ చేయలేదు. తమకు రావాల్సిన నిధులు అందలేదనే ఉద్దేశంతో ఏజెన్సీ నిర్వాహకులు తర్ఫీదుతో సరిపెట్టి మిన్నకుండిపోయారు.

**నియోజకవర్గానికి 500 మంది..**

వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ నిర్వహణ బాధ్యతలు తీసుకున్నారు. ఒక్కో నియోజకవర్గానికి సరాసరి 500 మంది ఉండే విధంగా... కొన్ని నియోజకవర్గాల్లో డిమాండ్‌ను బట్టి 1000 మందికి తర్ఫీదు ఇచ్చారు. అవసరాన్ని బట్టి 4 నుంచి 5 టైలరింగ్ శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశారు.

**మిషన్లు రాగానే సరఫరా చేస్తాం: రామసుబ్బారెడ్డి, బీసీ కార్పొరేషన్ ఈడీ**

ఉచితంగా కుట్టు శిక్షణ ఇప్పించాం. మిషన్ల పంపిణీపై రాష్ట్రస్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అవి రాగానే శిక్షణ పొందిన మహిళలకు అందజేస్తాం.

## సరదా స్నానం.. కారాదు ప్రాణాంతకం

నిడదవోలు : ఈ ఏడాది ఫిబ్రవరిలో మహాశివరాత్రి వేళ తాళ్లపూడి మండలం తాడిపూడి వద్ద గోదావరి రేవులో స్నానానికి దిగిన అయిదుగురు విద్యార్థులు మృతి చెందారు. 2023లో రాజమహేంద్రవరానికి చెందిన ఇద్దరు కొవ్వూరు వద్ద ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందారు. 2022లో బొబ్బర్లంక బ్యారేజీ, కొవ్వూరు వద్ద గోదావరిలో స్నానానికి దిగిన రాజమహేంద్రవరానికి చెందిన ఇద్దరు యువకులు, ఒక వ్యక్తి మృతి కార్తిక మాసంలో విహార యాత్రల కు పంట కాలువలు, చెరువులు, వాగులు, కొండవాగులున్న ప్రాంతాలకు వస్తుంటారు. స్నానాలకు దిగి, లోతు తెలియక మృత్యువాత పడుతున్నారు.

**ప్రమాదకర ప్రాంతాలు..**



పెరవలి మండలం కాకరపర్రు, తీపర్రు, నిడదవోలు మండలం పందలపర్రు, పెండ్యాల, తాళ్లపూడి, తాడిపూడి, కాతేరు, బొబ్బర్లంక, విజ్జేశ్వరం, ధవళేశ్వరం ఆర్మ్

**ఏం చేయాలంటే..**

రేవులు ఉన్న చోటే స్నానాలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలి. పలు రేవుల వద్ద కనీసం గోదావరిలోకి దిగేందుకు కూడా అవకాశం ఉండదు. అటువంటి ప్రాంతాల్లో ఎవరూ దిగకుండా గస్తీతోపాటు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి.

గతంలో ప్రమాదాలు జరిగిన ప్రాంతాలు, జరిగే అవకాశం ఉన్న ప్రాంతాలను అధికారులు గుర్తించి యాత్రికులు అటువైపు వెళ్లకుండా రక్షణ వలయాలు ఏర్పాటు చేయాలి.

యాత్రికులు ఎక్కువగా వచ్చే సెలవు దినాల్లో ప్రధాన ప్రాంతాల్లో అధికారులు గస్తీ ఏర్పాటు చేయాలి.

## రుచుల 'కుండపోత'.. ట్రెండ్‌కు అనుగుణంగా పూతరేకులు

ఆత్రేయపురం : కోనసీమ అంటే కట్టిపడేసే దృశ్యాలే కాదు. నోరూరించే రుచుల పసందు. ఆ రుచుల్లో ఆత్రేయపురం పూతరేకులది ప్రత్యేక స్థానం. పూతరేకులంటే పంచాదార, బెల్లం డ్రై ఫ్రూట్స్‌తో తయారు చేసేవే కాదు.. ఇంకా బోలెడు రకాలు ఉన్నాయి. మధుమేహ బాధితులు తినేందుకు వీలుగా కాకరకాయ పొడి, కారంపొడి వేసి చుట్టిన పూతరేకులూ ఉన్నాయి. చిన్నపిల్లలు ఇష్టంగా తినడానికి చాక్లెట్ పౌడర్, బూస్ట్, హార్లిక్స్ చల్లినవీ లభిస్తాయి. ఇష్టంగా ఒక్క రోజులో తినేందుకు వీలుగా క్యారెట్, బీట్‌రూట్, తేనె జోడించి మరీ విభిన్న రుచుల్లో అందుబాటులోకి తెస్తున్నారు.

**ఎక్కడికైనా ఇక్కడి నుంచే..**

వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా రకరకాల పూతరేకులు అందుబాటులో ఉండటంతో ఇటీవల అమ్మకాలు పెరిగాయి. హైదరాబాద్, బెంగళూరు వంటి పెద్ద నగరాల్లో ఫంక్షన్లు జరిగేటప్పుడు



వారి ఆహ్వానంపై వెళ్లి అక్కడే తయారు చేసి అందజేస్తున్నారు. శనివారం వచ్చిందంటే చాలు వాడపల్లి వెంకన్న దర్శనానికి వచ్చేవారు వేల మంది ఇక్కడ ఆగి పార్సిళ్లు తీసుకెళ్లుతుంటారు.

**ఏటా రూ.6కోట్లు**

ఒకప్పుడు ఇంటింటా.. ఊరూరా తిరిగి అమ్మకాలు జరిపే స్థాయి నుంచి ఆన్‌లైన్ వరకు వ్యాపారం చేరింది. తయారీ, విక్రయంలో మహిళలదే కీలక పాత్ర. సినీ, ఇతర ప్రముఖులు, వివిధ సంస్థలకు ఇక్కడి నుంచే పూతరేకుల పార్సిళ్లు వెళ్తుంటాయి. ఆర్టీసీ, రైల్వే, విమాన కార్గోల ద్వారా ఇతర ప్రాంతాలకు పంపిస్తున్నారు. ఏటా రూ.6 కోట్ల వరకు లావాదేవీలు సాగుతున్నాయి.

**1200 మహిళా సంఘాలకు ఉపాధి**

ఒక్క ఆత్రేయపురం మండలంలోనే 1200 స్వయం సహాయక సంఘాల మహిళలు ఈ పరిశ్రమపై ఆధారపడి ఉపాధి పొందుతున్నారు. ఒక్కో మహిళ అమ్మకాల ద్వారా రూ.30వేల నుంచి రూ.40 వేల వరకు ఆదాయం పొందుతున్నారు.

## పేరుకున్న బకాయిలు.. తడారుతున్న గొంతులు..!

రాజమహేంద్రవరం : ప్రతి ఇంటికీ కుళాయిల ద్వారా సురక్షిత జలాలు అందివ్వాలన్న 'జల్‌జీవన్ మిషన్' లక్ష్యానికి గత ప్రభుత్వం తూట్లు పొడిచింది. ప్రాధాన్య క్రమంలో పనులు చేపట్టక, తన వాటా నిధులు విడుదల చేయకపోవడంతో గుత్తేదారుల బకాయిలు పేరుకుపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత దీనిని గాడిలో పెట్టినా.. బకాయిలు చెల్లించకపోవడంతో దాదాపు రెండు నెలలుగా పనులు నిలిచిపోయాయి.అనపర్తి, బిక్కవోలు, రంగంపేట మండలాల్లో 65 పనులు రూ.28 కోట్ల అంచనా వ్యయంతో మంజూరైతే 46 పనులు పూర్తి చేశారు. కానీ ఆరు పనులకే బిల్లులు చెల్లించారు. రంగంపేటలో పనులన్నీ ప్రాథమిక దశలోనే ఉన్నాయి.కొవ్వూరు, తాళ్లపూడి, చాగల్లు మండలాల పరిధిలో 34.16 కోట్ల అంచనా వ్యయంతో 86 పనులు మంజూరవ్వగా అయిదు మాత్రమే పూర్తయ్యాయి.గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల మండలాల్లో రూ.28.57కోట్లతో 92 పనులకు గాను 76 పూర్తి చేశారు.

నిడదవోలు, పెరవలి, ఉండ్రాజవరం మండలాల్లో రూ.48.78 కోట్లతో 92 పనులు కేటాయించారు. అవన్నీ నేటికీ ప్రారంభదశలోనే ఉన్నాయి.రాజమహేంద్రవరం గ్రామీణం, కడియం మండలాలకు రూ.32.26 కోట్ల అంచనాలతో 51 పనులు మంజూరవగా సగం నిధులు సైతం ఖర్చు చేయలేని దుస్థితి. 27 పనులు వివిధ దశలో ఉన్నాయి.

త్వరలోనే నిధులు మంజూరయ్యే అవకాశం ఉంది. కొంత మేర బకాయిలు చెల్లించిన వెంటనే పనులు ప్రారంభమవుతాయి. అని ఎస్ఈ గిరి అన్నారు.

రూ.216.30 కోట్లు: అంచనా వ్యయం రూ.35 కోట్లు: చెల్లించాల్సిన బకాయిలు
508: మంజూరైన పనులు 337: పూర్తి చేసింది
139: వివిధ దశల్లో ఉన్నవి 60,635: ఏర్పాటు చేయాల్సిన కుళాయిలు

చురకలు



# ఘాట్.. గమ్యం చేరలేం!

ఉదయగిరి : 'ఉదయగిరి- బండగానిపల్లి మార్గంలో అసంపూర్తిగా ఉన్న 3.2 కి.మీ. రోడ్డు పూర్తి చేస్తే పది గ్రామాలకు చెందిన సుమారు 14వేల మందికి ప్రయోజనం కలుగుతుంది. ఆ మేరకు పూర్తి చేయాలని 20 ఏళ్లుగా మొరపెట్టుకుంటున్నా.. ఆందోళనలు చేసినా.. ఫలితం లేకుండా ఉందని కొండ కింద పల్లెలకు చెందిన ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.'

**3.2 కి.మీ.లు**

కొండ కింద ఉన్న బండగానిపల్లి, బిజ్జంపల్లి, కృష్ణారెడ్డిపల్లి, లింగమనేనిపల్లి, కొత్తపల్లి, జి.అయ్యవారిపల్లి, దేకూరుపల్లి, జి.చెర్లోపల్లి, జి.చెరువుపల్లి, సంజీవరాజుపల్లి గ్రామాల ప్రజలు రోజువారీ అవసరాల నిమిత్తం నిత్యం ఉదయగిరికి రాకపోకలు సాగిస్తుంటారు. గతంలో శకునాలపల్లి మీదుగా కొండ చుట్టూ సుమారు 25 కి.మీ.పైగా తిరిగి వచ్చేవారు. 2005లో నాటి ప్రభుత్వం పది కి.మీ. దూరం ప్రయాణిస్తే చేరుకునేలా.. ఉదయగిరి- బండగానిపల్లి ఘాట్ రోడ్డు నిర్మాణం చేపట్టింది. ఇంత వరకు బాగానే ఉన్నా.. మార్గం మధ్యలో 3.2 కి.మీ. అటవీశాఖ అభ్యంతరంతో ఆగిపోయింది. ఈ కాస్త పూర్తిచేస్తే తమకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని.. తీవ్ర ఇబ్బందులు పడుతు న్నామని.. అప్పటి నుంచి ప్రజలు విన్నవిస్తూనే ఉన్నారు. ఆందోళనలు సైతం చేపట్టారు. దాంతో నాలుగేళ్ల కిందట అటవీశాఖ కోల్పోతున్న 3.2 కి.మీ.కు ప్రత్యామ్నాయంగా నేలటూరు సమీపంలో కేటాయించారు. రోడ్డు ఏర్పాటుకు అనుమతుల కోసం ఉన్నతాధికారులకు



ప్రతిపాదనలు పంపారు. ఇంత వరకు అనుమతి రాకపోవడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా దృష్టిసారించి.. సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

**అధికారులు ఏమన్నారంటే...**

అటవీశాఖ కోల్పోతున్న భూమికి ప్రత్యామ్నాయంగా ఇచ్చిందీ వారి పరిధిలోనే ఉందని చెబుతున్నారని ఆర్అండ్‌బీ డీఈఈ మదన్‌కుమార్ తెలిపారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి చర్చిస్తున్నామన్నారు. అటవీశాఖ రేంజ్ అధికారి బీఎస్ కుమారరాజాతో మాట్లాడగా.. తమశాఖ ఉన్నతాధికారులు కొన్ని వివరాలు అడిగారని, వాటిని పంపాల్సి ఉందన్నారు.


**నిత్యం నరకం..**అసంపూర్తిగా ఉన్న ఘాట్ రోడ్డు రాళ్లు తేలి.. గుంతలమయంగా మారింది. ఉదయగిరికి వెళ్లేందుకు నిత్యం నరకం చూస్తున్నాం. రాకపోకలు సాగించే క్రమంలో ఎందరో తీవ్ర గాయాలపాలయ్యారు. ఈర్ల శంకర్

# పంచాయతీలపై.. ఏదీ పర్యవేక్షణ!

సర్వేపల్లి : కోవూరుతో పాటు పలు నియోజకవర్గాల్లోని పంచాయతీల్లో అక్రమాలు జరిగాయని, నిధులు భారీగా దుర్వినియోగం చేశారని అధికారులకు ఫిర్యాదులు అందాయి. విచారణ జరిపిన అధికారులు.. అవి నిజమని తేల్చి.. సర్పంచుల చెక్‌పవర్ రద్దు చేయడంతో పాటు కార్యదర్శులపై వేటు వేశారు. అదే సమయంలో అధికారుల పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడం వల్లే.. అక్కడ ఆ పరిస్థితులు నెలకొన్నాయన్న విమర్శలు ఉన్నాయి.

పంచాయతీల్లో సర్పంచులు, వారి కుటుంబ సభ్యులు, బంధువులు కాంట్రాక్టర్లు(వెండర్)గా ఉండకూడదు. కార్యదర్శులు రూపాయి కూడా వారి ఖాతాల్లో వేసుకోకూడదు. కానీ, వెంకటాచలం పంచాయతీతో పాటు మరికొన్నిచోట్ల సర్పంచుల కుటుంబ సభ్యులే కాంట్రాక్టర్‌గా ఉండి.. రూ. లక్షల నిధులు వారి ఖాతాల్లో వేసుకున్నారు. కార్యదర్శులు తమ ఖాతాలకు మళ్లించుకున్నారు. ఏళ్లుగా జరుగుతున్న ఈ తంతును అధికారులు గుర్తించలేకపోవడం.. పరిస్థితికి అద్దం పడుతోంది.

జిల్లాలో పంచాయతీలపై డివిజనల్, మండల స్థాయి అధికారుల పర్యవేక్షణ కొరవడుతోంది. తరచూ వాటిని సందర్శించి.. రికార్డులు పరిశీలించడంతో పాటు నిధుల వినియోగంపై విచారణ జరపాల్సిన అధికారులు నామమాత్రపు తనిఖీలతో సరిపెడుతుండగా- ఆ ఉదాసీన వైఖరే అన్ని అక్రమాలకు కారణమవుతోంది. జిల్లా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. డివిజన్ పరిధిలో డీఎల్‌పీవో, మండల స్థాయిలో ఈవోపీఆర్డీలు పర్యవేక్షణ బాధ్యత




తీసుకోవాలి. డీఎల్‌పీవో నెలకు 5 నుంచి 10 పంచాయతీలను తనిఖీ చేయాలి. ఈవోపీఆర్డీలు నెలలో తమ మండల పరిధిలోని అన్ని పంచాయతీల్లో పర్యటించాలి. మూడు నెలలకు ఒకసారి తనిఖీలు చేయాలి. కానీ, చాలాచోట్ల అది పక్కాగా అమలు కావడం లేదు. ఆ క్రమంలోనే భారీగా నిధుల దుర్వినియోగం జరుగుతోందన్న అపవాదు నెలకొంది. ఇక టీపీగూడూరు, వెంకటాచలం, రాపూరు, పొదలకూరు, ముత్తుకూరు, మనుబోలు, ఇందుకూరుపేట తదితర మండలాల నుంచి అధికారులకు ఫిర్యాదులు అందాయి. చాలాచోట్ల ఇంకా విచారణ జరపలేదు. విచారణ చేస్తున్న చోట్లా వాయిదాల పేరుతో కాలయాపన చేస్తున్నారు. వెంకటాచలం మండలంలో ఎనిమిది నెలలపాటు సుదీర్ఘ విచారణ జరిపి.. మొక్కుబడి నివేదిక ఇవ్వడమూ ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. ఈ పరిస్థితులు మార్చాల్సిన అవసరం ఉంది.

ఈ విషయమై డీపీవో శ్రీధర్ స్పందిస్తూ.. త్వరలో జిల్లా స్థాయిలో సమీక్ష నిర్వహించి.. తనిఖీలు చేయని వారిని గుర్తించడంతోపాటు అన్నిచోట్ల జరిగేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.

జిల్లాలో మండలాలు: 37
పంచాయతీలు: 722
డివిజన్లు నాలుగు
అందిన ఫిర్యాదులు: 30

# ఏం చేద్దాం.. ఎలా ఉపయోగిద్దాం!



విశాఖపట్నం : గత వైకాపా ప్రభుత్వం రుషికొండపై రూ. వందల కోట్ల ప్రజాధనం వ్యయం చేసి విలాసవంత భవనాలు నిర్మించింది. వాటిని ప్రభుత్వ అవసరాలకు కాకుండా జగన్ నివాస అవసరాలకు వీలుగా నిర్మించుకోవడంతో వాటిని దేనికీ వినియోగించుకోలేని దుస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా... ఆ భవనాల వినియోగంపై ఏ నిర్ణయం తీసుకోలేదు. అయితే... తాజాగా ప్రభుత్వ ఆదేశాలతో ఈ భవనాలను ఎలా వినియోగించాలి? అనే అంశంపై ఏపీ పర్యాటక ప్రాధికార సంస్థ (ఏపీటీఏ) ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టింది. దీంతో పలువురు తమ ఆలోచనలను పంపుతున్నారు. భవనాలు చూడకుండా ఎలా వినియోగించాలో చెప్పేదెలా అని చాలా మంది ప్రశ్నిస్తున్నారు.

**అప్పుడలా..**ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) రుషికొండపై హరితా హిల్ రిసార్టు నిర్వహించేది.

42 గదులు, సమావేశ మందిరం, వివాహ వేదిక, రెస్టారెంట్ ఉండేవి. ఈ ఒక్క రిసార్టు నుంచే ఏపీటీడీసీకి ఏటా రూ.7 కోట్ల ఆదాయం వచ్చేది. రాష్ట్రంలో మిగిలిన అన్ని రిసార్టుల కలిపితే ఇంత వచ్చేది.

రిసార్టు నుంచి తీరం అద్భుతంగా కనిపించేది. సీజన్‌లో ఇక్కడ గది దొరకాలంటే చాలా కష్టంగా ఉండేది.

భవనాలు నిర్మించి 15 ఏళ్లు కాకమునుపే కూల్చేశారు.

**ఇప్పుడిలా..**

గత వైకాపా ప్రభుత్వంలో ఆ భవనాలను కూల్చి 9.88 ఎకరాల్లో 13,140 చదరపు మీటర్లలో భవనాలు నిర్మించారు.

రూ.452 కోట్ల ప్రజాధనం వెచ్చించారు. విదేశాల నుంచి తీసుకువచ్చిన సామగ్రితో గదులు అలంకరించారు.

వేంగి, గజపతి, కళింగ, విజయనగర పేరుతో ప్యాలెస్‌లా నిర్మించారు.

భవనాల ముందు సుందరీకరణకు లక్ష మొక్కలతో ఉద్యానవనం అభివృద్ధి చేశారు.

కొంతకాలంగా ఖాళీగా వదిలేయడంతో గదులు దుమ్ము పట్టాయి. తీరం నుంచి వచ్చే ఉప్పు గాలికి పలునిర్మాణాలు, సామగ్రి తుప్పు పడుతున్నాయి. వర్షానికి అక్కడక్కడ సీలింగ్ నుంచి నీరు కారుతోంది.

మెయిల్ చేయండి..

ఆసక్తి ఉన్న వారు ఈ భవనాలను దేనికి వినియోగించాలో తమ అభిప్రాయాలు తెలియజేయొచ్చు.

జాతీయ, అంతర్జాతీయంగా ఆతిథ్యరంగంలో అనుభవం కలిగిన నిర్వాహకుల

అభిప్రాయం తెలుసుకునేందుకు శుక్రవారం విజయవాడలో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నారు. %rushikonda.suggestions @aptdc.ap.gov.in% కు మెయిల్ చేయొచ్చు.

# పేరు దేశవ్యాప్తం.. తీరు నిర్లక్ష్యం



పలమనేరు: దేశవ్యాప్తంగా పుంగనూరు దూడలకు ఎంతో ప్రత్యేకత ఉంది. ప్రధానమంత్రులు, ఎందరో ప్రముఖులు, రాజకీయ నాయకులకు వీటిపై మక్కువ ఉండేది. రూ.లక్షలు పెట్టి కొనుగోలు చేసి మరీ ఇళ్లలో పెంచుకోవడానికి చాలామంది ఆసక్తి చూపిస్తుంటారు. వీటిపై పరిశోధనలు చేయడానికి చిత్తూరు జిల్లా పలమనేరులో సుమారు 500 ఎకరాల్లో ఏర్పాటు చేసిన కేంద్రం మాత్రం నిర్లక్ష్యానికి గురవుతోంది. సరిపడా సిబ్బంది లేక చాలాపోస్టులు ఖాళీగా ఉన్నాయి.

**నివాసం ఎలా..?**

ఈ కేంద్రానికి సంబంధించి 33 ఎకరాలను అంతర్జాతీయ మార్కెట్ కమిటీ ఏర్పాటుకు కేటాయించారు. అందులోని సిబ్బందికి క్వార్టర్లు కూడా ఇచ్చేయాల్సి వచ్చింది. ఇప్పటివరకు సిబ్బంది లేకపోవడంతో అవి నిరుపయోగంగా ఉన్నా.. భవిష్యత్తులో భర్తీ చేస్తే నివాసానికి భవనాలు ఉండవు.

**నియామకానికి చర్యలు**

సిబ్బంది కొరత లేకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఆబ్కాబ్ కింద వర్కర్ల పోస్టులను భర్తీ చేసుకునేందుకు తిరుపతి ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ అధికారులు అనుమతి ఇచ్చారు. సైంటిస్టు పోస్టులు కూడా భర్తీ చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు. భారతి, సీనియర్ సైంటిస్టు

# బకాయిలు రూ.100 కోట్లు



చిత్తూరు : ఉపాధి హామీ బకాయిలు జిల్లాలో అక్షరాలా రూ.వంద కోట్లు ఉన్నాయి.. ఈ ఏడాది ఆగస్టు 15 నుంచి 90 రోజులుగా చెల్లింపులు నిలిచిపోయాయి.. వారంలో అందాల్సిన డబ్బులు మూడు నెలలుగా విడుదల కాకపోవడంతో ఉపాధి హామీ పనులకు హాజరయ్యేవారి సంఖ్య రోజురోజుకు తగ్గిపోతోంది..

**కూలీల సొమ్ము రూ.35 కోట్లు..**

రోజుకు సగటున 35 నుంచి 50 వేల మంది వరకూ జిల్లాలో ఉపాధి పనులు చేశారు. వారికి గత మూడు నెలలుగా రూ.35 కోట్ల బకాయిలు ఉన్నాయి.

**మెటీరియల్‌కు రూ.65 కోట్లు**

కూలీలు పని చేసి పొందిన వేతన సొమ్ములో 40 శాతం కేంద్ర ప్రభుత్వం గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు వస్తు సామగ్రి నిధులు విడుదల చేస్తుంది. గ్రామాల్లో నాయకులు, గుత్తేదారులు సీసీరోడ్లు, డ్రైన్లతో పాటు వివిధ అభివృద్ధి పనులు చేశారు. వీటితో పాటు రైతులు మినీ గోకులం షెడ్లు నిర్మించుకున్నారు. వాటి తాలూకు బకాయిలు రూ.65 కోట్లు పేరుకున్నాయి. మొత్తంగా ఉపాధి హామీ పథకం కింద కూలీల వేతనాలు, వస్తు సామగ్రి నిధి రూ.100 కోట్లు బకాయిలు పేరుకుపోయాయి.

త్వరలో అందుతాయి..

ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో రూ.100 కోట్లు బకాయిలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయాల్సి ఉంది. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లాం. త్వరలో విడుదల అయ్యే అవకాశం ఉంది. బకాయిలు రాగానే వేతనదారులకు చెల్లిస్తాం. రవికుమార్, పీడీ డ్వామా.

# రిజిస్ట్రేషన్ ఉంటేనే ఆక్వా రాయితీలు

కోట: ఆక్వా రైతులు ప్రభుత్వం అందించే రాయితీలు పొందాలంటే చెరువుల రిజిస్ట్రేషన్ తప్పనిసరి. వీరికి కోస్తా ఆక్వాకల్చర్ అనుమతులు ఇస్తే అన్ని రకాల పథకాలు వర్తిస్తాయి. 50 రోజులుగా మత్స్యశాఖ అధికారులు, సిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుండగా రైతుల నుంచి స్పందన కరవైంది. ఇప్పటివరకు కేవలం సగంమంది మాత్రమే ముందుకు వచ్చారు.

వివాదాస్పద భూములతో సమస్య..

చిట్టమూరు మండలంలోని పిట్టివానిపల్లె, రంగనాథపురం, కోగిలి, పాదర్తివారి కండ్రిగతోపాటు పలు గ్రామాల్లో వివాదాస్పద భూములు, డీకేటీ పట్టా భూముల్లో సాగు ఎక్కువగా ఉంది. దీంతో రెవెన్యూ అధికారులు అనుమతులు ఇవ్వడంలో అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. రిజిస్ట్రేషన్లలో జాప్యం జరుగుతోంది. కోట, వాకాడు, చిల్లకూరు మండలాల్లో 20 శాతం చెరువులు ఖాళీగా ఉన్నాయి.

సచివాలయంలోనే నమోదు..

విద్యుత్తు రాయితీ పొందాలన్నా, ఇతర దేశాలకు రొయ్యలను ఎగుమతి చేయాలన్నా, బీమా వర్తించాలన్నా రిజిస్ట్రేషన్ అవసరం. రైతులు ఈ ప్రక్రియ పూర్తి చేసేందుకు



ఎకరాకు రూ.1000 చెల్లించి సచివాలయంలో నమోదు చేయించుకోవాలి. మత్స్యశాఖ అధికారులు పరిశీలించి ఆర్డీవోకు పంపిస్తారు. తర్వాత కోస్తా ఆక్వా కల్చర్ అథారిటీ అనుమతులు జారీ చేస్తుందని జిల్లా మత్స్యశాఖ అధికారి రాజేష్ తెలియజేశారు. రైతుల వద్దకు వెళ్లి ప్రక్రియ పూర్తి చేయిస్తామన్నారు.

సాగు ఇలామండలాలు: 4 (కోట, చిట్టమూరు, చిల్లకూరు, వాకాడు)
విస్తీర్ణం: 9 వేల ఎకరాలు
రిజిస్ట్రేషన్ జరిగింది: 4,500 ఎకరాలు

# గోరుకల్లు నీరు.. అందని తీరు

డోన్ : డోన్ నియోజకవర్గానికి తాగునీరు అందించే కీలకమైన గోరుకల్లు ప్రాజెక్టు పనులు గడువులోగా పూర్తయ్యేలా అగుపించడం లేదు. ప్రస్తుతానికి బేతంచెర్ల మండలంలోని కొన్ని గ్రామాలకు నీరు అందినా.. నియోజకవర్గంలో కీలకమైన డోన్ పట్టణం, మండలంలో మాత్రం పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. మరోవైపు ప్యాపిలి మండలంలోనూ పలుచోట్ల పైపులైన్ పనులు ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. పూర్తిస్థాయిలో డోన్ నియోజకవర్గ దాహార్తిని తీర్చే గోరుకల్లు నీరు వచ్చే ఏడాదిలోనే పూర్తయ్యే సూచనలు కన్పిస్తున్నాయి.

**70 శాతం పూర్తి**

డోన్ నియోజకవర్గంలోని 131 గ్రామాలకు తాగునీటికి ఉద్దేశించిన గోరుకల్లు ప్రాజెక్టు నిర్మాణాన్ని నాలుగేళ్ల క్రితమే ప్రారంభించారు. రూ.351 కోట్ల వ్యయంతో దీన్ని చేపడుతున్నారు. ఇందులో భాగంగా 591 కి.మీ.ల మేర పైపులైన్ పనులు చేపట్టాల్సి ఉండగా.. 70 శాతం మేర పూర్తయింది. పట్టణ ప్రాంతంలో ఒక్కొక్కరికీ 135 లీటర్లు, గ్రామాల్లో 100 లీటర్ల తాగునీరు ఇవ్వాల్సి ఉంది. జలాశయం నుంచి 0.50 టీఎంసీల నీటిని తీసుకునేలా ప్రణాళికలు రూపొందించి



నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం 36 గ్రామాలకు తాగునీరు అందుతోంది.

**వచ్చే ఏడాదికే అవకాశం**

నియోజకవర్గంలో డోన్ పట్టణ సమీపంలోని నగరవనం ప్రాంతంలో రెండు మూడు చోట్ల, డోన్ కొండ ప్రాంతంలో కొన్ని చోట్ల, ప్యాపిలి మండలంలోని హుసేనాపురంతో పాటు జలదుర్గం తదితర ప్రాంతాల్లో అటవీశాఖ అనుమతులు రావాల్సి ఉందని అధికారులు పేర్కొంటున్నారు. దీంతో పనులు ముందుకు సాగక గడువు పెరుగుతూనే పోతోంది. మరోవైపు డోన్ నుంచి ప్యాపిలి వెళ్లే జాతీయ రహదారిలో పలుచోట్ల పైపులు అలాగే ఉన్నాయి. నిర్మాణాలకు సంబంధించిన పనులు 10 శాతం మేర పూర్తికావాల్సి ఉంది. దీంతో జనవరిలోగా డోన్‌కు, వచ్చే మార్చి, జూన్, జులైలోగా నియోజకవర్గానికి అంతటికీ నీరు అందించేందుకు కృషి చేస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రమేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

# అడగుకో అగాధం.. గజానికో గుంత!

శృంగవరపుకోట : ఈ రెండు గ్రామాలే కాదు.. జిల్లాలోని శృంగవరపుకోట నియోజకవర్గంలో క్వారీలున్న ప్రతి గ్రామానిదీ ఇదే పరిస్థితి. అసలే గ్రామీణ రహదారులు.. అడుగడుగునా గుంతలు.. ఏళ్లుగా కానరాని మరమ్మతులు, నిర్వహణ.. దీనికితోడు నిత్యం క్వారీల నుంచి మితిమీరిన లోడ్లతో భారీ వాహనాల రాకపోకలతో మరింత అధ్వానంగా మారుతున్నాయి.

**52 రాతి క్వారీల పరిధిలో..**

జిల్లాలోని ఎస్.కోట, కొత్తవలస, ఎల్.కోట, వేపాడ, జామి మండలాల పరిధిలో మొత్తం 83 రాతి క్వారీలు ఉన్నాయి. వీటిలో ప్రస్తుతం 52 వరకు పనిచేస్తున్నాయి. ఎస్.కోటలో 15, వేపాడలో 18, కొత్తవలసలో 13, జామిలో 6 క్వారీల్లో తవ్వకాలు సాగుతున్నాయి.

**ఎక్కడెక్కడ ఎలా?**గ్రామీణ దారుల్లో 10 టన్నుల లోడు సామర్థ్యం మేరకే వాహనాలు తిరిగేలా నిర్మాణం ఉంటుంది. కానీ భారీ వాహనాలు 50 నుంచి 60 టన్నుల సామర్థ్యంతో వెళ్తున్నాయి.

శృంగవరపుకోట మండలంలోని కొత్తూరు నుంచి కొండమల్లిపూడికి సుమారు 5 కి.మీ మే క్వారీ లారీలు అధికంగా తిరగడంతో భారీ గోతులు ఏర్పడ్డాయి. కొండమల్లిపూడి, మల్లిపూడి, కాశీపతి రాజుపురం గ్రామస్థులతోపాటు రైతులకు ఈ దారిలో పంట భూములున్నాయి. ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. చిన్నపాటి వర్షం పడినా గోతుల్లో నీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. ఆలుగుబిల్లి, చామలాపల్లి, పుణ్యగిరి, కొత్తూరు ఇదే పరిస్థితి.

వేపాడ మండలంలోని జాకేరు-బొద్దాం, సోంపురం-వల్లంపూడి, సోంపురం-ఆనందపురం, వీలుపర్తి-వావిలపాడు, వీలుపర్తి-కడకొండ, బొద్దాం- రామస్వామిపేట రోడ్లు గుంతలుగా మారాయి.

జామి మండలం జామి-లక్ష్మీపురం, కొత్తవలస మండలంలో కొత్తవలస నుంచి విజయనగరం, సబ్బవరం, కె.కోటపాడు రహదారులు అధ్వానంగా మారి జనం యాతన పడుతున్నారు.

**ప్రతిపాదనలు పంపాం..**

ఎస్.కోట మండలంలో కొత్తూరు నుంచి కొండమల్లిపూడి రోడ్డు నిర్మాణానికి రూ.1.40 కోట్లతో, వేపాడ మండలంలో బొద్దాం-కల్లెంపూడి రోడ్డు మరమ్మతుకు రూ.1.10 కోట్లతో ప్రతిపాదనలు పంపాం. నిధులు రాగానే పనులు చేయిస్తాం. మిగిన వాటినీ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. స్వామినాయుడు, డీఈ, పంచాయతీరాజ్, ఎస్.కోట

**నిత్యం అవస్థలే..**

నా పేరు సుబ్రహ్మణ్యం. మాది వేపాడ మండలం జాకేరు. గ్రామానికి వచ్చే రోడ్డంతా రాళ్లుతేలడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వర్షం పడితే అడుగేయలేం.

**పిల్లలు బడికెళ్లాలంటే భయమేస్తోంది..**

నా పేరు శ్యామ్. మాది ఎస్.కోట మండలం కొండమల్లిపూడి. రోజూ పిల్లలు పాఠశాలకు వెళ్లి, వచ్చేవరకూ భయమే. గ్రామానికి 108 వాహనం కూడా రావడం లేదు.

## కాలుష్యం కమ్మేసింది.. కోపంతో ఎరుపెక్కింది



విజయనగరం : వందల ఎకరాలకు సాగునీరు అందించే చెరువది.. పశుపక్షాదులకు ఆసరాగా నిలిచే నీటివనరది.. భూగర్భ జలాల పెంపునకు ఆస్కారం కలిగించే కల్పతరువది.. కానీ నేడు కోపంతో ఎరుపెక్కింది.. ఎవరి పాపమో తెలియదు గానీ ఎర్రటి సంద్రమై బోరుమంటోంది. జామి మండలంలోని అలమండ గ్రామ సమీపంలో ప్రధాన రహదారి పక్కనున్న చెరువు ఇటీవల ఒక్కసారిగా ఎర్రగా మారిపోయింది. చుట్టుపక్కల ప్రాంతాల్లో పలు రకాల పరిశ్రమలు ఉండడం, దుమ్ము, ధూళి, వ్యర్థజలాల కారణంగా ఇలా మారిపోయినట్లు స్థానికులు చెబుతున్నారు. అప్పుడప్పుడూ ఇలా జరుగుతోందని పేర్కొంటున్నారు. దీంతో అటుగా వెళ్లేవారు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

# రక్షణ గోడ..గడువుల గాథ!

నెల్లూరు : రెండు సాగునీటి కాలువల పటిష్ఠతకు చేపట్టిన రక్షణ గోడల నిర్మాణాలు అసంపూర్తిగా ఉండిపోయాయి. మొదట్లో అంచనాలు, ఆ తరువాత బిల్లుల సమస్యతో పనులు ముందుకు సాగలేదు. గత ప్రభుత్వం పట్టించుకోక ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. నెల్లూరు నగరంలోని పెన్నా వారధి నుంచి సర్వేపల్లి, కృష్ణపట్నం ప్రాంతాలకు సాగునీటిని తీసుకెళ్లే సర్వేపల్లి కాలువకు 0.6 కి.మీ. నుంచి 3.3 కి.మీ. హరనాథపురం వరకు ఇరువైపులా రక్షణ గోడల నిర్మాణానికి రూ.110 కోట్లతో అంచనాలు తయారు చేయగా... రూ.87కోట్ల అగ్రిమెంట్‌తో పనులు ప్రారంభమయ్యాయి. ఏళ్లు గడుస్తున్నా.. పనులు పూర్తికానంటున్నాయి. పనులకు 2022లో టెండర్లు పూర్తై 24నెలల కాలపరిమితితో గుత్తేదారుకు పనులు అప్పగించారు. నిర్మాణాలు పూర్తి చేయాల్సిన గడువు గతేడాది మొదటికే ముగిసింది. అనంతరం ఈవోటీ పేరుతో అక్టోబర్ వరకు పొడిగించారు. మళ్లీ ఏడాది కాలం జరిగింది. అయినా పనులు ముందుకు కదలడం లేదు. ఇప్పటి వరకు రెండు వైపులా గోడలతో కలిపి రెండున్నర కిలోమీటర్లు పూర్తి అయ్యాయి. సుమారు రూ.40కోట్లకు పైగా బిల్లులు చెల్లించారు. తర్వాత జరిగిన పనులకు బిల్లులు ఇవ్వలేదు.

**జాఫర్ సాహెబ్ కాలువ**



అలాగే తోటపల్లిగూడూరు మండలం, మైపాడు పరిధిలో ఆయకట్టుకు సాగునీరు తీసుకెళ్లే జాఫర్ సాహెబ్ కాలువకు సంబంధించి పాత చెక్ పోస్టు నుంచి మైపాడు గేటు వరకు 1.15 కిలోమీటర్లు, అక్కడి నుంచి జాతీయ రహదారి వరకు మరో 1.05 కిలోమీటర్లు మేర సుమారు రూ.94కోట్లతో అంచనాలు వేయగా.. రూ.74కోట్ల అగ్రిమెంట్‌తో పనులు మొదలయ్యాయి. 15శాతం వరకు పనులు జరగగా.. రూ.7కోట్లకు బిల్లులు పెట్టారు. సర్వేపల్లి కాలువ రక్షణ గోడ పనులు మొదలు పెట్టిన కొద్ది నెలలకే జాఫర్‌సాహెబ్ కాలువ పనులు గుత్తేదారులకు అప్పగించారు. ఇవి కూడా ఎక్కడికక్కడ నిలిచిపోయాయి.

**పూడిక తీతకు తప్పని తిప్పలు**

ప్రస్తుతం సర్వేపల్లి కాలువలో పూడికతీత పనులు జరుగుతున్నాయి. భారీ పొక్లెయిన్లు తీసుకువచ్చి పనులు చేశారు. శెట్టిగుంట రోడ్డు నుంచి రైల్వేస్టేషన్ సమీపం వరకు పూడిక తీశారు. గోడ నిర్మాణాలు చేసిన చోట పూడిక తీత పనులకు కష్టాలు తప్పడం లేదు. అటు ఇటు గోడ నిర్మాణాలు.. గోడ వెంబడి ఆక్రమణల కారణంగా వాహనాలు వెళ్లలేని పరిస్థితి. దీంతో కొంతమేర మనుషులను పెట్టి పనులు చేస్తున్నారు. ప్రస్తుతం మొక్కుబడిగా జరుగుతున్నట్లు విమర్శలున్నాయి.

# మారనున్న పల్లె పాలనా రూపు

ఒంటిమిట్ట : పంచాయతీ పాలనలో మార్పులకు కూటమి ప్రభుత్వం సంకల్పించింది. ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా, సంక్షేమ ఫలాలు లబ్ధిదారులకు నేరుగా చేరేలా అడుగులు వేస్తోంది. పథకాల అమలులో క్షేత్రస్థాయి యంత్రాంగం ముఖ్య భూమిక పోషించేలా చర్యలు చేపడుతోంది. జిల్లాలో 557 గ్రామ పంచాయతీలుండగా.. అనుబంధంగా 423 చోట్ల గ్రామ సచివాలయాలు సేవలందిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఎక్కువ, మరికొన్ని గ్రామాల్లో తక్కువ మంది సిబ్బంది ఉన్నారు. అవసరం లేని చోట తగ్గించి ఆయా ప్రాంతాల్లో ప్రజలకు ఉత్తమ సేవలు అందించడానికి అదనంగా సిబ్బందిని నియమించనుంది. ఈ మేరకు క్షేత్రస్థాయి నుంచి సమాచారాన్ని సేకరించిన అధికారులు.. సిబ్బంది సర్దుబాటుకు కసరత్తు చేస్తున్నారు.

ఇకపై ఇద్దరు డిప్యూటీ ఎంపీడీవోలు

ప్రస్తుతం మండలానికి ఒక డిప్యూటీ ఎంపీడీవో(ఈవోపీర్డీ) ఉన్నారు. ఇకపై ఇద్దరు రానున్నారు. ఒకరు తాగునీరు, పారిశుద్ధ్యం, అభివృద్ధి పనులు పర్యవేక్షిస్తారు. మరొకరు గ్రామ సచివాలయాల నిర్వహణ వ్యవహారాలను చూస్తారు.

**మొత్తం నాలుగు గ్రేడ్లు:** పది వేల జనాభా/ ఏడాదికి రూ.కోటి లేదా అంతకంటే ఎక్కువ ఆదాయం ఉన్న ఆయా పంచాయతీలు ప్రత్యేక శ్రేణి(స్పెషల్ గ్రేడ్)గా పరిగణిస్తారు. కార్యదర్శి స్థానంలో డిప్యూటీ ఎంపీడీవోను పరిపాలనా అధికారిగా నియమిస్తారు. ఇటువంటివి జిల్లాలో 11 ఉన్నాయి. పురపాలక తరహాలో వీటిలో సేవలు అందిస్తారు. 4 వేలు- 10 వేల మంది జనం, సంవత్సరానికి రూ. 50 లక్షల రాబడి, అంతకంటే ఎక్కువగా ఉంటే గ్రేడ్-1గా ఎంపిక చేస్తారు. జిల్లాలో ఇలాంటివి 59 ఉన్నాయి. కార్యదర్శుల చేతికి పాలనా పగ్గాలు అప్పగిస్తారు. ఇక్కడ 20 మంది సిబ్బందిని నియమించే అవకాశం ఉంది.

2- 4 వేల మంది జనాభా ఉంటే గ్రేడ్-2గా చేశారు. జిల్లా వ్యాప్తంగా ఇటువంటివి 154 ఉన్నాయి. శ్రేణి-2లో మెరుగైన సేవలు అందించడానికి 12 మంది ఉద్యోగులను కేటాయిస్తారు.

జనాభా రెండు వేల లోపు ఉంటే గ్రేడ్-3గా పరిగణిస్తారు. ఇలాంటివి 227 చోట్ల ఏర్పాటు చేశారు. ఇక్కడ తొమ్మిది మంది సిబ్బంది సేవలు అందిస్తారు. గ్రేడ్-4, 5 విభాగాల్లో పనిచేస్తున్న కార్యదర్శులకు ఉద్యోగోన్నతి కల్పించి గ్రేడ్-3, 2కు బదిలీ చేస్తారు.

# పనులు పంచుకో.. ముడుపులు నంజుకో

కడప: వైకాపా హయాం నుంచి తంబళ్లపల్లెలో అరాచక పాలన సాగుతూనే ఉంది. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సైతం తెదేపాలో చేరిన వైకాపా కోవర్టుల కారణంగా పరిస్థితులు దారికి రావడంలేదు. ఈ అనైక్యతను ఆసరాగా తీసుకుని అధికారులు సైతం ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నారు. జలవనరులశాఖలో ఇంజినీరింగ్ అధికారులు నియోజకవర్గంలో గుత్తేదారుల అవతారం ఎత్తారు. వీరికి వైకాపా కోవర్టులు వత్తాసు పలకడంతో చెలరేగిపోతున్నారు. ఈ శాఖలో ఓ అధికారి తమ్ముడిని రంగంలోకి దింపి గుత్త పనులు చేపట్టారు. వీరికి నియోజకవర్గంలో ఇద్దరు తెదేపా నేతలు అండగా నిలిచి కమీషన్లు తీసుకుంటున్నారు.

రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా నియోజకవర్గంలో హోదాను ఓ తెదేపా నేత స్థానికంగా సృష్టించుకుని చెలామణి అవుతున్నారు. ఈయన వైకాపా కోవర్టులకు అండగా నిలుస్తున్నారనే ఆరోపణలున్నాయి. కురబలకోట మండల నేత వైకాపా వర్గీయులు చెప్పినట్లుగా వింటూ అరాచకాలు సాగిస్తున్నారు. వైకాపా కీలక నేతకు అత్యంత సన్నిహితంగా ఉంటూ పరోక్షంగా సహాయ సహకారాలు అందిస్తున్నారు. రెండు పార్టీల అండతో భూదందాలు సాగిస్తున్నారు. ఈ పరిణామాలను తెదేపా శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ ప్రభుత్వంలోనూ వైకాపా నేతల పనులన్నీ సవ్యంగా సాగుతున్నాయి. తెదేపా శ్రేణులు ఇప్పుడూ బాధితులుగానే ఉన్నారు.

ఇంజినీరింగ్ అధికారులదే హవా

జలవనరులశాఖలో ఇద్దరు ఇంజినీరింగ్ అధికారులు నియోజకవర్గాన్ని పంచుకున్నారు. కాంట్రాక్టు పనులన్నీ తమ అనుచరులకు కట్టబెట్టి పరోక్షంగా పనుల్లో భాగస్వామ్యులయ్యారు. ఓ అధికారి అయితే ఏకంగా తమ్మున్నే రంగంలోకి దింపారు. పనులు నాణ్యతా ప్రమాణాల మేరకు జరగడంలేదు. పర్యవేక్షించాల్సిన అధికారులే పనులు చేయడంతో నాణ్యత గురించి పట్టించుకునే పరిస్థితి లేకుండా పోయింది. పెద్దమండ్యం మండలం గుడిసివారిపల్లె చెరువు కట్ట రూ.50 లక్షలతో చేపట్టగా నాణ్యత లేకుండా పోయింది. ఈ తరహాలోనే చిన్నపాటి మట్టి పనులు మరో 22 వరకు తూతూమంత్రంగా చేపట్టి రూ.కోటి వరకు బిల్లులు చేసుకున్నారు. 2021లో నియోజకవర్గానికి వచ్చిన ఇంజినీరింగ్ అధికారి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కంపెనీ నిర్మించిన ముదివేడు రిజర్వాయర్‌లో అక్రమాలకు వత్తాసు పలికారనే ఆరోపణలున్నాయి. వైకాపాతో అంటకాగిన అధికారి ఇప్పుడూ చలామణి అవుతూ అక్రమాలు సాగిస్తున్నారు.

**నీరు- చెట్టు పనుల్లోనూ అక్రమాలు**

నీరు- చెట్టు కింద పెండింగ్ బిల్లులను కూటమి ప్రభుత్వం నియోజకవర్గానికి రూ.12 కోట్లు వరకు విడుదల చేసింది. పెండింగ్ బిల్లులను తాజాగానూ అప్‌లోడ్ చేసే వెసులుబాటు కల్పించడంతో ఇందులోనే అక్రమాలకు తెరదీశారు.

# మఠం సొమ్ము నొక్కేశారు!



అనంతపురం : ఉరవకొండ కేంద్రంగా ఉన్న కరిబసవస్వామి గవిమఠానికి ఏపీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో 770 శాఖ మఠాలు ఉన్నాయి. అయితే అక్కడి ఆస్తుల ద్వారా వచ్చే ఆదాయం మఠం ఖాతాకు పూర్తిగా చేరడం లేదు. కర్ణాటక రాష్ట్రం తుమకూరు పరిధిలోని వ్యాపార సముదాయాల నుంచి వచ్చే అద్దె సొమ్మును మఠం ఖాతాలో జమ చేయకుండా కొందరు పక్కదారి పట్టించారు. పీఠాధిపతి ఏజెంట్‌గా ఉన్న రాజన్న కనుసన్నల్లోనే అక్రమాలు జరిగినట్లు అధికారులు గుర్తించారు. చర్యలు తీసుకునేందుకు మాత్రం వెనకాడుతున్నారు.

**వివరాలు లేవు**తుమకూరు వ్యాపార సముదాయాలను ఎవరికి అద్దెకు ఇచ్చారనే వివరాలు సైతం మఠం అధికారుల వద్ద లేవు..ఉన్నతాధికారుల ఆదేశాలతో వాటిని పరిశీలించడానికి వెళ్లిన సిబ్బందిపై ఏజెంట్ రాజన్న మనుషులు దౌర్జన్యానికి దిగినట్లు సమాచారం. అసలు ఎన్ని గదులు నిర్మించారు, ఆ గదుల్ని అద్దెకిచ్చారా? లేదంటే అమ్మేసుకున్నారా? అనే అంశాలపై సందేహాలున్నాయి. తుమకూరులో జరిగిన అవకతవక లపై చర్యలు తీసుకోవాలని దేవాదాయశాఖ ఆర్‌జేసీ చంద్రశేఖర్ ఆజాద్ ఇక్కడి అధికారులను ఆదేశించారు. 9 ఏళ్లుగా తుమకూరులోని వ్యాపార సముదాయం ద్వారా రూ. 80 లక్షలు మాత్రమే అద్దె వచ్చినట్లు శాఖమఠం నుంచి వివరణ వచ్చినట్లు తెలుస్తోంది. ఆ మొత్తాన్ని రికవరీ చేయాలని లేదంటే క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఆర్‌జేసీ ఆదేశించారు. 5 నెలలు గడుస్తున్నా ఎలాంటి చర్యలు లేవు. **తొలగించి మళ్లీ తీసుకున్నారు** పీఠాధిపతికి అధికారిక ఏజెంట్‌గా ఉన్న రాజన్న కనుసన్నల్లో మఠం కార్యకలాపాలు సాగుతున్నాయి. గతంలోనూ ఆ ఏజెంట్ కర్ణాటక రాయచూర్‌లో విలువైన భూముల్ని జీపీఏ చేసుకుని ఇతరులకు అమ్మేశాడు. అప్పట్లో ఆయనను తొలగించారు. అయితే మళ్లీ ఆయన్నే ఏజెంట్ తీసుకోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం మఠానికి జమ చేయాల్సిన సొమ్మును చెల్లించడానికి ఏడాది సమయం కావాలని పీఠాధిపతి పేరుతో నోట్ తయారు చేయించినట్లు తెలుస్తోంది. అధికారులు ససేమిరా అనడంతో మౌనం వహించారు. గవిమఠం ఇన్‌ఛార్జి ఏసీ రాణిదృష్టికి తీసుకెళ్లగా వివరాలు చెప్పేందుకు నిరాకరించారు.

# అరటిని 'గెల'వలేక..



అనంతపురం : గతంలో ఎన్నడూలేని విధంగా అరటి రైతులు నష్టాలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. కనీసం పెట్టుబడి రాని దయనీయ దుస్థితి. పండించిన పంటకు మద్దతు ధర లేకుండా పోయింది. దిగుబడిని కొనేవారు కరవయ్యారు. గతంలో వ్యాపారులు పొలం వద్దకు వచ్చి తమకే అరటి గెలలు విక్రయించాలని ముందే డబ్బులు చెల్లించేవారు. ఇప్పుడు వ్యాపారుల వద్దకు వెళ్లి ఎంతో కొంత ఇచ్చి తీసుకోవాలని వేడుకున్నా ఫలితం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**మహారాష్ట్ర ప్రభావం**

జిల్లా నుంచి అరటి కొనుగోలు చేసి దిల్లీ మార్కెట్‌కు తరలిస్తే.. లారీకి రూ.1.20 లక్షల రవాణా ఛార్జీలు అవుతున్నాయి. రవాణాకు 4-5 రోజులు సమయం పడుతోంది. మహారాష్ట్ర నుంచి లారీ బాడుగ రూ.20 వేల నుంచి 30 వేలు అవుతుంది. ఒక రోజుకే దిల్లీకి సరకు చేరుతుంది. దీంతో వ్యాపారులు ఇక్కడికి రావడం లేదు. పైగా మహారాష్ట్రలో ఈసారి పంట సాగు బాగా పెరిగింది. జిల్లాలో సుమారు 38 కంపెనీలు అరటిని కొనుగోలు చేస్తున్నాయి. టన్ను రూ.12 వేలతో కంపెనీలు అన్ని కలిసి 9 వేల టన్నులే కొనుగోలు చేస్తున్నట్లు ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు.


**మార్కెట్‌లో డజను రూ.40**

స్థానికంగా కొందరు రైతుల నుంచి కిలో రూ.8 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. తిరిగి వారు వ్యాపారులకు కిలో రూ.14-15 చొప్పున అమ్ముతున్నారు. బహిరంగ మార్కెట్లో మాత్రం డజను రూ.30-40 చొప్పున వినియోగదారులకు విక్రయిస్తుండటం గమనార్హం. ప్రధానంగా శీతల గిడ్డంగులు అందుబాటులో లేకనే ఈ పరిస్థితి నెలకొంది. దీనికితోడు గెల మొత్తం ఒకేసారి పండ్లుగా మారకపోవడంతో సమస్యగా మారింది.

**జిల్లాలో ఇలా..**

సాగు విస్తీర్ణం: 15 వేల హెక్టార్లు
హెక్టారులో పెట్టుబడి వ్యయం: రూ.2.72 లక్షలు
ప్రస్తుతం కోత వచ్చింది: 11,500 హెక్టార్లలో
దిగుబడి అంచనా: హెక్టార్‌కు 160.55 టన్నులు
ప్రస్తుతం టన్ను ధర: రూ.4 వేలు నుంచి 5 వేలు

# చింత.. రైతుకేదీ నిశ్చింత



హిందూపురం : రుచి, శుచికి హిందూపురం ప్రాంత చింతపండు ప్రసిద్ధి. పొలాల గట్లపై, తోటల్లో 5, 6 దశాబ్దాల వయసున్న లక్షల చింతచెట్లు ఉన్నాయి. రైతుల పాలిట కల్పవృక్షాలే అయినా ప్రాసెసింగ్ యూనిట్లు లేక అనుకున్నంత లాభాలు గడించడం లేదు. కరోనా కాలం నుంచి ఎగుమతులు ఆగిపోవటంతో రైతులకు గిట్టుబాటు ధర లభించటం లేదు. సీజన్‌లో తగిన ధర లేక రైతులు, పండును కొనుగోలు చేసి నెలల తరబడి శీతల గిడ్డంగుల్లో నిల్వ చేసిన వ్యాపారులు అవస్థలు పడుతున్నారు.

**ఉత్తరాది పండుకు మొగ్గు**

గతేడాది పంట దిగుబడి లేక ఫ్లవర్ రకం క్వింటాలు రూ.8వేల నుంచి 12వేలు, కరిపులి రూ.12వేల నుంచి 16వేలు, బోటు రకం రూ.3 నుంచి 4 వేలు పలికాయి. ఇక్కడ ధరలు అధికంగా ఉన్నాయని దేశీయంగా టోకు వ్యాపారులు పండు కొనుగోలుకు ముందుకు రావడం లేదు. దీంతో శీతల గిడ్డంగుల్లో సరకు నిల్వ ఉంటోంది. ఉత్తరాదిలో పండిన కట్టెరకం పండు క్వింటాలు రూ.5వేలు పలుకుతుండటంతో అక్కడ కొనుగోలుకు వారు ఆసక్తి చూపుతున్నారు. మరో మూడు మాసాల్లో కొత్తపంట మార్కెట్కు వస్తుంది. పెరిగిన పెట్టుబడి వ్యయంతో గిట్టుబాటు ధర లభిస్తుందా లేదా అని రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

**ప్రాసెసింగ్ యూనిట్లు అవసరం**

చింతపండు: గుజ్జు, ఆహార పదార్థాల తయారీ యూనిట్లకు ప్రోత్సాహం
అవసరంపిచ్చులతో: రంగులు, గంజి, మస్కిటోకాయిల్స్, వస్త్రపరిశ్రమ, పసుపుకుంకుమ, జనపనార పరిశ్రమలను అందుబాటులోకి తీసుకురావాలి వ్యవసాయ మార్కెట్: హిందూపురం
గత ఆర్థిక సంవత్సరంలో మార్కెట్కు వచ్చిన చింతపండు: 85,579 క్వింటాళ్లుసరకు విలువ: రూ.80 కోట్లు
చింతపిక్కలు: 7వేల నుంచి 8వేల టన్నులు
గిడ్డంగుల్లో నిల్వలు: 5వేల టన్నులు

## గుత్తి దవాఖానా @ 145

గుత్తిలోని కమ్యూనిటీ వైద్యశాల రోగుల సేవలో 145 ఏళ్లుగా తరిస్తోంది. బ్రిటిష్ పాలనలో ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తూ 1880లో లోకల్‌ఫండ్ సహకారంతో చిన్న డిస్పెన్సరీని ఏర్పాటు చేశారు. అప్పట్లో 10 పడకలతో ప్రారంభమైంది. జిల్లాలో ఇదొక్కటే ఉండేది. అప్పట్లో ఒక వైద్యుడే సేవలందించారు. దత్తమండలాల కలెక్టర్ సర్‌థామస్ మన్రో పేరుతో మెడికల్ డిస్పెన్సరీ 1925లో ఆసుపత్రిగా రూపాంతరం చెందింది. ఇద్దరు వైద్యులను నియమించారు. 1964లో ప్రభుత్వ ఆధీనంలోకి తెచ్చి 30 పడకలను ఏర్పాటు చేశారు. ఇప్పుడు 52 పడకలతో వైద్యవిధాన పరిషత్తు ఆసుపత్రిగా కొనసాగుతోంది. ఒకప్పుడు ఒకే వైద్యుడితో మొదలైన డిస్పెన్సరీ ఇప్పుడు తొమ్మిది మంది వైద్యులతో నడుస్తోంది. అనంతపురం, కర్నూలు జిల్లాల సరిహద్దు గ్రామాల నుంచి వందల సంఖ్యలో రోగులు బ్రిటిష్ హయాం నుంచి వైద్యం కోసం వస్తున్నారు. ఆసుపత్రిని వంద పడకల ఏరియా అసుపత్రిగా మార్చాలన్న ప్రతిపాదనలు ఉన్నాయి. సీమ జిల్లాల్లోనే ఇది అత్యంత పురాతన ఆసుపత్రి కావడం విశేషం.

# పనుల్లేక.. పస్తులుండలేక

నాగలాపురం : వలసల నివారణకు కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని అమలుచేస్తుండటంతో మన రాష్ట్రంలో వలసల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. కానీ పశ్చిమబంగ నుంచి వలసలు పెరుగుతూనే ఉన్నాయి. మూడు సంవత్సరాలుగా జిల్లాలో వరినాట్లకు ఇతర రాష్ట్ర కూలీలే స్థానిక రైతులకు ఆసరాగా నిలుస్తున్నారు.

**వరినాట్లలో వారిదే జోరు..**

పశ్చిమబెంగాల్ నుంచి వచ్చిన 10 మంది కూలీలు ఒక రోజులో రెండున్నర ఎకరాల మేరా నారు పీకి, నాటే పనిని పూర్తిచేస్తున్నారు. ఈ పనికిగానూ ఎకరాకు కాంట్రాక్ట్ పద్ధతిలో రూ.4,500, రూ.600 విలువచేసే బియ్యాన్ని ఇవ్వాల్సి ఉంటుంది. ఇదే పనిని స్థానిక కూలీలతో చేయించాలంటే భోజనం ఖర్చులతో కలిపి రూ.7,450 అవుతోంది. దీంతో రూ.2,350 ఆదా అవుతుండటంతో బెంగాలీ కూలీల జోరు కొనసాగుతోంది.

**అక్కడ పనులు లేక..** - భీమోల్, వ్యవసాయ కూలీ, మహాపూర్ గ్రామం, పశ్చిమబంగ రాష్ట్రం

మా ప్రాంతంలో పనులు లేక ఏజెంట్ల సూచనలతో 80 మంది వరకు



నాగలాపురం మండలానికి వచ్చాం. బెంగాల్‌లోని మా జిల్లాలో తక్కువ విస్తీర్ణంలో వరి సాగవుతుండటంతో అక్కడ పనులు త్వరగా పూర్తైపోతాయి. ఖాళీగా ఉండలేక ఆంధ్రా, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ తదితర రాష్ట్రాలకు వెళ్లి పనులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నాం.

**ఒకే రోజులో.. మూడు ఎకరాలు-** దామునాయుడు, రైతు, జంబుకేశవపురం గ్రామం, నాగలాపురం మండలం.

గతేడాది మా ప్రాంతానికి వచ్చిన బెంగాలీ కూలీలు తక్కువ మొత్తానికే పని చేయటంతో పాటు వేగంగా పనులు పూర్తవుతుండటంతో ఈ దఫా వారిని పిలిపించాను. మూడు ఎకరాల పొలంలో ఒకే రోజులో వరినాట్లు పూర్తిచేశారు

# హైవేగం

నంద్యాల : ఉమ్మడి కర్నూలు జిల్లా మీదుగా వెళ్లే 44వ నంబరు జాతీయ రహదారి (బెంగళూరు-హైదరాబాద్) నిర్వహణ అధ్వానంగా మారింది. ఉమ్మడి జిల్లాలో ఈ రహదారి 84 కి.మీ. పొడవునా ఉంది. సగటున రోజుకు 150కిపైగా ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు, 300కుపైగా ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. చాలా ప్రాంతాల్లో గుంతలు పడ్డాయి. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం ప్రమాదం జరిగిన ప్రాంతానికి 10 కి.మీ. దూరంలో 2021 ఫిబ్రవరి 14న జరిగిన రోడ్డు ప్రమాదంలో 14 మంది మదనపల్లివాసులు మృతి చెందారు. ప్రమాదాలు జరిగిన సమయంలో అధికారులు హడావుడి చేయడం.. ఆ తర్వాత పట్టించుకోకపోవడం షరా మామూలైంది.

**డ్రైవరు నిర్లక్ష్యంతో..**

2019, మే 11న బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంతో జరిగిన రహదారి ప్రమాదంలో 16 మంది మృత్యువాత పడ్డారు. ఏడాది కిందట డోన్ రూరల్ పోలీసుస్టేషన్ సమీపంలో ఓ ప్రైవేటు బస్సు 140 కి.మీ. వేగంతో వెళుతూ డివైడర్‌ను ఢీకొని అవతలి వైపు ఉన్న లారీపైకి దూసుకెళ్లింది. లారీలో ఉన్నవారు గాయపడగా.. బస్సు డ్రైవరు అక్కడికక్కడే మృతి చెందారు.

**140 కి.మీ.కు పైగా..**

బెంగళూరు-హైదరాబాద్ జాతీయ రహదారిపై గంటకు 110 కి.మీ. వేగంతో మాత్రమే బస్సులు వెళ్లాలి. ప్రైవేట్ బస్సులు 140 కి.మీ.కు పైగా వేగంగా దూసుకెళ్తున్నాయి. రాత్రివేళలో ట్రాఫిక్ తక్కువగా ఉండడం.. త్వరగా గమ్యస్థానానికి చేరాలన్న ఆతృతతో మితిమీరిన వేగంతో వెళుతున్నాయి. మరోవైపు ప్రైవేటు బస్సులు పర్మిట్లు లేకున్నా రాకపోకలు సాగిస్తున్నాయి.

**బ్లాక్ స్పాట్లు ఇవే..**

బెంగళూరు-హైదరాబాద్ జాతీయ రహదారిపై దత్తాత్రేయస్వామి ఆలయం, డోన్ రూరల్ పోలీసుస్టేషన్, దొరపల్లి బ్రిడ్జి, యు.కొత్తపల్లి క్రాస్‌రోడ్డు, ఓబులాపురం మెట్ట, క్రాస్ రోడ్డు, దేవరబండ, వెల్దుర్తి సమీపంలోని ఆంజనేయస్వామి విగ్రహం వద్ద బ్లాక్ స్పాట్లు ఉన్నాయి.

**స్పీడ్‌గన్లు.. సూచికలు కరవు**

రెండేళ్ల కిందటివరకు ఈ మార్గంలో స్పీడ్‌గన్స్ ఉండేవి. ఆ తర్వాత దీనిపై అధికారులు దృష్టి సారించలేదు. ఆర్టీఏ, పోలీసు అధికారులు పట్టించుకోవడం లేదు. జాతీయ రహదారి నిర్వహణ అధికారులు సైతం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో ప్రైవేటు వాహనాల వేగం మితిమీరింది. ప్రమాదకర మలుపులు, బ్లాక్‌స్పాట్ల వద్ద సూచికలు లేవు. రహదారిపై ఎక్కడా మొబైల్ పెట్రోలింగ్ కనిపించడం లేదు. హైవే అంబులెన్సులు అందుబాటులో లేకపోవడంతో క్షతగాత్రులను ఆసుపత్రులకు తీసుకెళ్లే పరిస్థితి లేకుండా పోయింది.

**గతంలో జరిగిన భారీ ప్రమాదాలు**

2019 మే 11న సైతం ఎస్‌ఆర్‌ఎస్ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బైక్‌ను తప్పించబోయి ఉన్నపళంగా ఓ వైపు తిప్పడంతో.. ఎదురుగా వస్తున్న క్రూజర్ వాహనాన్ని ఢీకొట్టింది. పెళ్లి నిశ్చయం చేసుకుని వెళ్తున్న తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వడ్డేపల్లి మండలం రామాపురం గ్రామానికి చెందిన 15 మంది, వెల్దుర్తికి చెందిన ఒకరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.

2021 ఫిబ్రవరి 14న తెల్లవారుజామున మదార్‌పురం గ్రామ సమీపంలోని ఉపరితల వంతెనపై క్రూజర్ వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో అక్కడికక్కడే సుమారు 12 మంది ప్రాణాలు కోల్పోయారు.

**నియంత్రణ లేని అతివేగం**

2019, 2021 సంవత్సరాల్లో వెల్దుర్తి, మదార్‌పురం గ్రామాల సమీపంలో జరిగిన ప్రమాదాలు సైతం అతివేగాన్ని నియంత్రించకపోవడంతో సంభవించాయి. ఎస్‌ఆర్‌ఎస్ ట్రావెల్స్ బస్సు వెల్దుర్తి కూడలి వద్ద అతివేగంగా వస్తూ ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి ఎదురుగా వస్తున్న క్రూజర్‌ను ఢీకొంది. మదార్‌పురం సమీపంలో సైతం వాహనం అదుపుతప్పి బోల్తా పడటంతో 12 మంది ప్రాణాలు వదిలారు.




## జెలో 168క్యారెట్ల నెక్లెస్ డిజైన్‌కి 1800 గంటలు

భారతీయ సంస్కృతి - సాంప్రదాయం విలువ ఎంతో అంతర్జాతీయ సెలబ్రిటీలు కూడా తెలుసుకుంటున్నారు. మన దేశంలోని కుభేరుల పెళ్లిళ్లలో ప్రదర్శనల కోసం వచ్చినప్పుడు కనీసం 4 రోజుల నుంచి 7రోజుల వరకూ ఇక్కడే ఉండి, భారతీయ వెడ్డింగ్ కల్చర్ గురించి తెలుసుకుని, పెళ్లిలో ప్రదర్శనలతో అలరించి మరీ వెళుతున్నారు. వెళ్లేప్పుడు భారీగా ప్యాకేజీలు కూడా అందుకుంటున్నారు. ఇదే కేటగిరీలో ఇంతకుముందు రిహానా, మొన్నటికి మొన్న జెన్నిఫర్ లోపెజ్ వంటి అంతర్జాతీయ పాప్ గాయనీమణులు తమ ప్రదర్శనలతో రక్తి కట్టించారు. అలాగే అమెరికన్ షోలతో పాపులరైన కిమ్ కర్ధాషియన్-కోలీ కర్ధాషియన్ లాంటి అందగత్తెలు కూడా అంబానీల ఈవెంట్లలో మెరిసారు. కొన్ని దశాబ్ధాలుగా ఈ కల్చర్ ఇలానే కొనసాగుతోంది. భారతదేశంలోని ప్రముఖుల ఇళ్లలో వేడుకల్లో నృత్యం చేసేందుకు అంతర్జాతీయ పాప్ స్టార్లు ఆసక్తిని కనబరచడం ఎప్పుడూ చర్చనీయాంశమే. ఇటీవలే తెలుగమ్మాయి, ఎన్నారై నేత్ర మంతెన - వంశీ గాదిరాజు పెళ్లిలో మరో ప్రముఖ పాప్ స్టార్ జెన్నిఫర్



లోపేజ్ చేసిన సందడి అంతా ఇంతా కాదు. jloగా సుప్రసిద్ధురాలైన ఈ గాయని ఇటీవల భారతదేశాన్ని సందర్శించినప్పుడు ఇనాయ బ్లష్ - ఎంఎం శారీలో హృదయాలను గెలుచుకుంది. ఈ చీర కోసం ఉపయోగించిన డిజైనర్ వర్క్ నిజంగా ఆశ్చర్యపరుస్తోంది. స్ఫటికాలతో అలంకరించిన కట్ వర్క్ పల్లు ప్రత్యేక ఆకర్షణ. ఈ డిజైన్ మనీష్ మల్హోత్రా సిగ్నేచర్ లుక్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. రాజవంశపు మహారాణిలా ఖరీదైన నెక్లెస్‌తో లుక్ ఎంతో వైబ్రేంట్‌గా కనిపిస్తోంది. జెలో లుక్ కి తగ్గ ఆభరణాన్ని ఎంపిక చేసుకుంది. భారతీయ మహారాణిలోని ఔన్నత్యాన్ని ప్రతిబింబించేలా అందమైన పచ్చల ఆభరణం ప్రత్యేక ఆకర్షణగా మారింది. ఈ ఆభరణంలో రంగు రాళ్లు చాలా ప్రత్యేకతతో ఆకట్టుకున్నాయి. 168 క్యారెట్లకు పైగా పచ్చలతో.. దాదాపు 1,800 గంటలకు పైగా సమయం తీసుకుని రూపొందించిన ఈ షో పీస్ మనీష్ మల్హోత్రా జువెలరీ బ్రాండ్ నుంచి ఎంపిక చేసుకున్న స్పెషల్ పీస్. రెండు విభిన్నమైన ఆకుపచ్చ రంగులతో.. చెవిపోగులు, సిగ్నేచర్ పామ్ కఫ్‌లు, డైమండ్ బ్యాంగిల్, ఉంగరంతో మహారాణినే తలపిస్తోంది జెలో.

## సినిమాల్లో ఆడవాళ్లను ఆట వస్తువులుగా!

మారుతున్న ప్రపంచంలో మహిళల ప్రవర్తనలో చాలా మార్పులొచ్చాయి. పెరిగిన విద్య, సామాజిక జ్ఞానం, ఆర్థిక స్వేచ్ఛ కారణంగా స్త్రీలు ఇప్పుడు పురుషుల కంటే చాలా ఎక్కువ. స్త్రీ ఆకాశం ఎత్తు. అసలు మహిళ సాధించనిది లేనే లేదు. అంతరి క్షంలోకి కూడా ప్రయాణించగలదు. అయితే బాగా ఎదిగిన లేదా ప్రగతిశీల మహిళను పురుషాహంకారులు చూసే విధానం వేరు. ధైర్యంగా ప్రశ్నిస్తే లేదా ఎదురిస్తే ఆ మహిళను అహంకారి అని, దుర్మార్గురాలు అని ముద్ర వేస్తారు. కళారంగంలోనూ కథానాయికలను మారుతున్న వివిధ దశలలో రకరకాల కోణాల్లో ఆవిష్కరించారు.

**మహిళా పాత్రాల్లో ఎన్నో మార్పులు:** ప్రతి దశాబ్ధానికొకసారి మహిళా పాత్రల చిత్రణ పూర్తిగా మారిపోయింది. ఒకప్పుడు సెలిగా, టూమచ్ బోల్డ్‌గా కూడా చూపించారు. కొన్నిసార్లు వ్యాంపులుగా, ఐటమ్ గాళ్స్‌గా కూడా చూపించారు. 90లలో స్త్రీ పాత్రలకు గ్లామర్ ఎక్కువగా అద్దారు. వ్యాంప్ పాత్రలు కూడా అప్పట్లో ఎక్కువ. కానీ కాలక్రమంలో చాలా మారింది. పొగ తాగే లేదా మద్యానికి బానిసైన స్త్రీని కూడా 2000 -2010 మధ్యలో చూపించారు. పార్టీలో నైట్ క్లబ్ లలో కనిపించే స్త్రీ పాత్రలను నాటి దర్శక రచయితలు రాసుకు నేవారు. అయితే ఇటీవలి కాలంలో నాయికా ప్రధాన చిత్రాలు పెరిగాయి.



**రాశీఖన్నా ఇవి గుర్తించలేదా:** కథానాయికల రేంజ్ పెరిగింది. అనుష్కశెట్టి, నయనతార, కీర్తి సురేష్, సమంత, రష్మికా మందన్నా దక్షిణాదిలో ఏ స్థాయికిచేరారన్నది చెప్పాల్సిన పనిలేదు. దీపిక పదుకొణే, ఆలియా భట్, కత్రినా కైఫ్ వంటి నటీమణులు స్పై ఏజెంట్లుగా, పోలీస్ అధికారులగా నటించి మేల్ పాత్రలతో పోటీపడుతున్నారు. ఇదంతా కళారంగంలో మహిళా నటీమణుల సాధించిన పురోగతిగానే చెప్పాలి. ఇంకా ముందుకెళ్తే మేల్ పాత్రలకు ధీటుగా ఛాన్స్ వచ్చినప్పుడల్లా సత్తా చాటుతున్నారు. మరి ఇవన్నీ నటి రాశీఖన్నా గమనించిందో? లేదో తెలియదు గానీ..

**ఇదేం వివక్ష అంటోన్న నటి:** తాజాగా సినిమాల్లో ఆడవాళ్లను ఆట వస్తువుల్లా చూపిస్తున్నారని ఆరోపించింది. ఈ వివక్ష చాలా కాలంగా కొనసాగుతుందని అభిప్రాయపడింది. అన్ని చిత్ర పరిశ్ర మల్లోనూ నటీమణుల పరిస్థితి ఇలాగే ఉందంది. మహిళా పాత్రలు ఇంకా తాను అనుకున్న స్థాయిలో రావడం లేదంది. భవిష్యత్తులోనైనా మార్పులొస్తాయేమోనని ఎదురు చూస్తానంది. చాలా మంది నటీమణులు దీన్నో సమస్యగా భావిస్తున్నట్లు పేర్కొంది. గతంలో రీచా చద్దా కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేసింది. ప్రస్తుతం రాశీఖ న్నా హిందీలో బ్రిడ్జ్, తాల్కోన్ మెయిన్ ఏక్ చిత్రాల్లో నటిస్తోంది. అలాగే కొన్నికొత్త కథలు కూడా విందని..వాటికి త్వరలోనే సైన్ చేస్తుందని సమాచారం.

## రావిపూడి - వెంకీ.. మరో క్రేజీ ప్రాజెక్టు



టాలీవుడ్ సీనియర్ హీరో విక్టరీ వెంకటేష్ లీడ్ రోల్ లో ఇటీవల నటించిన చిత్రం సంక్రాంతికి వస్తున్నాం. సక్సెస్ ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన ఆ సినిమాను శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ పై ప్రముఖ నిర్మాత దిల్ రాజు నిర్మించారు. ఐశ్వర్య రాజేష్, మీనాక్షి చౌదరి హీరోయిన్స్ గా నటించగా.. ఈ ఏడాది సంక్రాంతికి మూవీ ప్రేక్షకుల ముందుకు వచ్చింది. రిలీజ్ కు ముందే సినిమాపై ఆడియన్స్ లో భారీ అంచనాలు క్రియేట్ అవ్వగా.. వాటిని అందుకుని అదరగొట్టింది. ఫ్యామిలీ ఆడియన్స్ తోపాటు మాస్ మూవీ లవర్స్ ను ఆకట్టుకుని.. ఫస్ట్ షో నుంచి పాజిటివ్ టాక్ తో దూసుకుపోయింది. బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లను సాధించింది. వరల్డ్ వైడ్ గా దాదాపు రూ.300 కోట్లకు పైగా కలెక్షన్స్ ను సాధించింది. వెంకటేష్ కెరీర్ లోనే అత్యధిక కలెక్షన్స్ సాధించిన సినిమాగా రికార్డులకెక్కింది. అయితే సంక్రాంతికి వస్తున్నాం మూవీకి సీక్వెల్ ఉంటుందని ఇప్పటికే మేకర్స్ అనౌన్స్ చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆ సీక్వెల్ మూవీకి సంబంధించి ఇంట్రెస్టింగ్ అప్డేట్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఇప్పుడు వస్తున్న సమాచారం ప్రకారం.. బ్లాక్ బస్టర్ సినిమాకు రెండో భాగాన్ని తెరకెక్కించేందుకు నిర్మాత దిల్ రాజు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆ ప్రాజెక్ట్ చర్చల దశలో ఉందని వినికిడి. అనిల్ రావిపూడితో సీక్వెల్ కు సంబంధించి ఇటీవల చర్చలను దిల్ రాజు ప్రారంభించారని టాక్ వినిపిస్తోంది. వచ్చే ఏడాది సెకండ్ హాఫ్ లో సంక్రాంతికి వస్తున్నాం మూవీ సీక్వెల్ షూటింగ్ ను మొదలు పెట్టనున్నారని తెలుస్తోంది. 2027 సంక్రాంతికి విడుదల చేయాలనే టార్గెట్ తో షూటింగ్ చేయనున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. అయితే ఇప్పుడు ఇటు అనిల్ రావిపూడి.. అటు వెంకటేష్.. తమ తమ సినిమాలతో బిజీగా ఉన్నారు. ప్రస్తుతం రావిపూడి.. మన శంకర వరప్రసాద్ గారు మూవీని తెరకెక్కిస్తున్నారు. వచ్చే సంక్రాంతికి ఆ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. అదే సమయంలో వెంకటేష్.. మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో ఫ్యామిలీ ఎంటర్టైనర్ లో నటిస్తున్నారు. ఇప్పుడు ఆ సినిమా పూర్తి అయిన వెంటనే సంక్రాంతికి వస్తున్నాం సీక్వెల్ కు సంబంధించిన పనులు.. స్టార్ట్ అవ్వనున్నట్లు సమాచారం. అయితే సంక్రాంతికి వస్తున్నాం సీక్వెల్ ను దిల్ రాజుతోపాటు దగ్గుబాటి సురేష్ బాబు కూడా నిర్మాణ భాగస్వామిగా ఉండనున్నారని తెలుస్తోంది. అయితే సీక్వెల్ పై ఇప్పటికే ఆడియన్స్ లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

## ఆ విషయంలో పోటీ పడుతున్న చిరు, చరణ్..!




ఈ మధ్య కాలంలో సినిమాలకు బజ్ క్రియేట్ చేయడంలో పాటలు ముఖ్య పాత్రను పోషిస్తున్నాయి. అందుకే సినిమా విడుదలకు కొన్ని నెలల ముందు నుంచే పాటలను ఒకొక్కటిగా విడుదల చేయడం మనం చూస్తూ ఉన్నాం. పాటలను విడుదల చేస్తూ సినిమాకు బజ్ క్రియేట్ చేయడంలో ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఒక పాట హిట్ అయితే సినిమాకు మంచి ఓపెనింగ్స్ వస్తాయి. గతంలో పలు సందర్భాల్లో ఈ విషయం నిరూపితం అయ్యింది. సినిమా ఫలితంతో సంబంధం లేకుండా మినిమం బజ్ క్రియేట్ కావడంతో మంచి ఓపెనింగ్స్ దక్కించుకున్న సినిమాలు చాలానే ఉన్నాయి. అందుకే మొదటి సింగిల్, రెండో సింగిల్ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ మధ్య కాలంలో వచ్చిన మీసాల పిల్ల, చికిరి సాంగ్స్ ఆయా సినిమాలపై అంచనాలు ఏ స్థాయిలో పెంచాయో మనం చూస్తూనే ఉన్నాం.

**చిరంజీవి మన శంకరవర ప్రసాద్ గారు...** మెగాస్టార్ చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందుతున్న మన శంకరవర ప్రసాద్ గారు సినిమా 2026 సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెల్సిందే. సినిమాకు దాదాపుగా అయిదు వారాల సమయం ఉంది. ఇప్పటికే సినిమాకు పాజిటివ్ బజ్ క్రియేట్ అయింది. అందుకు కారణం మీసాల పిల్ల అనడంలో ఎలాంటి సందేహం లేదు. మీసాల పిల్ల భారీ విజయాన్ని సొంతం చేసుకోవడంతో సినిమాను చూడాలని కోరుకుంటున్న వారి సంఖ్య పెరిగింది. దాదాపు రెండు నెలల క్రితం వచ్చిన మీసాల పిల్ల పాటకు అప్పుడే యూట్యూబ్ ద్వారా ఏకంగా 77 మిలియన్ వ్యూస్ నమోదు అయ్యాయి. వేలాది మంది ఈ పాటకు రీల్స్ చేయడం కూడా జరిగింది. దాంతో పాట గత రెండు నెలలుగా వైరల్ అవుతూనే ఉంది. ఎక్కడో ఒక చోట ఈ పాట వినిపిస్తూనే ఉంది. ఈ సినిమాకు భీమ్స్ సిసిరియోల్ సంగీతాన్ని అందిస్తున్న విషయం తెల్సిందే.

**రామ్ చరణ్ పెద్ది సినిమా చికిరి...** ఇక ఈ మధ్య కాలంలో ప్రముఖంగా వినిపిస్తున్న పాటల్లో చికిరి ఒకటి. మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో రూపొందుతున్న పెద్ది సినిమా నుంచి వచ్చిన మొదటి సింగిల్ చికిరి కి ఓ రేంజ్‌లో పాజిటివ్ రెస్పాన్స్ దక్కింది. సినిమాలో చరణ్ ఎలా ఉండబోతున్నాడు, హీరోయిన్ జాన్వీ కపూర్‌ను ఎలా చూపించబోతున్నారు అనే విషయాలను చూపిస్తూ చరణ్ డాన్స్ మూవ్స్ ను అద్భుతంగా చూపించడంతో పాటకు మంచి స్పందన వచ్చింది. యూట్యూబ్‌లో ఈ పాట విడుదలై కేవలం నెల రోజులు అయింది. ఇంకా చెప్పాలంటే నెల రోజులకు రెండు మూడు రోజులు తక్కువే అయింది. అయినా ఇప్పటికే పాట ఏకంగా 84 మిలియన్‌ల వ్యూస్‌ను దక్కించుకుంది. యూట్యూబ్ లో ఈ పాట సాధిస్తున్న వ్యూస్ ను చూసి అంతా షాక్ అవుతున్నారు. అదే సమయంలో సినిమాకు బజ్ విపరీతంగా పెరుగుతోంది.

**మీసాల పిల్ల వర్సెస్ చికిరి సాంగ్...** ఇతర సినిమాల పాటలు ఈ రెండు సినిమాల పాటలకు ఆమడ దూరంలో ఉన్నాయి. మూడో స్థానంలో రాజాసాబ్ సినిమా నుంచి వచ్చిన రెబల్ సాబ్ పాట ఉంది. ఆ పాటకు యూట్యూబ్‌లో ఇప్పటి వరకు 20 మిలియన్‌ల వ్యూస్ నమోదు అయ్యాయి. మొన్నటి వరకు టాప్ లో ఉన్న మీసాల పిల్ల పాటను చికిరి సాంగ్ వచ్చి రెండో స్థానంకు నెట్టి వేసింది. తక్కువ సమయంలోనే చికిరి సాంగ్ మీసాల పిల్ల రికార్డ్ వ్యూస్ ను బ్రేక్ చేయడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఏఆర్ రెహమాన్ సంగీత సారధ్యంలో వచ్చిన చికిరి సాంగ్ కి యూత్ లో మంచి స్పందన దక్కింది. అందుకే ఎక్కడ చూసినా, ఎక్కడ విన్నా చికిరి అంటూ స్టెప్స్ వేస్తున్నారు. యూట్యూబ్‌లో చికిరి, మీసాల పిల్ల పాటలు పోటీ పడుతున్నాయి. చిరు మూవీ సంక్రాంతికి రానుండగా, పెద్ది సినిమా మాత్రం సమ్మర్ ప్రారంభంలో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. మరి ఈ రెండు సినిమాలు వసూళ్ల విషయంలో పోటీ పడుతాయా అనేది చూడాలి.

## అదృష్టం అంటే ఈ తెలుగమ్మాయిదే!

కొందరికి సినిమా అవకాశాలు అన్నవి అనుకోకుండా వస్తాయి. కెరీర్ ప్లానింగ్ లో సినిమా లేకపోయినా? అనూహ్యంగా వచ్చిన అవకాశాలతో ఈ రంగంలో స్థిరపడిన వారు చాలా మంది ఉన్నారు. నటుడు రాహుల్ రామకృష ఇండస్ట్రీలో ఎలాంటి ప్రయత్నాలు చేయకుండానే సక్సెస్ అయ్యాడు. టాలీవుడ్ లో స్థిరపడ్డాడు. అర్జున్ రెడ్డి చిత్రం అతడి జీవితాన్నే మార్చేసింది. ఇంకా ఇలాంటి వాళ్లు చాలా మంది ఉన్నారు. తెలుగు అమ్మాయి శివానీ నాగరం కదూఆ అలాగే క్లిక్ అయినట్లు తెలిపింది. శివానీ సినిమాల్లోకి రావాలని ముందెప్పుడు అనుకోలేదంది. ఓ షార్ట్ ఫిల్మ్ కోసం తొలిసారి కెమెరా ముందుకొచ్చింది. ఆ గుర్తింపు తోనే సినిమా అనే థాట్ మనసులో మొదలింది. అటుపై అంబాజీ పేట మ్యారేజ్ బ్యాండ్ లో ఛాన్స్ అందుకుంది. ఆ చిత్ర దర్శక, నిర్మాతలు యూ ట్యూబ్ లో చూసి అమ్మడిని అప్రోచ్ అవ్వడం..పాత్రకు సెట్ అవుతుందని భావించి



ఎంపిక చేసారు. తొలి సినిమా షూటింగ్ సమయం లో చాలా టెన్షన్ పడింది. కానీ ఇప్పుడా టెన్షన్ పోయి నటిగా ధైర్యంగా పని చేస్తోంది. ఆ తర్వాత నటించిన లిటిల్ హార్ట్స్ కూడా మంచి విజయం అందుకుంది. ప్రస్తుతం కొత్త అవకాశాలు బాగానే వస్తున్నాయి. ఈ నేపథ్యంలో కాలమే తనని స్టార్ గా మార్చిందని..తనని తాను ఎప్పుడూ అలా ఊహించుకోలేదంది శివానీ. తాను నటిని అయినా బ్యూటీ విషయంలో చాలా సింపుల్ గా ఉంటానంది. చర్మ సంరక్షణ కోసం క్రీములు వాటికి దూరంగా ఉంటానంది. వీలైనంత వరకూ నేచురల్ గా కనిపించడానికి ఇష్టపడతానంది. శరీరానికి కావాల్సినన్నీ నీళ్లు మాత్రం క్రమం తప్పకుండా తాగుతానంది. రాత్రి సమయంలో మాత్రం మాయిశ్చరైజర్ తప్పనిసరిగా వాడుతానంది. వారానికి ఒకసారి చర్మానికి పెసరడిండి మాత్రం రాస్తానంది. ఇక టాలీవుడ్ లో నటీమణుల మధ్య ఎలాంటి కాంపిటీషన్ ఉందన్నది తెలిసిందే. ఒక్క ఛాన్స్ కోసం ఎంతో మంది క్యూలో ఉన్నారు. స్థానిక భామలతో పాటు ముంబై, చెన్నై, కేరళ, బెంగుళూరు ప్రాంతాల నుంచి దిగుమతి అవుతోన్న వారి సంఖ్య అంతకంతకు కనిపిస్తోంది. సాధారణంగా తెలుగు హీరోయిన్లకు అవకాశాలివ్వడానికి దర్శక, నిర్మాతలు కూడా ముందుకు రారు. స్థానిక నటులతో కొన్ని రకాల సమస్యలు ఉత్పన్నమవుతాయని భయం కూడా ఓ కారణం.

వాటన్నింటిని బ్రేక్ చేసి శివానీ ఛాన్సులు అందుకుంటుంది. ఇంత వరకూ గ్లామర్ పాత్రల్లో నటించలేదు. మరి ఆ తరహా పాత్రల విషయంలో శివానీ ఎలా స్పందిస్తుందో చూడాలి.

## జాన్వీకి పెరుగుతున్న మద్దతు.. ఇప్పటికైనా మార్పు వస్తుందా?

డిజిటల్ యుగంలో కూడా లింగ సమానత్వం కోసం పోరాడాల్సి వస్తోంది అంటూ కొంతమంది నటీమణులు చేస్తున్న కామెంట్లు అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. సాధారణంగా ఒకప్పుడు మహిళలు అంటే వంటగదికే పరిమితమయ్యేవారు. కానీ కాలం మారుతున్న నేపథ్యంలో మహిళలు ప్రతి రంగాలలో ముందుంటున్నారు. అంతేకాదు అంతరిక్షానికి కూడా వెళ్లి తమ సత్తా ఏంటో నిరూపిస్తున్నారు. ఇక ఒక్కటేమిటి పురుషుడితో సమానంగా పోటీపడుతూ దూసుకుపోతున్న ఈ డిజిటల్ యుగంలో కూడా మహిళలకు సరైన గౌరవం లభించడం లేదు అని, పురుష అహంకారం ఎక్కువవుతోంది అంటూ జాన్వీ కపూర్ కామెంట్లు చేసిన విషయం తెలిసిందే. ముఖ్యంగా సమానత్వం కోసం ఇప్పుడు పోరాడగలిగితేనే వచ్చే జనరేషన్ కైనా ఈ ఇబ్బందులు ఉండవు అని ఆమె తన అభిప్రాయంగా చెప్పుకొచ్చింది. అయితే ఇప్పుడు ఆమె అభిప్రాయానికి అండగా నిలిచారు గ్లోబల్ స్టార్ బ్యూటీ ప్రియాంక చోప్రా. లింగ సమానత్వం కోసం మాత్రమే కాదు ఇలా పోరాడే వారికి కూడా మద్దతుగా నిలవాలి అంటూ చెప్పుకొచ్చింది. మరి అసలు విషయం ఏమిటో ఇప్పుడు చూద్దాం.



బాలీవుడ్ బ్యూటీగా పేరు సొంతం చేసుకున్న జాన్వీ కపూర్ శ్రీదేవి, బోనీకపూర్ వారసురాలిగా సినీ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది. ఒకవైపు నటనతో అందరి దృష్టిని ఆకట్టుకుంటున్న ఈమె.. మరొకవైపు సినీ ఇండస్ట్రీలో మహిళలు ఎదుర్కొంటున్న విషయాలపై కూడా స్పందిస్తోంది. విషయంలోకి వెళ్తే.. తాజాగా ముంబై వేదికగా జరిగిన "వీ ది విమెన్ ఆసియా" కార్యక్రమంలో జాన్వీ మాట్లాడుతూ.. "మహిళగా పుట్టడాన్ని నేను గౌరవంగా భావిస్తున్నాను. సమానత్వం అనేది మాటలతో, చర్చల తోనే ప్రారంభమవుతుంది. మనం ఈ అంశం గురించి ఇప్పటికైనా ఓపెన్ గా మాట్లాడితేనే మన తర్వాత తరానికైనా దీనిపై పూర్తి అవగాహన వస్తుంది. నేను మహిళగా పుట్టినందుకు గర్వపడుతున్నాను. మనల్ని మనం ప్రశంసించుకుంటూ ముందుకు సాగాలి. మహిళలు శక్తిమంతులు. వారిని ప్రోత్సహిస్తే.. అద్భుతాలు సృష్టిస్తారు" అంటూ జాన్వీ కపూర్ తెలిపింది.

జాన్వీ కపూర్ మాట్లాడిన ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారడంతో ఈ వీడియోని తన ఇన్స్టాగ్రామ్ స్టేటస్ ద్వారా షేర్ చేస్తూ "ఇలా మాట్లాడే వారిని కూడా ప్రోత్సహించాలి" అంటూ గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా కామెంట్ చేసింది. జాన్వీ కపూర్ మాటలకు గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా మద్దతుగా నిలవడంతో అందరూ ప్రశంశలు కురిపిస్తున్నారు. అంతేకాదు ఇప్పటికైనా ఇండస్ట్రీలో మార్పు రావాలి అని కామెంట్లు చేస్తున్నారు.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536